చరిత్ర

# భారత సంగ్రామము - పరిణామము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

“ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్” ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంథాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123


“ మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి “

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# భారత సంగ్రామము - పరిణామము

2-2-18 Rep

## ప్రాతిపదిక

వైదిక యుగమునకు మహాభారత కాలము సంజవేళయనుట అనుచితము కాదు. ఈ సాయంకాలము క్రమముగా కాంతి సమాప్తికి, అంధకార సంవ్యాప్తికి ద్యోతకము. ఆ సమయమందు ఏ వస్తువైనను కనుపడీ కనుపడని స్థితిలో నుండుటచేతప్ప స్పష్టముగా గోచరించుదశలో నుండదు. ఆలాంటి అస్పష్ట స్థితియే మహాభారత యుద్ధమునకు మూలము. ఆనాటి భారత నాయకుల వివేక శక్తి కూడా ఆత్మీయ పరకీయములను స్పష్టముగా వివేచించుకొన లేకపోయినది.

మహాభారత యుగములో ప్రస్తుతము మనకు కనపడుచున్న ఫారసీ ధర్మ (మతము) కానీ ఆపిదప వెలువడిన ఈసవీ, మూసవీ, ఇస్లాం మున్నగు ధర్మము (మతాలు) లు ఏవీ ఉన్నట్లు కనబడవు. అందుచే అపుడున్నది కేవల వైదిక ధర్మమేయని వేరుగా చెప్పనక్కర లేదు. ఐనా అదికూడా నామమాత్రముగానే ఉన్నది కాని దృఢముగా లేదు. అనగా దాని మౌలికదృష్టి (ORIGINAL SPIRIT) జాతిలో లోపించినది. వేదముయొక్క అధ్యయనాధ్యాపన పద్ధతులు కూడా క్షీణించిన వనవచ్చును. ఆధునికులైన సాధారణ హిందువులకు వేదవిషయజ్ఞానము లేకున్నను "వేదములనునవి ఉన్నవి" అని తెలిసి నట్లుగా ఆనాటి సామాన్యుల దశకూడా అటులేయై ఉండవచ్చును.

ధర్మయుద్ధమని చెప్పబడుచున్న భారత యుద్ధము ధార్మిక యుద్ధముకాదు. ప్రస్తుత పరిపాటి ననుసరించి క్రైస్తవులు హిందు

వులతోకానీ, హిందువులు ముస్లింలతోకానీ, ముస్లింలు క్రైస్తవులతో కానీ మత (ధర్మ) విషయములపై పోట్లాడుకున్నచో నది ధార్మిక యుద్ధమనబడును. ఈ దృష్టితో చూచినచో దుర్యోధన యుధిష్ఠిరుల ధర్మములు భిన్నములుకావు. ఆరాధ్యదైవ మిరువురకొకడే. ధార్మిక విషయములలో శాస్త్రీయ విషయములలో దృష్టి భిన్నతలేదు. ఈ ఇరుపక్షములు కూడా ఆస్తిక్య, కర్మఫల, పునర్జన్మ సిద్ధాంతముల నంగీకరించునవే. అన్నిట సమానులై కూడా పరస్పర శత్రువులై, రక్తపిపాసులై యుద్ధమునకు సిద్ధపడుట కేవలము రాజ్యముకొరకు, రాజ్యాధికారము కొరకేగదా! ఆ అ ధి కా ర మె వ రి ది? అను నిర్ణయము ఖడ్గశక్తిద్వారానే జరుగవలసి వచ్చెను. ఫలనన శాస్త్రముల ప్రభావముకానీ, శా స్త్ర జ్ఞు ల ప్రభావముకానీ ఆనాడెవరిపైనను లేకుండుటయు, మార్గనిర్దేశకుడై ప్రపంచము నడిపించగల సద్బ్రాహ్మణుడు లోపించుటయు కారణములు.

లోకాభ్యుదయము దృష్ట్యా వేదములందు ముఖ్యములైన రెండు శక్తులు గొప్పవిగా వర్ణింపబడినవి. అవి:—1. బ్రహ్మశక్తి-ఆత్మశక్తి. 2. క్షాత్రశక్తి - శారీరకశక్తి ఈరెండు శక్తులు తమతమ హద్దులలోనే నిల్చి ఒకదాని ప్రభావముచే మరొకటి ప్రభావితమగుచున్నంతకాలము మానవజాతికి క్షేమమే. అనగా ఆత్మ శరీరమునకు త్రోవ చూపించుట, శరీరము ఆత్మ కార్యములకు తోడ్పడుచు తన హద్దుల నతిక్రమించకుండుట ధర్మము. కానీ ఆత్మ శరీరముల సమైక్యతలో వికార మేర్పడినప్పుడు మాత్రము జ్ఞానము కర్మకును, కర్మ జ్ఞానమునకును తోడ్పడుట జరుగదు. ఈ రెంటిలో పరస్పర సహకారము లోపించును. అపుడు కన్ను కాలుకు త్రోవ జూపింపలేదు, కాలు కంటిసైగను గ్రహించలేదు. గ్రుడ్డివాడు గోతిలో కూలకేమగును?

మహాభారత కాలమందు మన దేశస్థితి ఇట్టిదే. ఆ యుద్ధము ప్రపంచమందపుడున్న పండితుల యొక్కయు, పరాక్రమశాలుర యొక్కయు జీవనముల ముగింపుతో ముగిసినది. ఇట్లు వైదిక యుగమునకు చెందిన పండితులందరును పరమపదించుటయు, వీరపురుషు

లందరును వీరగతికి చెందుటయు జాతిజీవనమునకు ఆధారావలంబనములు రెండును శూన్యప్రాయములైనవనియే చెప్పవచ్చును. వైదిక ధర్మముయొక్క ఆత్మ (మౌలికత) ప్రపంచమున కనిపించకుండ పోయినది. యిక లోకమున మిగిలినది దాని శరీరము మరియు పేరు మాత్రమే. అప్పటి సమాజ స్థితిగతులను జాగ్రత్తగా పరిశీలింతుమేని ఆయుద్ధమునందసువులు గోల్పోవుటకు మున్నే బ్రాహ్మణులు బ్రహ్మ తేజస్సును, క్షత్రియులు క్షాత్ర ధర్మమును గోల్పోయి యుండిరని బోధపడుచున్నది.

ద్రోణాచార్యుడు బ్రాహ్మణుడే కాని యతనిబ్రహ్మతేజమునకు స్వాతంత్ర్యము లేదు. క్షత్రియసేవ (ఉద్యోగము) లో కేవల మాతడొక సైన్యాధిపతి యుద్ధనిర్వహణాధికారియే కాని నిర్ణయాధికారి కాడు.

పాలసీ (Policy) ని నిర్ణయించువాడు రాజు. తదాజ్ఞను పరిపాలించువాడు సేనాపతి. రాజుయొక్క ఆదేశానుసారమే యుద్ధము జరుగును. రాజే పాలసీ నిర్ణేతయను విషయము గీతారంభమున స్పష్టపరుపబడినది. కురుక్షేత్రమున ఇరుపక్షముల సేనలు యుద్ధసన్నద్ధములై నిల్చియున్నప్పుడు దుర్యోధనుడచ్చటికి వచ్చెను. రెండు పక్షముల సేనలను పరికించిచూచెను. ద్రోణాచార్యునకే దో సూచించి యుద్ధారంభమునకాజ్ఞనిచ్చెను. భీష్మపితామహుడుకూడ అచ్చటనే యున్నాడు. కాని పాలసీ నిర్ణయమునకు కాదు. ఆ నిర్ణయాధికారము దుర్యోధనుని గుప్పిటిలోనే యున్నది. అది యెప్పుడో నిర్ణయమైపోయినది గూడ. "యుద్ధమౌతుంది సూదిమొన మోపునంత భూమికూడ యుద్ధము జరుగకుండ యివ్వబడదు." అన్నప్పుడే బ్రాహ్మణశక్తి ఓడిపోయి క్షత్రియ శక్తికి అధీనమైనది. ఇక సేనాపతి రాజుగారి ఉప్పూ, పులుసు తినుచు జీవిస్తాడు కావున ఆ ఋణము తీర్చుకొనుట అతని కర్తవ్యము. అక్షరాల అంతే జరిగినది.

పాలసీ నిర్ణయమున ధర్మమున కిడవలసినంత ప్రాధాన్యత ఇవ్వబడలేదు. ధర్మమను శబ్దమును మనమెన్నియోసార్లు వినుచున్నాము. "యతోధర్మస్తతోజయః" — ధర్మమున్నచోట జయముండును అను విషయము భారతమందెన్నియో మారులు కన్పడుచున్నది. అయితే ఇదొక చిలుక పలుకువలె ప్రతివాడు వాడు సాధారణమైన మాటయే యైనది. అంతకుమించి "ధర్మ" మనున దేమిటి ? అని మనమెప్పుడు ఆలోచించలేదు వేదమును గూడ అడుగలేదు.

ఋగ్వేదమందు "కృషిమిత్ కృషస్వ అక్షైర్మాదీవ్యః" "ఓ మనుజుడా ! జూదమాడకుము, కృషిచేయుము" అని ఒక యుపదేశమున్నది. ఈ రెండువాక్యములును సాధారణములే కాని ఈ వాక్యములందు జూదరికిని, కర్షకునికిని గల భేదమును తెలుపు ఒక నిగూఢ సత్యము ఇమిడియున్నది. కర్షకుడు కార్యాకారణములకు గల ఘనిష్ఠ సంబంధమును బాగుగా నెరుగును. భూమిలో యేజాతి ధాన్యమును విత్తితే ఆజాతి ధాన్యమే పండునని అతనికి అనుభూత విషయమే. తోడ్తో పైరునకు నీరు, పశుపక్ష్యాదుల నుండి దాని రక్షణ మొదలగు యేర్పాట్లు చక్కగా చేయలేకున్న అది దక్కదని గూడ యెరుగును. అందుచే దృఢమైన విశ్వాసముతో రైతు వ్యవసాయమొనర్చును. ఇక జూదరి విశ్వాసము దీనికి విరుద్ధము. అతడు కర్మకు, కర్మఫలమునకు సంబంధముండునని భావించడు. ఫలప్రాప్తి ఒక ఆకస్మిక సంఘటనమని విశ్వసించును. అనగా "యే ధాన్యమును విత్తిననేమి ? భగవంతుని దయ యున్న చాలు, అనుకున్న పైరు చేతికి వస్తుంది" అనిభావిస్తాడు.

ఈశ్వరుడు సర్వశక్తివంతుడు, అనుకున్నట్లు చేయగలవాడు. ఎంతటి దృఢవిధానమునైనను సరే ! ఆయనయిచ్ఛ తుడచివేయగలదు. అట్టి ఈశ్వరేచ్ఛను జూదరి తన పాచికలతో నిర్ణయించుకొనవలయునని యనుకొనునే గాని ఆ యిచ్ఛ యెట్లున్నదో తనకు తెలియదు. పోనీ, ఆ ఈశ్వరునైనను "నీ ఇచ్ఛ యేమి ?" అని యెప్పుడైనా ప్రశ్నింపడు. ఆ జూదరి అంతర్ముఖుడై భగవంతుని యీ ప్రశ్న యెప్ప

దైన అడుగ యత్నించినచో అతని యాత్మయైన అతనికి కొంత తోడ్పడి యుండెడిది. ఈశ్వర శక్తియైన కొంత సలహా యిచ్చి యుండెడిది. అప్పుడా జూదగాడు ఈశ్వర నియమము ప్రకారము ఈశ్వరేచ్ఛ యననేమో తెలిసికొనగల్గియుండెడివాడు. కాని అతడటుల చేయడు. తన పాచికలతోనే ఈశ్వరశక్తిని పూర్తిగా అనుభవింప చూచును. అందుచే అతడు పందెముపైననే బుద్ధిని, శరీరమును అనగా తన జ్ఞానశక్తిని, కర్మశక్తిని రెంటినీ బలిచేయును.

యుధిష్ఠిర దుర్యోధనుల మధ్య జరిగిన వ్యవహారమిదే. సత్యమేదో! సత్యముకానిదేదో! నిర్ణయించునవి (సూక్ష్మబుద్ధులు, శాస్త్రములు కాక) జూదమాడు పాచికలే యైనవి. ఇరువురివి జూదరస్వభావములే. కార్మిక మనః ప్రవృత్తులు కావు, కర్మనంగీకరించునవికావు. ఇది సరాసరి వైదిక ధర్మమునకు జరిగిన అవమానము. ఇట్టి ధర్మావమానమునకు పరిణామము నాశనముగాక మరేముండును?

దార్శనికులలో గ్యాంబ్లింగ్ ఫిలాసఫీ (Gambling Philosophy) అను పేర ఒక సంప్రదాయమున్నది. ఆ సాంప్రదాయమువారు ప్రపంచములోని కార్యాకారణ సంబంధము కేవలము కాల్పనికమనియు, నిజముగా కార్యములేదు కారణము లేదనియు అందురు. జొన్నలు చల్లితే జొన్నపైరు వచ్చును గదా! అని ప్రశ్నిస్తే వారు:- "అది యిపుడనుభవములో నున్నను ముందు గూడా యిట్లే యుండగలదని యెవరు గ్యారంటీ యివ్వగలరు? మానవునకుగల్గిన అనుభవము లెన్ని మారిపోలేదు? అందుచే యివి కారణములు, యివి కార్యములు అని తేల్చు ప్రస్తుత జ్ఞానము ముందు ముందు అనుచితమైనదిగా ఋజువు కావచ్చును. కావున మన సిద్ధాంతములు, యుక్తులు మొత్తము కాల్పనికములు. సత్యములు కావు. ఈప్రపంచమేమిటి? ఇదొక జూదము. అందుచే యుధిష్ఠిర దుర్యోధనులు జూదమాడితే ఆశ్చర్య పడవలసినదేదిలేదు." అందురు. కాని వైదిక దర్శనము దీనికి విరుద్ధము. సూక్ష్మ బుద్ధితో పరిశీలింతుమేని ప్రపంచమందు మనకొక జ్ఞానశీల పదార్థ మహిమ గోచరించును. అది కర్మ, కర్మఫల

ములలో కించిన్మాత్ర భేదమైనను రానీయదు. అందుచే "ప్రపంచమొక వ్యవసాయ క్షేత్రముగాని జూదగృహము కాదు" అని కచ్చితముగా బోధపడుచున్నది. మహాభారతారంభము జూదముతోనైనది గాన యిది అధర్మారంభము.

## సాంఘిక స్థితి

జూదము వైదిక శిక్షాదీక్షకులకు విరుద్ధ కార్యము. ఆనాటి సంఘములో వైయక్తికాధికారుల కేమంత ప్రాధాన్యతయున్నట్లు కన్పడుటలేదు. "ధర్మ"మాత్రము వైదిక "ధర్మ"మే. వేరే "ధర్మ" లేవియు లేవనుట నిర్వివాదము. ఐననేమి ? జీవనశక్తి కోల్పవడిన ధర్మము సమాజమును సజీవముగా నుంచజాలదు. మండుచున్న నిప్పురవ్వ చిన్నదైయును పులిని వెరపించగలదు. కాని బొగ్గులకుప్ప ఎంత పెద్దదైననేమి? చీమను కూడా భయపెట్టజాలదు. జీవిత వైదిక ధర్మమందు శక్తి యుండెను. అది సమాజమందు నిరంతరము జీవనోత్పత్తిని చేయుచుండెను. కాని దురదృష్టవశాత్తు మహాభారతకాలము వరకు ఆ స్థితి తలక్రిందులైనది. జీవనశూన్యమై నిలచియున్న అప్పటి వైదిక ధర్మము కాదు. అది దానియొక్క శవము. జీవన సహితమైన శరీరముతో సాధింపబడదగిన అభ్యుదయము జీవరహితమైన దేహముతో సాధింపబడు టెట్లు? దాన అనభ్యుదయమే. కాకున్న:—"ధర్మ రాజని, ధర్మపుత్రుడని ప్రపంచ ఖ్యాతి గాంచిన యుధిష్ఠిరుడు అధర్మ కార్యమగు జూదమునకు గురియై తనను, తనదేశమును, జాతిని వినాశ మహాసముద్రములో ముంచినాడన్న వేరే కారణమేమున్నది?" దాని పరిణామమును తర తరములుగా నేటికిని భారతజాతి అనుభవించక తప్పుటలేదు.

ఏది ధర్మము? ఏది అధర్మము? ఇదొక కఠిన ప్రశ్నయే. కాని ఒకవిధముగా ఆలోచిస్తే యేమంత కఠినమైనది కూడా కాదు. ఎట్లన వక్రతారహితమైన మార్గమే సన్మార్గము. అదే ప్రశంసనీయమైన ఋజుమార్గము. ఏది నిర్దుష్టమో అదే మార్గము. దుష్టమైనది మార్గము

కాజాలదు. ఉదాహరణకు రెండు బిందువుల మధ్య సన్నిహితమైన చిన్న రేఖయే అన్నిటికన్న సరళమార్గము. అదిగాక తక్కినవన్నియు వంకరటింకర రేఖలే. వానిని గీతలన్నను తప్పులేదు. ఆ వంకర గీతల ననుసరించి మానవులుకాదు; చీమలు కూడా నడువవు.

అట్లే ధర్మమందు ధూర్తత, కాపట్యతలక్కరలేదు. స్వార్థము ధర్మమును వికారపరచునట్టి పదార్థము. అది యితరులముందొక వికృతమైన ఆదర్శమును నెలకొల్పును. ఇందుకు వివాహానంతరము గాంధారీదేవి కనులకు గంతకట్టించుటే ప్రబల ప్రమాణము. గాంధారీ దేవి పతివ్రత, ఆమెకు గ్రుడ్డియగు ధృతరాష్ట్రునితో వివాహము జరిగినది, కాని గాంధారీ స్వయంవరమైనట్లు, అందామె ధృతరాష్ట్రుని వరించినట్లు భారతమందెచ్చటను కన్పడదు. ఐన యీామె ధృతరాష్ట్రుని మెడకెట్లు కట్టబడినది? ఈ ప్రశ్నకు—1. లోకములోని రాజులు తమ యంతఃపురమునెట్లు భర్తీచేసిరో 2. కొందరు వ్యక్తులు స్వీయలాభమును రాజుల కామవాసనాపూర్తితో ముడివైచుకొని సౌందర్యవతులగు కన్నెలనప్పగించు విధానమో! లేక ఉన్నతస్థానమున నున్నవారికి కన్నెలనిడి ఉన్నత స్థితి సంపాదించనెంచువారి పదవీ వ్యామోహమో! ఎట్లో మెడగట్టబడ్డదనుటే ఉత్తరము.

సహజ సౌందర్యవతి, గాంధారదేశ రాజపుత్రికయగు గాంధారీ దేవి అంధుడగు ధృతరాష్ట్రుని రాణియై అంతఃపురములో ప్రవేశించినది. క్రొత్తగా వచ్చిన వధువునకు పాతపరిచారికలు పురోహితులు అమ్మా! "ప్రతి స్త్రీ తన భర్త సంతృప్తికై తానొక సాధనమైపోవలె. భర్తకు లభించని ఎట్టిసుఖమునైనా భార్య అనుభవించకూడదు," "ఈదృష్టితో జూచిన కనులతో గడించవలసిన సుఖము నీ భర్తకు ప్రాప్తిలేదు. గాన అది నీకుగూడ తగదు" "ఇదే ధర్మ," "యిదే పతివ్రతము" అని ఉపదేశించియుండిరి కాబోలు. అంతే జరిగినది. దురదృష్టవశాత్తు పతివ్రతధర్మ కాదర్శమదేయైనది. నేటికిని కన్యకలముందు, సామాన్య స్త్రీలముందు కొనియాడబడునదిదే. ఐన యీా ఆదర్శము సంగీక రించుట ఉపేక్షించుట వేరే విషయము. లోకములో యిపుడుకూడా

అంధులెందరో ఉన్నారు. కాని వారి భార్యలు మాత్రము కనులకు గంతలు కట్టుకొనియున్నట్లు కన్పడదు. గాంధారీ దేవి యిందుకు విపరీతముగా తన జీవితమంతయు కనులకు పట్టీకట్టుకొనియే గడిపినది. ఈ విషయమును "మంచికనులుంచుకొనికూడా గాంధారి గ్రుడ్డిగా గడపినది" అని పొగడి వ్రాసిన వ్రాతలున్నవి. కాని జాగ్రత్తగా ఆలోచించిన యిది ధర్మముకాదు. కేవల ధర్మాడంబరమగును.

మనుస్మృతిలో "నలింగమ్ ధర్మకారణమ్" అని ఉన్నది. అనగా బాహ్యాచిహ్నమే ధర్మమనబడదు. ధర్మము:—మనసుతో, మానసికభావములతో సంబంధముకలది. మూడుపోగులు గల సూత్రమును ధరించినంత మాత్రముననే కుఱ్ఱవాడు బ్రహ్మచారి కాజాలడు - బ్రహ్మచర్యవ్రతమునకు సంబంధించిన కఠిన నియమాలు పాలిస్తేనే తప్ప ఇట్లే పాతివ్రత్యమునకు అనేక రూపములున్నవి. కనులపట్టీ కట్టుకొనుటగాదు. ఈ సమాలోచనము పాఠకులలో కొందరకు బాధాకరము కావచ్చును. కాని యీ ఆదర్శమును తమపై చరితార్థము చేసికొనగలిగినప్పుడు యిది ధర్మముకాదని స్వయముగావారే గ్రహించెదరు. ఏదో ఒక దుర్ఘటనలో కాలువిరిగి మీరు కుంటివారుకాగా, మీ మిత్రులు "స్ట్రెచర్"పై మిమ్మింటికి తెచ్చిరనుకొనుడు. మీరాకకు ముందే యీ వార్త విన్న మీ గృహిణి కాలు విరగగొట్టుకొనియో, మరేతీరుననో మీవలె నడువలేని దుస్థితిని కల్పించుకొని, పడియున్నచో మీరాపనిని పాతివ్రత్యమేయని భావింతురా? బాధలోనున్నమీకు అట్టి భార్య యే సేవ జేయకలుగునా? లేక మీ బాధ నివారించుట కవసరమైన వస్తువులు సమకూర్చుటలో, డాక్టర్లను రావించుటలో కాలికి నిలకడలేకుండా కష్టపడి నడువగల భార్య చేయగలుగునా? అట్లే అంధుడగు పతికి కనుల గంతకట్టుకొన్న గాంధారి యేమి సేవ జేయగలిగియుండెడిదో యూహింపుడు.

భర్తకు భార్య చేయునంత శ్రద్ధగా మరొకరు సేవచేయజాలరు. స్త్రీకి సేవయే పాతివ్రత్యము. గాంధారీదేవి పతివ్రతయే కాని పాతివ్రత్య శబ్దమునకు గల వాస్తవికార్థము నామె గుర్తించలేదు. ఇందలి

దోషము ఆమెది కాదు. ఆ దోషము — "పతివ్రత" శబ్దమునకు అనుచితార్థము చేసిన ఆనాటి పండితులది. వారితోపాటు పై చిహ్నములను మాత్రమే ధర్మమనుకున్న ఆకాలపు మానవ సంఘానిది. నేడుకూడ పై నుదహరించిన స్మృతి శ్లోకమును, దాని అర్థమును లోతుగా ఆలోచించరు. కాషాయ వస్త్రధారణే సన్యాసమనుకొనుచున్నారు.

సన్యాసి యెవరు? సన్యాస ధర్మమేమి? అని విచారించరు. "వృద్ధాప్యము వచ్చినది గాన యిక సన్యసించవలసినదే" అందురు. ఈ మాటతో సన్యాసమునకు వృద్ధాప్యమే అర్హతయని బోధపడుచున్నది. వృద్ధుడైనవాడు లోభి, క్రోధి, అత్యాశాపరుడు....ఎట్టివాడైనాసరే! కాషాయవస్త్రములు ధరించిన చాలు, సన్యాసియైపోవుచున్నాడు. వాని పాపము లదృశ్యములగుచున్నవి. ఇట్టి సన్యాసులు మనదేశమందు కోకొల్లలు. బర్మా, సయాం మున్నగు బౌద్ధదేశములలో సన్యాసులదే రాజ్యము. ఇట్టి (బాహ్యాచిహ్నమే ధర్మమనుకొను) అంధ విశ్వాసము మహాభారతకాలము నాటికే ఆరంభమైయుండెను కాబోలు! పాపము గాంధారీదేవి ఆ అంధకారావరణకే గురియైనది.

ఏ యే అంధుని భార్యయైనా "నాకేదైనా ఉపదేశించండి" అని నన్నడిగినచో "దేవి! నీభర్త అంధుడు. ఆ లోపము అతని వంశమునకు నష్టసాధనము కాకూడదు. అందుకై నీవు విశేష బాధ్యత వహింపవలసియున్నది. పతివ్రతయైన పత్నికి ఇదే కర్తవ్యము. నీ పతి దృష్టిగలవాడే యైయున్న నీ రెండు కనులు నీకు చాలియేయుండెడివి. యిపుడటుల కాదు. నీకర్తవ్య నిర్వహణకై రెండు, నీభర్త అవసరములు తీర్చుటకై మరి రెండు నాల్గు కన్నులవసరమైనవి. నీ రెండు కనులతోనే నాల్గు కనుల దృష్టిని చాకచక్యముగా నిర్వహించవలసియుండును" అని ఉపదేశించియుందును. అపుడామె గాంధారిని ప్రస్తావించినచో అమ్మా! ఆ తెచ్చిపెట్టుకొన్న గ్రుడ్డితనమే ఆమె అయోగ్యతకు కారణమైనది. తండ్రి గ్రుడ్డి, తల్లి గ్రుడ్డి. సంతానము నెవరు తీర్చిదిద్దవలెను? గాంధారీదేవి కానాడు వాస్తవ ధర్మము నెవరైనా యుపదేశించి యుండినచో మహాభారత యుద్ధము—దానివలన కల్గిన నాశము మనజాతికి సంభవించి

యుండెడిది కాదు. ఆనాటి ఉపదేశకుల దృష్టి కీ చిన్న విషయమేల రాలేదో తోచదు.

మొత్తముమీద వైదిక ధర్మమను సూర్యుడు అస్తమించెను. "అంధేర్‌నగరి" ఆరంభమైనది. ఆ అంధానుకరణ చిహ్నమే గాంధారి కనుల గంత.

## పతనారంభము

"మీ అదృష్టమును మీ పరాక్రమమును పరీక్షించుకొనదలతురేని మాతో జూదమాడుటకు రండు" అని దుర్యోధనుడు, వారి మిత్రులు యుధిష్ఠిరుని ఛాలెంజి (సవాల్) చేసినారు. ఇది ఒక కాలేజీ హాకీ టీమ్ మరొక కాలేజీ హాకీ టీమ్‌కు చేసిన ఛాలెంజివలె నున్నది. ఛాలెంజీని స్వీకరించకుండుట తమ బలహీనతనో, ఓటమినో, అంగీకరించినట్లగును. యుధిష్ఠిరుడట్లే భావించియుండెనేమో!

సామాన్య మానవునిగా నేనీ విషయము నాలోచించిన ఇది హాస్యాస్పదమనిపించును. ఎట్లు జరిగినదో తోచదు, కాని జరిగినది. ఎవరైనను "జూదమాడుదము రా!" అని నన్ను పిలిచిన జూదరి నెవరి నైనా వెదకికొమ్మని జవాబు చెప్పుదును. జూదమునకై చేసిన ఆహ్వాన మును మంచివారంగీకరించరు, సరికదా! వారితో మాటలాడుటకు కూడా యిష్టపడరు. నేటి కాలేజీ విద్యార్థులు కూడా చెడునడతగల పార్టీతో హాకీ మ్యాచ్ ఆడరు కాని యుధిష్ఠిరుని ఆత్మాభిమానము మాత్రము శకుని దుర్యోధనుల ఆహ్వానమును తిరస్కరింపలేక పోయినది.

సరే! జూదమారంభమైనది. రాజు తనను పణముగా పెట్టుకొని ఓడిపోయినాడు. రాణిని ఒడ్డినాడు. ఓడిపోయినది. సంఘమా! వైదిక సంఘము కాదు. అంధేర్‌నగరి. సభ్యతగల సంఘములలో "వ్యక్తి అధికారములు" అనేవి కొన్ని ఉంటవి. వాని రక్షణే వైదిక ధర్మ కాధారము. వైదికధర్మమందు భార్య, భర్త, కొడుకు, తండ్రి,

ఇరుగు, పొరుగు మున్నగు వారలలో ప్రతివారి అధికారము సురక్షితమై యుండినది.

వైదిక యజ్ఞములలో "విశ్వజిత్" అను పేరుగల యజ్ఞమొకటి యున్నది. దానిని గూర్చిన వర్ణన పూర్వమీమాంసా శాస్త్రమున కన్పడుచున్నది. ఆ యజ్ఞమందు యజమాను డేమియుమిగుల్చుకొనక తన సర్వస్వమును దానముచేయవలె. ఆ సందర్భమున యజ్ఞకర్త దేనిని దానము చేయవచ్చు? దేనిని కూడదు? అను ప్రశ్నలు శాస్త్రకారులు స్వయముగా లేవనెత్తుదురు. ఆ ప్రకరణములో మొదటి ప్రశ్న:—తల్లిదండ్రులు వృద్ధులైయున్నచో వారిని దాన మిడ వచ్చునా? లేదా? - ఇందుకు - తల్లిదండ్రులు కుమారుని సంపద కాదు గాన ఆ ప్రశ్నయే వ్యర్థమని ప్రత్యుత్తరము. అది వాస్తవమే. ఎవని కేవస్తువుపై అధికారములేదో వాడు దానిని దానమెట్లివ్వగలుగును? నా యింటిని దానమిచ్చినట్లే నా ఇరుగు పొరుగువారి యిండ్లను నేను దానమివ్వజాలను. ఏల? అవి నావి కావు. ఇక రెండవప్రశ్న:—రాజు తన రాజ్యమును దానమివ్వగలడా? ఈ ప్రశ్నకు "రాజ్యమునకు రాజు శాసకుడే కాని" "సర్వే సర్వస్వామి" కాడు. అతడా రాజ్యోన్నతికి బాధ్యుడు. అంతేకాని దానిని కుదువబెట్టుటకు, దానమిచ్చుటకు, విక్రయించుటకు "అర్హుడు కాడు" అని శాస్త్రముల ప్రత్యుత్తరము. ఈ దృష్టితో నాలోచించిన యుధిష్ఠిరునకు రాజ్యమును జూదమున పణముగా నొడ్డు అధికారములేదు. అట్లే గెల్చుకొన్నవారికి కూడా రాజ్యమును స్వాధీన పరచుకొను అధికారములేదు. ఇట్టిదే ద్రౌపదీ దేవి విషయము.

అసలు ద్రౌపది కథయే ఆలోచనాపరుల కొక సమస్యయై కూర్చున్నది. "ద్రౌపది, ఆమెకు భర్తలైదుగురు" అను విషయమున చాలా గ్రంథములు పరిశోధించితిని. ఐనను యీ విషయము వివాహ నియమములకు సంబంధించినది. వేదములందీ వివాహ నియమములు నిశ్చితములై యున్నవి. భార్యాభర్తల అధికారములను, స్వాభావికములైన విషయములను వేదములు రక్షించుచున్నవి. ఈ నియమ

ములలో ద్రౌపదీదేవి కథ దేనికిని సంబంధించదు. ఐన ద్రౌపదీదేవి ఐదుగురు సోదరుల నేల వివాహమాడినదో తెలుపు కథ యొకటి ప్రపంచమందున్నది. అది దేశప్రసిద్ధమైనదే యైనను అర్థము శూన్యము, అవిశ్వసనీయమైనది. అట్టి కథను గూర్చి ఆలోచించుటకు బుద్ధి ఏమాత్ర మియ్యకొనదు. మహాభారతగాథలోగల ధర్మచ్యుతి కిదియొక యుదాహరణము.

భార్య భర్త యొక్క చరాస్తి కాదు. ఆమెను పందెముగా పెట్టిగానీ, ఖరీదుకమ్మిగానీ, దానమునిచ్చిగానీ యితరులకప్పగించు అధికారము భర్తకు లేదని నా యభిప్రాయము. ముఖ్యముగా ద్రౌపదిని పందెములో పణముగా పెట్టు అధికారము యుధిష్ఠిరునకు, గెల్చుకుంటిని గాన ఆమె నాదను అధికారము దుర్యోధనునకు లేదు. ఈ ధర్మమునే ద్రౌపదీదేవి అడిగినది, మొత్తుకున్నది, నాటి సంఘము నోరు తెరువలేని దుస్థితిలో మునిగియున్నది. ఇంతటి అజ్ఞాన ధర్మములకు నిలయమై పోయిన మనఃప్రవృత్తులకేమి ఫలము ? ఆ సంఘము పూర్తిగా నష్ట మగుటయే. ఈ అధర్మమందు ఒకరు ముందు మరొకరు పిదప అను కించిన్మాత్ర భేదమే తప్ప అందరు సమభాగులే.

యుద్ధము జరుగరాదనుదృష్టితో శ్రీకృష్ణుడు చాలా యత్నించి నాడని భారతమున వ్రాయబడి యున్నది. ఆ రాయబార వర్ణనము చేసినచోట యీ ధర్మనియమముల నతడంతగా ఉగ్గడించినట్లు కన్ప డదు. భీష్మపితామహుని ప్రశ్నిస్తే ఆయన ఆకున అందకుండా పోకన పొందకుండా ఉండునట్లు "యతోధర్మస్తతోజయః" అని జవాబు చెప్పినాడు. కాని ధర్మమందెవ్వరున్నారు ? ఎవ్వరులేరు ? నిరూపించ లేదు. ఈరెండు పక్షాలలోవారు తమ వరకు తాము సత్యస్థులమేయని భావించుకొనినారు. కాని ఉభయ పార్టీలు సత్యదూరస్థలములే. ధర్మకు నీళ్లు వదలినవే. ఈ స్థితిలో జయమెవరికి ? అపజయమెవరికి ?

పేరుకు మాత్రమే పాండవులు గెల్చినారు. కాని సత్యతః ఇది పాండవ విజయమేనా ? దేశము మాత్రము పూర్తిగా నష్టమైనది. పండితులు, జ్ఞానులు, వీరులు నిహతులైనారు. మిగిలినదెవరు? కొడుకుల

పీనుగులపై బడి యేడ్చుటకు గాంధారి, బంధువుల మృతికి విల పించుటకు కుంతి. ఇక దేశముయొక్క, దేశీయులయొక్క భవిష్యత్తుకు పూర్తిగా దెబ్బ తగిలినది. దానిఉన్నతి వేలేండ్లవరకుగూడా సాధ్యము గాకుండా పోయినది. సభ్యతకు మూలోచ్ఛేదమైనది.

మహాభారతము వైదిక గౌరవ కాలమునకు చరమసంధ్య యైనచో తరువాతవచ్చు కాలము తనవారెవరో, పరులెవరో గుర్తించ వీలులేని అంధకార బంధురమైన కాళరాత్రి. అందు కనులు లేనివాడు సరే సరి. కాని కనులున్నవారికి కూడా మార్గమెట్లు కన్పడును.

# అవతార, దేవదూతా వాదములు

శ్లో॥ యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।
అభ్యుత్థాన మధర్మస్య తదాత్ మానం సృజామ్యహం॥

అర్జునా! ధర్మమునకెపుడవనతి కలిగినను అధర్మమెపుడు తలెత్తినను నేనై నేను జన్మింతును.

శ్లో॥ పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే॥

దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ ధర్మ సంస్థాపనలకొరకై ప్రతికాల (యుగ) మున జన్మింతును.

ఈ శ్లోకములే ఈశ్వరుడవతరించుననుటకు ప్రమాణములుగా చూపబడుచున్నవి. ఈ సిద్ధాంత ప్రకారము "వైదికధర్మ కామాతము కల్గునపుడు వేద విరోధులు విజృంభించునపుడు పరమాత్ముడు స్వయముగా నవతరించి దుందుడుకుల తెగటార్చి ధర్మమునుద్ధరించుచున్నాడు" ఇది హిందూ ధర్మ భావనకు పునాది. దీని ననుసరించియే మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, పరశురామ, రామావతారములు మహాభారత (యుద్ధ)మునకు పూర్వమువచ్చి ఉద్దిష్ట కార్యములు నెరవేర్చి పోయినవి.

ఈ వాదమును యితర దేశములు సమంజసమనుకొనవు. పైగా ఆ భగవంతునకు "ఉన్నత స్థానమును వదలి నిమ్నమైన భూమిపై జన్మించుట అవసరము" అని తలంచుటే అధర్మమనుకొన్నవి. ఈశ్వరుడు సర్వ శక్తిమంతుడు. అతడేదైన చేయగలడు. ఉదాహరణకు రాజ సింహాసనము నుండి క్రిందికి దిగి రావలసిన అవసరమేమున్నది ? సేవకు లనేకులున్నారుగదా? ఇట్టివిచారధారాధారమున "జరదస్త్" మున్నగు వారొక నూతన మతావిష్కరణమొనర్చిరి. ఆ మతము ననుసరించి ధర్మచ్యుతి కల్గునపుడు ఈశ్వరుడు తనదూతలను (నబీలను) స్వయముగా భూమిపైకి పంపునట. ఆ నబీలే దుర్మార్గులను సంహరించి ప్రజలకు సత్యమార్గమును చూపింతురట. ఈ కారణముననే పాశ్చాత్యదేశ ములలో పథ ప్రవర్తకులైన వారిని భారత దేశమందన్నట్లు ఈశ్వరు డనుటకు వీలు లేదు. కాని ఈశ్వరుని "ఏ జం ట్స్" లేక ఆయన "గవర్నర్ జనరల్స్" అనవచ్చును. దుష్ట సం హా ర ణ విషయమున అవతారవాదులదృష్టియే వీరిదృష్టి. రామునితోరావణునకు, కృష్ణునితో కంసునకు వైరసంబంధమెట్లుండెనో అట్లే "మూసా"తో "ఫిరజాన్"కు "క్రీస్తుతో" "యహూదీ" పూజారులకు వైరసంబంధమున్నది. హజ్రత్ మొ హ మ్మ ద్ సాహెబ్‌నకు గూడ కాఫిరుల (ఆయనతో ఎప్పుడు యుద్ధమొనర్చు మక్కామదీనావాసుల) గుంపు ఉన్నది.

వేదాభిప్రాయ మిందుకు విరుద్ధము. బ్రహ్మమె(భగవంతుడె)వరు అను ప్రశ్నకు వేదాంత దర్శనమున "సృష్టి స్థితి లయములొనర్చు సర్వోత్తమశక్తి" అని ప్రత్యుత్తరమీయబడినది. ఈశ్వరు డనుశుణ మేదో వస్తువును కల్పిస్తూ, పెద్దచేస్తూ, ఉ ప సం హ రి స్తూ నే యుండును "కురాను"లో గూడ "జీవనమునుండి మృత్యువు" "మృత్యువునుండి జీవనము" నిచ్చువాడే ఈశ్వరుడని ఎన్నియోచోట్ల చెప్పబడినది.

జనన మరణములన్నియు భ గ వం తు ని చేతనే యున్నట్లైన స్వయముగా జన్మమెత్తుటగాని నబీల నంపుటగాని ఆయన కవసరము లేదు. రాజు స్వయముగా పోజాలని చోట్లకు తన దూతలను పంపిం చును. కాని ఈశ్వరుని సత్తా (ఉనికి) మ రి యు శక్తి అసీమితములు

కదా! అనగా ప్రతిచోట ఉంటూ ఇతరుల తోడ్పాటులేకయే సృష్టి స్థితి లయములొనర్చు వాడైనపుడు అని అర్థము. ఇది యుక్తివాదము. ఇక ఇతిహాస దృష్ట్యా చూతము. ఘోరాతిఘోరములైన కష్టములు మానవులపై బడినవి. వానిని తట్టుకోలేకనే వారు ధర్మమార్గము నుండి విచలితులైనారు. క్రమముగా లోతైన అవిద్యాంధకార కూపమున పడియున్నారు. ఈవిధముగా సంస్కృతీ సభ్యతలకు దూర ములై నికృష్ట జీవనము గడుపుచున్న సమాజము లెన్నియోఉన్నవి. వీరిపై నధికారము చలాయించుటకు శక్తివంతములైన దేశములు అనుక్షణమేదోరీతిగా యత్నించు చున్నవి. కూడూ, గుడ్డా, కొంపా మొదలగు జీవన నిర్వహణ వస్తువులుగూడా లభించక నరకయాతన లనుభవించుచున్న మానవ సంఘములనెన్నిటినో మనము చూచు చున్నాము. అట్టిచోట్ల కేఅవతారముకాని, నబీకాని, పైగంబర్ కాని రాడేమి? క్రీస్తు అవతారమే నిజమైనచో ఈవలి రెండువేలేండ్లలో మానవ సమాజములెన్నో నాశనమగుచున్నను ఆ క్రీస్తు రాడేమి పోనీ, ఆ మహమ్మద్‌గాని ఆయన స్థానమున మరెవ్వరైనాగా జన్మించరేమి? భారతదేశములో అనేక హత్యలైనవి జీవితస్త్రీలను మృతభర్తల శరీరములతో కాల్చి చంపుచుండెడివారు. కాని వా తులను రక్షించుటకై యే అవతారమూ రాలేదు. బాధకులకు ఉపదే మిడుటకై పైగంబరుకూడా రాలేదు. ఈ అనుభవముతో గీతా శ్లో ములలోని "పరమాత్ముడు పుట్టుతాడు" అను భావము స్వార్థ దంభోక్తులుగా తెలియుచున్నవి.

పరమాత్ముడు మనుష్యులను సంస్కరించుటకై స్వయము రాడు సరికదా! ఎవరిని పంపడు. వైదిక కాలమందు సంఘ సంస్క లుగా ఎందరో మునులు, ఋషులు సుప్రసిద్ధులైరి. వారు సత ప్రదర్శన మొనరించుచు జాతి నేమాత్రము ధర్మచ్యుతి గాకుం కాపాడిరి. కాని వారెప్పుడైనను తమను పైగంబరులుగా చె కొనలేదు. ఆ మహానుభావులు తనతో నున్న మానవ సమాజవ గల అజ్ఞాన నివారణకై ఒక పండితు డేమిచేయునో, తన విద్యార్థు

నున్న అవిద్యా నివారణ కొరక అధ్యాపకు డేమిచేయునో అదే కర్తవ్య నిర్వహణ. అనగా "ధర్మపరిరక్షణ" చేయుచు వచ్చిరి. ఇదిగాక ప్రాకృతిక నియమములనుగూర్చి మనము కొంచెమాలోచించిన మానవుడు చేయవలసిన కర్మ మానవుడే చేయవలెగాని ఈశ్వరుడు చేయడని బోధపడుచున్నది. నీవున్న యిల్లు పడిపోకుండా నీవు మరమ్మతు చేసుకొనవలసినదే కాని దేవుడవతారమెత్తి రాడు. ఒకవేళ నీ ఒడలు, ముఖమును ప్రతిదినము నీవు శుభ్రపరచుకొనకున్న దేవుడువచ్చి వానిని కడుగడు. పరమాత్ముడు ప్రేరేపించునేగాని యాదేశింపడు.

రాత్రి నిద్రించి ఉదయమున మేల్కొనుటతోనే ప్రాకృతిక నియమానుసారము మన మనసులో ముఖమును కడిగికొనవలయునను కోరిక గల్గును. ఇట్లే యిల్లును శుభ్రపరచుకొనవలెనని, చదువురాని వారికి చదువుకొనవలెనని ప్రేరణ కలుగును. ఆయా ప్రేరణల ననుసరించి ఆయా కార్యములను మానవులు పూర్తి చేసికొనవలసినదే కాని భగవానుడు తగు సాధనములతో వచ్చి పూర్తి చేయడు. ప్రేరణ వేరు, ఆదేశము వేరు. ఒకవేళ నేదేని పని ఈశ్వరాదేశమైయున్నచో ఆపని పూర్తిగాకుండ నిరోధించు శక్తి ప్రపంచమందెవరికి కలదు? భగవానుడవతరించుట, పైగంబరులను పంపించుటలను గూర్చి చేయు ఊహలు వ్యర్థకల్పనలు. వైదిక విజ్ఞానమున కివి విరుద్ధములు. ప్రజలలో నిట్టి విశ్వాసము మోసగాండ్లకు, పటాటోప ప్రదర్శనావకాశ మిడినది. పైన నుదహరించిన "యదా యదాహి"...అను శ్లోకముల భావము ఆర్య సమాజికులలోకూడ కొందర ప్రభావితమొనర్చినట్లు కన్పడుచున్నది. "వైదికధర్మకు కల్గిన గ్లానిని తొలగించి మానవులకు పథ ప్రదర్శన మొనరించుటకై పరమాత్ముడు స్వామి దయానందుని పంపినాడు"అని కొందరందురు. ఐన నీయనకూడ పైగంబరో, రసూలో ఐనాడు. సనాతన ధర్మోపదేశకులలో ప్రసిద్ధుడైన స్వామి దయానందు (ఆర్యసమాజ స్థాపకు డితడుకాడు) వ్రాసిన "ధర్మకల్పద్రుమ"మను గ్రంథములో ఆర్యసమాజ స్థాపకుడగు మహర్షి ద యా న ం ద సరస్వతిని గూడ

ఈశ్వరావతారమని యభివర్ణించినాడు. దీనితో వారు ఈ యవతార పరంపర నింకను ముందుకు నడిపించినారు.

మహర్షి దయానందుడు తా నవతారమని యెప్పుడును చెప్ప లేదు. పథభ్రష్టులైన మానవులను చక్కదిద్దుటే ఆయన స్వాభావికేచ్ఛ. అందుచే ఆయన చేసిన కార్యముల కాయనయే బాధ్యుడు. మహాత్ముడైన శ్రీకృష్ణుడు పాండవులకు తోడ్పడుటకును, కౌరవుల నొప్పించుటకును చేసిన యత్నమునకు ఆయన స్వాభావిక సానుభూతియే మూలము. అంతియేకాని అంతకు మించి యీ కార్యమందీశ్వరుడవతరించుట లేక "నబీ"ఁనుపంపుట అక్కరలేనిపని. మహాభారత కాలమందెవరినెవరును అవతారమనుకొనలేదు. కృష్ణున కవతారత్వము అంటగట్టినవారు మహాభారతకాలము తరువాత జన్మించిన స్వార్థులు. వారా మహానుభావునికి పరమాత్ముడను పేరును ప్రయోగించుచు ప్రజలలో గల అజ్ఞానమును ఉపయోగించుకొనుచు లాభపడెడివారు.

స్వామి దయానందుని పరమాత్ముడంపిన పైగంబరుగా నంగీకరించుట ఆయనకు గల మహత్వమును తగ్గించుటేకాని పెద్దచేయుట కాదు. పైగంబరులమని చెప్పుకొనిన వారందరు తమను భగవంతుని చేతిపనిముట్టుగా చేసికొనినారు. చేయవలసినది భగవానుడు. చేయుచున్నది పైగంబరు. ఆదేశించవలసినది పరమాత్ముడు. కాని ప్రసారము చేయుచున్నది పైగంబరు అన్నమాట. దీనివలన పైగంబరు పని "గ్రామఫోను" పనిగా మారినది. ఆయన చేసిన పనులలో దేనికైనా ఆయన బాధ్యుడు కాడన్నమాట. ఇక స్వామి దయానందు డీశ్వరావతారము కాడు, పైగంబరు కాడు. కేవలము ప్రకృతి నియమానుసారము ప్రేరణనంది ప్రజలను పథభ్రష్టులను గానీకుండా జూచు నిరంతర యత్నశీలుడైన సంఘసంస్కర్త. ఈశ్వర నియమములకు సవరణ లుండవు., పరివర్తన లేదు. స్వామి దయానందుని వద్దకు స్వర్గమునుండి దేవదూతలు సందేశములు, ఆదేశములు తెచ్చినవారు కారు. ఆయన ప్రబోధమందు కాల్పనికములైన స్వర్గములు, కాల్పనికములైన దౌత్యములు, అర్జీలు లేవు. అన్నిటికన్న తొలిదైన వేద శిక్ష

మరియు ఈశ్వరుని సనాతన సత్తా, ఆయన ప్రేరణకీ రెండు చాలును. ఋషులు మహర్షులు అనాదికాలమునుండి చేసికొనివచ్చుచున్న పనినే వారును చేసినారు.

# కారుచీకటిలో కాంతిరేఖ

పుట్టిన ప్రతిప్రాణియు గిట్టుట ప్రాకృతిక నియమము. పండితుడు కానీ పామరుడుకానీ, వీరుడేకానీ భీరువేకానీ, యువకుడేకానీ వృద్ధుడే కానీ చావు తప్పదు. అందుచే భారతదేశమందలి విద్వాంసులు, శక్తిశాలురు, భారత యుద్ధమున చచ్చుట ఆశ్చర్యము కాదు. ఆ యుద్ధమే సంభవించకున్నచో భీష్మ, కర్ణ, దుర్యోధనాదులు చావకుందురా! వీలు లేదు. శర శయ్యపై గాకున్న చిరుకొయ్య పైననో రణభూమిని గాకున్న వనసీమనో మొత్తముమీద ప్రతివాడు చావవలసినదే. ఐతే చావు చావునకూడా భేదమున్నది. ఒకడు తన సంతతికి ఉన్నతి మార్గము చూపి చచ్చిన, వేరొకడు తనసంతతి తనతోనే నాశనమగునట్లు చేసి చనిపోవును. మనమందరము చచ్చేవారమే కాని దాయ భాగముగా దేశమునకేమి వదలిపోవుచున్నాము? ఉన్నతికి చేర్చు మార్గమును చూపగల జ్యోతినా? లేక నాశకారకములైన అజ్ఞానాంధకారములనా?

మహాభారతయుద్ధము "ధర్మకొరకు" అనియే జరిగినది. కాని యుద్ధ సమాప్తితో ధర్మము దానిని శ్లాఘించు వీరులును సమాప్తమైనారు. అందరకన్న యెక్కువ నిరాశచెందినవాడు శ్రీకృష్ణుడు. తన పరివారము (యదువంశము)వారే అధార్మికములైన సురాపానాది చెడుగులలో తలమున్కలగుట చూచినాడు. తన వయస్సునకు తగినంత నిరాశచెందినాడు. మహాభారతయుద్ధానంతరము భారత దేశ స్థితి గీతారంభమున అర్జునుని పలుకులకు సజీవ వ్యాఖ్యానమైనది.

యుద్ధము మానవత్వమునకే మహా ప్రమాదము. ఇక దాని పరిణామమా! సర్వనాశము. అందుననే అర్జునుడు కృష్ణునితో "ధర్మ నష్టమై అజ్ఞానాంధకార మావరించగా స్త్రీలలో ధర్మభ్రష్టత, సతీత్వ

భ్రష్టత లలముకొన అయోగ్యము వర్ణసంకరమైన సంతతి గల్గును గాన సంస్కృతిని ధర్మమును నశింపచేసినా డను కళంకము రాకుండా నేనే చావటము మేలు" అనినాడు. ఇది అర్జునుని భవిష్యవాణియే యైనది. అది అట్లుండ అర్జునుని తర్కమునకు సంతోషకరమైన ఉత్తర మీయ బడలేదు. పోగా "నీవు క్షత్రియుడవగుట మారుమాటాడక యుద్ధము చేయవలసినదే. నీకు కర్తవ్యమైన యీ ధర్మయుద్ధమున చచ్చినచో మోక్షము, జయించిన రాజ్యము గాన యిందు జయము, మరణము సమానము" అనినాడు శ్రీకృష్ణుడు. ఐతే అర్జునుడు చావలేదు గాన మోక్షమను పొందలేదు. జయించినాడు, రాజ్యము చేజిక్కినది. కాని యుద్ధానంతర మారంభమై పతనోన్ముఖముగా సాగు దేశ, జాతి, దుర్గతిని యెవరును ఆపజాలకపోయిరి. ఇందు వీరుల మృత్యువు మాత్రమే యైయున్నచో నింత నష్టము వాటిల్లదు. ఇది వీరత్వ విద్యా సంస్కృతులకే మృత్యువు. స్వామి దయానందుడు మరణించెను. ఆయనకు విష ప్రయోగము జరుగకున్నను వేరే తీరుగనైనా చావు తప్పనిదే ! ఐతే స్వామీజీ చచ్చినను వైదిక సభ్యతను పునర్జీవింపచేసి చచ్చినాడు. సమస్త మానవ దృష్టికోణమును మార్చిచనిపోయినాడు.

మహాభారతము పిదప యిట్టిది కన్పడదు. యుధిష్ఠిరుడు సింహాసనమెక్కినాడు., తదాది ఇంద్రప్రస్థ రాజధాని వారిసంతతి చేతిలోనే యున్నది. కాని దానిలో వైదిక సంస్కృతి ఉన్నతినందిన లక్షణము లేమియు కన్పడవు. భారతయుద్ధమైనదిమొదలు క్రీస్తుశక మొక వేయేండ్ల కాలమువరకు భారతదేశములో భారతీయరాజుల పాలనయే యున్నది అందెందరో వీరులు, జ్ఞానులు, పండితులుండిరి. ఐనను యీ నాలుగువేలేండ్లలో వైదిక సంస్కృతి రోజురోజుకు క్షీణించుచు పోయినది. పైగా వైదిక విరుద్ధమైన మతములెన్నియో పుట్టినవి.

శ్లో॥ ఏతద్దేశ ప్రసూతస్య సకాశాదగ్రజన్మనః
స్వం స్వం చరిత్రమ్ శిక్షేరన్పృథ్వియాం సర్వమానవః॥

ఈ స్మృతివాక్కు ద్వారా విభిన్న జాతులుగా యున్న ప్రపంచ ప్రజలకు భారతదేశ విద్వాంసులే ధర్మోపదేశమొనర్చువారని, యే

ధర్మశిక్ష యితర దేశములవారిలో వ్యాపించినదో అది భారతదేశము నుండియే వారికి లభించినదని మనకుబోధపడుచున్నది. అట్టి విశిష్టత భారతయుద్ధమున కీవలి నాల్గువేలేండ్లలో కన్పడదు. ఐనను యితర దేశములకన్న నాటి భారతదేశము అధిక శక్తివంతమైయుండి యుండెనని దాని శిక్షాదీక్షలు మరియు సంస్కృతి అత్యున్నతమైయుండెనను విషయము నిర్వివాదము. కాని ప్రపంచమునకు గురుత్వము వహించియున్న ఆ పూర్వకాలపు జాతియోగ్యత, కాలమువలెనే దినదినము దిగజారిపోవుచు వచ్చినది.

భారతదేశమునకు వెలుపల "జరదస్త్ "మొదలు "ముహమ్మద్" వరకు కాలానుసారముగా వెలువడిన మతములన్నియు భారత యుద్ధము తరువాతివే. భారతయుద్ధమందు పాల్గొనిన దేశదేశముల వీరులు ఆచారములందు కొంత భిన్నతగలవారైనను అందరును వైదిక ధర్మమునకు చెందినవారే. ధర్మము (మతము) లలోని మంచిచెడ్డలను పరీక్షించు కొలబద్ద ఒకే ఒకటి. అది వేదము. అనగా "వేదమూలం ధర్మ." భారతయుద్ధము యొక్క దుష్ప్రభావ మన్నిటికన్న నధికముగా ధర్మమునకు మూలమైన వేదముపై బడినది. ధర్మవృక్షము యొక్క వేరుకు ఆఘాతము కలిగినది. ఆ వేరుకు నీరు అందుట ఆగిపోయినది. వేరు ఎండుట మొదలగుటతో ఆ వృక్షము యొక్క కొమ్మలు, ఆకులు, పూవులు ఎండజొచ్చినవి. తోటమాలి లేమిచే ఉద్యానము కుమ్మికించగా దానిలో విహరించు కీర శారికాదులకు కల్గు గతివంటిదే భారతదేశ ధర్మలుప్తిచే ప్రపంచ ప్రజలకు కలిగినది. సర్వ సంశయముల నివారించగల ధర్మము సమృద్ధిగా లభించుట లోపమగుటతో కాస్తో కూస్తో సూక్ష్మబుద్ధిగల వ్యక్తులు తమ తమ బుద్ధిననుసరించి ధర్మమునకు సంబంధించిన కొన్ని క్రొత్త నియమముల నేర్పరచుకొని తామున్నచోట ప్రచారము చేయజొచ్చిరి.

సూర్యుడస్తమించుటతో చీకటి నలుదెసల నావరించును. దాని వలన మానవులు చేసికొనుచున్న పనులు నిరుద్ధములగును. అపుడు కొందరు కల్పిత దీపముల నేర్పరచుకొందురు. ఇక అంధకారావృతమైన

అరణ్యాదులలో మిణుగురు పురుగుల ప్రకాశమే ప్రకాశము. దాని వలన చీకటి తొలగుట ఒక క్షణమే ఐనను కొంత ఆశ కలుగుతున్నది. ఒక్కొక్కసారి మెరసిన మెరుపువలన లోకము జ్యోతిశ్శూన్యము కాలేదు, మరల వెల్తురు వచ్చునని మానసిక సంతృప్తి కలుగుచున్నది. ఈ అంధకార కారణమున జరిగిన మానవ ప్రయత్న పరిణామమే దీపావిష్కరణ. ఈ మట్టి ప్రమిద, నూనె, వత్తి ఆనాటి మానవుల ప్రయత్నములే యైయుండవచ్చును. పిదప కూడా ఆ దీపాన్ని పెను గాలి నుండి కాపాడుటకై కొన్ని నూతనావిష్కారములు జరుగక పోలేదు.

నేడు విజ్ఞానము ప్రపంచమునకు సూర్యుడే అక్కరలేదన్నంతగా వికసించినది. అర్ధ రాత్రి కూడ పట్టపగటివలె వెలుగు లభించగలదు. ఇదే విధముగా మానవ సమాజము తన సామాన్య వ్యాపారములను చెడకుండా నడుపుకొనుటకై ఏవియో కొన్ని ధార్మిక నియమముల నేర్పరచుకొని వానిని గూడ గాపాడుకొన్నది.

ఏ ధర్మ (మత) ము యెపుడు, ఎక్కడ, ఎట్లు ఉత్పన్నమైనది ? దానిలో నేమేమి వికారములు కలిగినవి ? ఆ వికారముల నివారించుటకై ఆ మతస్థు లేయే ప్రయత్నములు చేసిరి ? అనునది ఒక ఆసక్తి దాయకమైన లాభప్రదమైన విషయము.

మహాభారతయుద్ధమునకు కొంతకాలము పిదప "జరదస్త్" సమయము. అప్పటికి హ.జరత్ "మూసా" కానీ, "ఈసా" గాని ఇంక ఏ "నబీలు" "రసూలు"లు పుట్టలేదు. "జరదస్త్" యొక్క దేశము ఈరాన్. అది భారతదేశమునకు సమీపమైనట్లే ఆయన విచారధార కూడ భారతీయ ఋషుల విచారధారకు చాలా సన్నిహితము. ఆయన భాషకూడ వైదికభాషకు సన్నిహితమే. ఈ ఋషి సంప్రదాయమునకు "జరదస్త్" సంప్రదాయమునకు గల భేదము దేశదూరమును పురస్కరించుకొని ఉచ్చారణాదులలో కల్గు సామాన్యభేదమువంటిదే తప్ప ఏమంత గొప్పదిగా కన్పడదు. పారసీయుల పవిత్ర గ్రంథమందు వేద మంత్రములయొక్క (లేక) ఆ మంత్రదేవతలయొక్క వర్ణనమున్నది.

దీనివలన ఈరాన్‌లో ప్రాచీన వైదికసంస్కృతీ ప్రభావముండెననుటలో సందియము లేదు. దురదృష్టవశాత్తు భారత (యుద్ధ) కాలము తరువాత ఉభయదేశముల రాకపోకల సంబంధము కూడ తెగిపోయినట్లు బోధపడుచున్నది. అటులగాక ఈరాన్ భారతదేశములకు భారతకాలమందున్న రాకపోకల సంబంధమే ఉండియున్నచో, జరదస్త్రకు యీ కొత్త మతమును కల్పించవలసిన అవసరమే లేకుండెడిది. సరే యిది భారతదేశమునకు బయటి విషయము. ఇక భారతవర్షమున కూడా వైదిక శిక్షణ నిలచిపోయియుంటచే ధర్మమున చాల మార్పులు కలిగినవి. ఇతరదేశస్థు లనేకవిధములైన ధర్మ దీపముల నేర్పరచుకొనినట్లే భారతీయులు కూడ కల్పించుకొనినారు. అందుచే ఒకే ఒక వైదిక ధర్మమునకు మారుగా చిన్న చిన్న సాంప్రదాయములు వందలాది వెలువడినవి. ఈ తీరుగా భారతకాలము పిదప వైదిక ధర్మధార రెండు మార్గములుగా అనగా భారతదేశ మందొకటి, దేశమున కవతల నింకొకటి వెలువడినది ఐతే యిందు భేదమేమి? అను విషయ మాలోచింతము.

# ధర్మము - ప్రథలు

భారతయుద్ధముతో మొదలైన ధర్మపతనము మనదేశమందు అంచెలంచెలుగా ముందుముందు కెట్లుసాగుచువచ్చినదో తెలిసికొనుటకై సాహిత్యావలోడనము దాని విస్తృత వివేచన మెంతో అనవసరమై యుండును. మొదటిపాటు—మూలమునకు శాఖలకు మధ్యగల భేదమును గుర్తింపజాలకుంటయే కాబోలు. కొన్ని కార్యములు ప్రప్రథమమున ఆవశ్యకత ననుసరించియే జరుగును. ఇది ప్రకృతి నియమము. ఆ పనులు మాటిమాటికి కొంతకాలము వరకు చేయబడుచు తుదకు ప్రథారూపము ధరించును. ప్రథ యనునది - ఉద్దిష్ట కార్యముయొక్క బాహ్యాకారము. ఇది శాఖయే కాని మూలము (వేరు) కాదు. తరచుగా ప్రాచీనమైన ప్రథయందు మూలోద్దేశము (వాస్తవికత) నశించిబాహ్యాకారమే కన్పించుచుండును.

ప్రతి జాతియందును (లేక) ప్రతి దేశమునందు నేవియో ప్రథలు గోచరించుచునే యుండును. వీనిని సామాజికాభ్యాసములు (సమిష్టి స్వభావములు) అనవచ్చును. వ్యక్తి విషయముగా మాటి మాటికి చేయబడు పని అభ్యాసమనబడినట్లే సమాజ విషయకమైన (మాటి మాటికి చేయబడు) పనులు ప్రథలు, సంస్కారములని చెప్పబడును. ఉదాహరణకు ఒకనాడొక వ్యక్తి తన అవసరమునుబట్టి పగటి భోజనము పదకొండు గంటలకే చేయ నిర్ణయించుకొని మొదలుపెట్టెను. తొలిరోజాపని అవసరానుగుణ్యముగానే చేయబడినది. కాని తదాది నెలల తరబడిగా భోజనమదే వేళకు చేయబడుచుండుటతో దానికి అలవాటను పేరు కలిగినది. ఈ అలవాటు ఆవశ్యకతననుసరించియైనను జరుగవచ్చు. అదిలేక గూడా జరుగవచ్చును. ఒక్కొక్కసారి యిది హానికరమైనను అటులే జరుగుచుండును. అట్లే జాతిమొత్తము పదకొండు ఘంటలకే భోజనము చేయుటకలవడిన అది ప్రథయని పేర్కొనబడును. యజ్ఞోపవీత సంస్కారమును బట్టి ఆ ప్రథా స్వరూపమును తెలిసికొనవచ్చును. పూర్వకాలమున పిల్లవానిని గురువుల సన్నిధికి చేర్చునపుడు వానికుపనయన సంస్కారము చేయబడుచుండెడిది. ఇందు విశేష హోమవిధి జరిగిన పిదప మూడుపోగులుగల జన్నిదమును గురువులు ఆ పిల్లవానిచే ధరింపచేయుచుండెడివారు. ఈ ప్రథ భారతదేశపు వెలుపలకూడ ఏదో రూపమున ఉన్నట్లే తోచుచున్నది. యూనానీ, ఫారసీ భాషలలో "జున్నార్" అను శబ్దము కలిగియుండుటయే యిందుకు ప్రబల తార్కాణము. కొంతకాలము జరిగిన పిదప ఆ గురుశిష్య పరంపర విచ్ఛేదమైపోయినది. కాని జందెమును వేసుకొను ప్రథ మాత్రము మిగిలి యున్నది. ఈ జందెమే ఇప్పట్లు ద్విజుడనబడుటకు చిహ్నము. అనగా వస్తువులోని తత్వసృష్టి నశించగా బాహ్యరూపము మాత్రమే మిగిలి యున్నదన్నమాట.

వేదముల పిదప రెండవ స్థానము బ్రాహ్మణ గ్రంథములది. శతపథాది బ్రాహ్మణ గ్రంథములచక్కగా పఠించినచో వానిరచనాకాలము వేదకాలముకాదని రుజువగును (వైదిక ధర్మపతనమునకిది తొలిమెట్టన వచ్చును). బ్రాహ్మణ గ్రంథములందు ప్రథలకెంతో ప్రాధాన్యత

ఈయబడినది. ఉదాహరణకు "శతపథ" బ్రాహ్మణమందు యజుర్వేదము లోని ఫలానా మంత్రము ఏ యజ్ఞమందు ఏ సమయమున పఠించవలె? ఏ క్రియతో పఠించవలె? అను విషయమున యెంతో వాద వివాదములుజరిగినవి. ఈ విషయమున యింకను అభిప్రాయభేదమున్నది. ఇదే విధముగా దర్శ పూర్ణమాశేష్టులలో హోమమొనర్చు యజమా నుడు భుజింపవచ్చునా లేదాయను సందేహమునకు "వ్రతధారికావలె" నని బదులుచెప్పబడినది. దానిపై వ్రతమననేమి? అని మరి ఒక ప్రశ్న, యిందుకు వ్రతశబ్దమునకు "తినకయుండుట" అను అర్థముకాదు. కాని ఫలానివారు ఏకాదశీ వ్రతము చేయుచున్నారన్ననో, ఉపవాసము చేయుచున్నారన్నను వినువారికి సమానభావమే కలుగుచున్నది. ఐతే యిది పరిపాటి ప్రథ. మరియు ఉపవాస శబ్దమునకుగూడ "సమీప మందుండుట" అనియేకాని "తినకుండ ఉండుట" అని అర్థము కాదు. ఐతే ప్రథమాత్రము "తినకుండ ఉండుట" అనియే. ఇట్లు "శతపథ" బ్రాహ్మణ మందీ విషయముపై వాదవివాదములు జరిగినవి. సారాంశ మేమనగా యజ్ఞమొనర్చిననాడు దేవత (విద్వాంసు)లు ఇంటికి వత్తురు గాన యజమానుడు ఆ అతిథులు భోజనమొనర్చిన పిదపనే తాను భుజింపవలెనని తెలినది. ఈ విధముగా వ్రతముయొక్క వాస్తవికతకు మరియు అనశనమునకు (తిండి తినకుండుటకు)గల సంబంధము బాహ్యా చరణమందే (రివాజులోనే) స్థాపితమైనది. అది రాను రాను వాస్తవిక కర్మ లుప్తముకాగా ప్రథమాత్రము నిలచిపోయినది. ఇతర విషయము లందిట్లే జరిగియుండును.

మహాభారతానంతరము వైదిక ధర్మయొక్క ప్రథలు భారత దేశమందెటుల పరిణమించినవి? వెలుపలి దేశములందేరూపములబొంది నవి? అను విషయమొక ఆకర్షణీయమైన అన్వేషణము. ఈ పరిణామ ములనుగూర్చి స్వామి దయానందసరస్వతి సత్యార్థప్రకాశమునచక్కగా వివేచించియున్నారు. ఆ అపూర్వ గ్రంథముయొక్క పదకొండవ సముల్లాసమందు ధర్మమునకు పౌరాణికులు చిత్రించిన విభిన్నరూప ములను, పన్నెండవసముల్లాసమందు జైన, బౌద్ధమతములను, వానికి

పూర్వము (వైదిక ధర్మమునకు బౌద్ధమతమునకు మధ్య) ఏర్పడిన నాస్తికమతమును గూర్చి కూడా స్వామీజీ విపులముగా వర్ణించి యుండిరి. ఇక భారత దేశమునకు వెలుపల ప్రపహించిన ధర్మధార దీనికి పూర్తిగా విపరీతమైనది. దాని సాహిత్యము కూడా వేరే. ఐతే దీనికి చెందిన రెండు శాఖల యొక్క సంక్షిప్త వృత్తాంతము సత్యార్థ ప్రకాశము యొక్క 13, 14 సముల్లాసములందు కలదు. అది కూడా భారతవాసులతో సంబంధమున్నంతవరకే. అనగా భారతీయులైన మసల్మానులతో, క్రైస్తవులతో సంబంధించినంతవరకే కలదననగును. వీనికి చెందిన శాఖలింక నెన్నియో యున్నను వాని జోక్యము భారత దేశమందు లేమిచే నవి ఆ గ్రంథమందు వర్ణింపబడలేదు.

వైదిక ధర్మమందు పతనమెప్పటినుండి ఆరంభమైనదో అప్పటి నుండియే దాని సంస్కరణము గూడ సహజముగా మొదలై యుండ వచ్చును. వ్యాధి యున్నచోట చికిత్స ఉండక తప్పదు. అది ఉచితమే కానీ అనుచితమే కానీ. ఏదో కొంత చికిత్స చేసికొనక ఏ రోగి యైన ఉండజాలడు. విజ్ఞానవంతమైన చికిత్స జరుగు అవకాశము లేనిచోట ఆ వ్యాధికి భూత, ప్రేత, గ్రహచారాదులందేదో ఒకటి కారణమని నిశ్చయించుకొని దాని నివారించుటకై ఎన్నియోతీరుల కలాపముల వలచించెదరు. రోగి సంతృప్తికైన ఏదో జరుగవలెకదా !

మహాభారతయుద్ధము జరిగి ఐదువేలేండ్లైనది. దాదాపు రెండున్నర వేలేండ్లకు పూర్వమందీదేశమున ధార్మికపరమైన అల్ల కల్లోల మొకటి జరిగినట్లు గోచరించుచున్నది. తత్పరిణామములే మనకగపడు జైన బౌద్ధ మతములు. అంతకు పూర్వపు రెండున్నర వేలేండ్లలో ధార్మిక విషయ మేమిజరిగినది ? ఎట్లు జరిగినది ? దానికై యే సంస్కరణ జరిగినది ? సక్రమముగా తెలియదు. వైదిక ధర్మ యొక్క మూల స్వరూపమునకు, బౌద్ధ, జైన ధర్మములకు గల మధ్యకాలమం దెట్టి సంఘటనలు జరుగలేదనుకొను టసంగతము. రెండున్నర వేలేండ్లకాలము చాలా దీర్ఘకాలము. ఇంతటి దీర్ఘ కాలమం దేమార్పును కలుగలేదనుకొను టసమంజసము. వైదిక కాల

మందలి ఆస్తికతకు బౌద్ధకాలములోని నాస్తికతకు మధ్య అనేక పరివర్తనములు జరిగియుండవచ్చును. ఋగ్వేదములోని "ఏకం సద్విప్రాః బహుధా వదంతి" అను మంత్రార్థమును ఆలోచించునపుడు పరమాత్ముఁడొక్కఁడేయని అతనిని పండితులనేకనామముల పేర్కొనెదరను విశ్వాసము కలుగును. ఇదొక మూలసిద్ధాంతము. దీని ననుసరించియే భక్తులు — తల్లి, తండ్రి, మౌలా, మిత్ర, పథ ప్రదర్శక మున్నగు పేర్ల ఆ పరమేశ్వరుని సంబోధింతురు. ఇందేదైనా ఒక పేరును ప్రత్యేక రూపమున ప్రయోగించుట కలవడినవాడు ఆ పేరునకే ప్రాధాన్యత నిచ్చుచు యితర నామములను విరోధించును. క్రొత్త క్రొత్త మతము లీవిధముగనే ప్రాదుర్భవించును. ఉదాహరణకు ఆర్యసమాజికులవలెనే సిక్కులు కూడా ఒకే ఈశ్వరుని అంగీకరింతురు. కాని ఆ ఈశ్వరుని అనంతనామములలో నొకటైన "అకాల" శబ్దమునే వారు ప్రేమింతురు. అకాల శబ్దముతోపాటు (ఇంక నెన్నియో శబ్దములు) అనంత శబ్దము కూడ, వైదిక సంస్కృత భాషలకు చెందినదే. ఐనను వారు తమ జయవినాదమును ఘోషించునప్పుడు "సత్, శ్రీ అకాల్" అని అకాల శబ్దమును ప్రయోగించినట్లనంతశబ్దము నుపయోగించరు. ఒకే పరమేశ్వరునకు చెందిన శివ, విష్ణు, గణేశాది నామములకు ఇట్లే వేర్వేరు పూజలు గావింపబడజొచ్చినవి. ఇట్లు మౌలికముగా నొకటే యైనను అనేక భాగములుగా విభక్తమైనది. ఒకే దృష్టికోణము గలవి యైనను యీ భాగములు పరస్పర విరుద్ధములైనవి.

ఇక భారతదేశములో ప్రవహించిన ధార్మికధారకన్న వెలుపలి దేశముల ప్రవహించిన ధార్మికధార భిన్నమైనది. ముహమ్మదీయులు, క్రైస్తవులు తమ సాహిత్యము హాజరత్ ఇబ్రాహిం కాలమునుండియే మొదలైనట్లు విశదపరచెదరు. ఇక ఇబ్రాహిం కాలము "నాల్గున్నర వేలేండ్లకు పూర్వపుది" అని ముసల్మాను లంగీకరింతురు. ఐనచో హాజరత్ ఇబ్రాహిం జన్మ మహాభారతకాలమునకు ఐదువందలేండ్ల పిదప జరిగి యుండెడిది. ఈ ఐదువందలేండ్లలో వైదిక ధర్మధార ఏయే అడవులను, ఎడారులను, కనుమలను దాటుచు ఎంతవరకు

పోగలిగినదో యూద, క్రైస్తవ, ముహమ్మదీయుల పుస్తకములద్వారా తెలిసికొనవచ్చును. ముఖ్యముగా యీ రెండు ధారలకును స్రోతస్సు మాత్రమొక్కటే యనుట నిర్వివాదము.

తన కుమారుడైన ఇస్మాయిల్ యొక్క బలిని పురస్కరించుకొని హాజరత్ ఇబ్రాహిం సుప్రసిద్ధుడయ్యెను. గోవు మున్నగువానిని బలి యిడుట. ఇస్లాంమత మంగీకరించును. అది "సున్నతె ఇబ్రాహిం" అనబడును. అనగా యీ పశువులను బలినిడు ఆచారము ఇబ్రాహిం కాలమునుండియే ప్రచలిత మైనదన్నమాట. ఇటు భారతదేశమున కూడా మహాత్మా బుద్ధుని, మరియు మహావీరుని కాలములో గూడ పశుబలిని చేయు ఆచారము ప్రచలితమైయుండెను. దానిని బుద్ధుడు నిరోధించుచుండెను. ఇబ్రాహిం తన మతసిద్ధాంతమును బలపరచుట కీ పశుబలిని ప్రయోగించుచుండెను. ఇక బుద్ధుడో "మనుష్యుడు యే ఈశ్వరుని ప్రసన్నతకై లక్షలాదిప్రాణులను హింసించుచు స్వయముగా పశుకృత్యమునకు పాల్పడుచున్నాడో అట్టి ఈశ్వరుని కూడా అంగీకరింప"నవెను. ఇంతే గాక "లక్షలాది నిరపరాధ ప్రాణులను జంపి నే స్వర్గమున కేగగల్గుదునేని ఆ స్వర్గమునకన్న నరకమే మేలు" అని పలుకుచుండెడివాడు. ఇక ఇబ్రాహిం ! ఈశ్వరుని ప్రసన్నుని చేసికొనుటకై తన కుమారులను బలియిచ్చుట ఒక గొప్ప సాధన మనుకొనెడివాడు. ఈ రెండు ధర్మలు ఒకటి పశుబలి పుష్టితోను ఒకటి పశుబలి నిషేధముతోను ఆరంభింపబడినది. ఇట్లొకే పర్వతమునుండి వెల్వడిన రెండు స్రోతస్సులలో నొకటి హింసాత్మకముగా, మరొకటి అహింసాత్మకముగాను రూపొందినవి.

# యజ్ఞము - అహింస

వ్యర్థములు అనావశ్యకములైన పద్ధతులు సత్కర్మ స్థానము నాక్రమించుటే వైదిక ధర్మమం దుత్పన్నమైన తొలి వికారము. ఇందు మొదటి దోషము యజ్ఞ శబ్దమునకు సంబంధించినది. వైదిక పరిభాషలో యజ్ఞ శబ్దమునకు మహత్వపూర్ణములైన యర్థము

లెన్నియో ఉన్నవి. యజ్ఞమనగా శ్రేష్ఠకర్మ. అన్నిటికన్న పుణ్య కార్యము దీనికి అగ్నిని వ్రేల్చుటతోకాని, బలియిచ్చుటతోకాని సంబంధము లేదు. సత్యము పల్కుట, సమాజసేవ చేయుట, కర్తవ్యకర్మల నిర్వహించుట, దానమిడుట.——యజ్ఞమనబడును. అగ్నిని వ్రేల్చకుండ కూడా యజ్ఞము జరుగును. ఈశ్వరోపాసనమందు వేదమంత్రముల పఠనమే బ్రహ్మయజ్ఞమనబడును. ఇందగ్నికుండము, ఘృతము, సమిధలు, శృవము మున్నగువాని అక్కరలేదు. హృదయ మీశ్వరుని భక్తిలో లీనమొనర్చుటయే బ్రహ్మయజ్ఞము. ఈ విధముననే తల్లిదండ్రుల సేవ - వారి అవసరములను తీర్చుట, వారి సేవా శుశ్రూష లొనర్చుటయు యజ్ఞమనబడును. ఇందాహుతులు లేవు. ప్రేమాదరములతో వారిని సత్కరించుటనే పితృయజ్ఞమందురు. ఐతే సామాన్య ప్రజలు భావించునట్లు గోమేధ యజ్ఞమును గో బలిగా, అశ్వమేధ యజ్ఞమును అశ్వబలిగా అర్థము చేయుదుమేని పితృయజ్ఞమునకు "తల్లిదండ్రుల బలి" అను అర్థము చెప్పుకొనవలసి వచ్చును. ఈ అర్థమే శాస్త్రమందు నుల్లేఖింపబడలేదు. కాని మహాభారత యుద్ధానంతరము వైదిక ధర్మ పతనస్థితిలో నున్నపుడు యజ్ఞమన - అగ్నిని వ్రేల్చుట, పశుబలి యిడుట, అను అర్థములు చెప్పబడినవి. ఈ అజ్ఞానముత్పన్న మగుటకు బహుశః యజ్ఞములందు దేవయజ్ఞము కూడా ఒకటిగా నుంటయే కారణము కాబోలు. దురదృష్టవశాత్తు ఆనాటి ప్రజలు దేవతలను స్వర్గలోకమున నివసించు ప్రాణులని, వారికి పశు మాంసము ప్రియమని భావించుచుండిరి. అందువలన ఆరోగ్యప్రదములు, సుగంధయుక్తములు నైన పదార్థములను వ్రేల్చుటకు బదులు ఆవుల, మేకల మున్నగు పశువులను చంపి వాని మాంసము వ్రేల్చుట వాడుక లోనికి రాగల్గినది. ఇట్లు కల్పింపబడిన దేవీ దేవతలయొక్క పూజారులు పశువుల బలుల నిచ్చుచు, ఆ దేవతలకు ప్రతినిధులు (Agents)గా నిలచి ఆ మాంసమును భక్షించుచుండిరి. ప్రజలు - "యజ్ఞము పవిత్ర కార్యము కదా! ఇందీరక్తపాతమును మీరెటుల యుచితమనుకొనుచున్నారు" అని అడుగగా వేదాజ్ఞానుసారము చేయు పశువధ హింస కాదనియు ఆ పశువును అగ్నిద్వారా స్వర్గమున కంపుచున్నామనియు

పూజారులొక సిద్ధాంతమును కల్పించి చెప్పజొచ్చిరి. కొంత కాలము తరువాత బుద్ధుడీ రక్తపాతమును చూచి దానిని నిరోధించుటకు ప్రయత్నించెను. కాని పాప మా బుద్ధునకు వేదములలోని సూక్ష్మతమములైన చిక్కు సమస్యల సంశోధించుటకై వలసిన సాధన సంపద లభించి యున్నచో అప్పటి పండితులకు "మీరు వేదాజ్ఞ యని చేయు యీ పని మీ అవివేకమని" ఆయన బోధించి యుండెడివాడు. అటుల చేయజాలకపోవుటచే ఆ బుద్ధుడు వేదమంత్రములకును యజ్ఞములకును విరుద్ధముగా ఒక గొప్ప ఆందోళన మొదలు పెట్టినాడు.

ఈ కార్యము రోగనివారణను కోరిచేసినదే కాని రోగ కారణములను గుర్తించి చేయబడలేదు. అధిక భోజనమువలనకానీ, అనుచితభోజనము వలనకానీ వ్యాధి ఏర్పడినచో భోజనమునకు విరుద్ధముగా ఆందోళనము జరుపుట ఆవ్యాధికి చికిత్స యనిపించుకొనదు గదా! సక్రమమైన భోజనవిధి నేర్పరచుటయే దానికి తగిన చికిత్స. కాని యిది అట్లు జరుగలేదు. వేదములందు తరచుగా యజ్ఞవర్ణనతో పాటు గో వర్ణనము కూడా కలదు. గోవు యజ్ఞమునకు విశేషసాధనము. ఈ గోవర్ణనమెచట నున్నను గో దుగ్ధము, గో ఘృతములద్వారాతో చేయబడినదే. ఋగ్వేద భాష్యమందు గోభిః- గోవికారైః గోవులద్వారా లభించు శుద్ధములైన ఘృత దుగ్ధములనియే కాని దాని యర్థము గోమాంసాదులనికాదు. ఇది ఉచితమే. ఏలనన ? ఏ యజ్ఞమైనను పాలు, పెరుగు, నేయి లేక పూర్తికాదు. ఈ పాలు, నేయి పితృయజ్ఞమునకు అతిథి యజ్ఞమునకు కూడా ఆవశ్యకములే. కాని ఎట్లో ఒకసారి పొరపాటు జరిగి అది నిరంతరము నడువజొచ్చినది. కల్పిత దేవతలను విశ్వసించువారలను, రక్తపాతమును ధర్మమనువారలు చేయు ఈ కుకృత్యముల వలన విజ్ఞులు, శ్రేష్ఠపురుషులు, ఎందరో యజ్ఞములనిరోధించిరి. మరియు యిది ఈశ్వరాజ్ఞ కాజాలదని వేదమును కూడా విరోధించిరి. అంతియే కాదు "ఈబలి చచ్చినపశువునకు స్వర్గసాధనమగునేని మీ బంధుబాంధవులనీ దివ్యసాధనద్వారమున స్వర్గానికేలపంపరు" అని అడుగజొచ్చిరి. పోనీ బౌద్ధ పండితులైనను ఆ వేదమంత్రములను చదివి వాని అర్థము వైదిక

పండితులకు తెల్పియుండినచో వేదముల విరోధించుట కాని యజ్ఞముల నిరోధించుటకాని జరిగియుండెడిదికాదు. అపుడు హింస స్వయముగా సమాప్తమై యుండెడిది. కాని బుద్ధుని కాలమందు వేదాధ్యయనము సామాన్యుల కందనిదిగా నుండెను. వారి భాష ప్రాకృతము. అపుడు సంస్కృతము చదువుట పండితులవరకే పరిమితమైయుండెడిది. ఆ పండితులు పూజలు, పారాయణములు చేయుచు తమ ఉదర పోషణ కార్యములందే నిమగ్నులై యుండెడివారు. ఇంతకన్న విశేష మేదైన నున్నచో నది యెక్కువ దక్షిణలు రాబట్టుటకై యజ్ఞములోని క్రియల విస్తృతపరుప వారు యత్నించుచుండెడివారు... సామాన్యమైన ఔషధము పేరును కూడా యూనానీ, లాటిన్ భాషలలో చెప్పు ఆధునికడాక్టర్లవలె యజ్ఞమును చేయించువారు యజ్ఞమందు వాడబడు చిన్నవస్తువు పేరు కూడా తమ వైయక్తిక విద్వత్తును ప్రకటించుటకై కఠినశబ్దమున పేర్కొనుచుండెడివారు. ప్రస్తుతకాలపు ప్రతి డాక్టరు మందులను తయారు చేయునపుడు ఫలానా ఫలానా వస్తువులలో "ఆక్వ" కలుపుమనును. ఈ "ఆక్వ" ఏమిటి ? దీని ఖరీదెంత ? అని ఆలోచించిన అది యేదీకాదు; మన బిందెలోని నీరే. ఇట్లే యజ్ఞములు చేయించు పండితులుకూడా గిన్నె అనుటకు మారు "ప్రణీతాపాత్ర" అని వాడినారు. ఇట్టిశబ్దములు విన్నపుడు అశిక్షితులైనయజమానులపై పండితుల ప్రభావము పడక తప్పదు. ఈ విధముగా యజ్ఞములందు పశుహింస ప్రారంభమగుటతో వారుకల్పించిన "వైదికీ హింసా హింసా నభవతి" అను సూత్రము ప్రయోగింప బడినది. రానురాను ఆ సూత్ర మెంత విశ్వసనీయమై పోయినదనిన శ్రీ శంకరాచార్యులు కూడా గీతాభాష్యములో ఆ వాక్యమును సమర్థించిరి. ఇక కాళిదాసాది సంస్కృతకవులుకూడా తమవాక్యాలలో దీని ననేకమారులు వర్ణించిరి.

ఈ వైదిక యజ్ఞప్రథ భారత దేశమందేకాక ఇటనుండి యితర దేశములకేగినను యీ భ్రమకూడ దానిని వెంబడించుచునే యుండినది. పైగా ఆ దేశములు కూడా సుశిక్షితములు కాకుండెను. ఇక హజరత్ ఇబ్రాహీమో ! భారతకాలమునకెన్నియో శతాబ్దముల తరువాతి

వాడు. ఇట్లు వేలమైళ్ళ స్థానదూరముయొక్క వందలాదియేండ్ల కాల దూరముయొక్క దుష్ప్రభావము యీ హింసారూప అనర్థము నింకా పెంపొందించినది.

హజరత్ ఇబ్రాహిం ఆసియాఖండమున పశ్చిమదక్షిణ (నైఋతి) ప్రదేశమున జన్మించెను. అచటివారు కేవలము గొఱ్ఱెల కాపరులు. యూదుల పూర్వజులందరును ఈ వర్గముతో సంబంధము గలవారే. అందుచేత హ. ఇబ్రాహిం యజ్ఞ పవిత్రతలు గూర్చి బాగుగా ఆలోచించ గలుగునని ఆశించుట వ్యర్థమే. ఆయన తన కాలమందు యజ్ఞములలో పశుబలినిడు ప్రథనుచూచి దానినే సముచిత కార్యమను కొనెను. తన కత్యంత ప్రియమైన వస్తువును దేవునికి బలి యిచ్చుటలో హ-ఇబ్రాహిం గొప్ప భక్తుడుగా ఉదహరింప బడుచున్నాడు. ఏలనన ఆయన తనకు గల్గిన స్వప్నాధారముననే కుమారుని బలి యిచ్చుటకై సిద్ధపడిన దృఢవిశ్వాసి. గాన ఇబ్రాహింను గొప్ప భక్తుడనుట భావ్యమే. కాని యిచట ఆశ్చర్యకరమైన విషయమేమన-హిందువులు విశ్వసించు దేవి దేవత లనేకులు. ఇబ్రాహిం విశ్వసించు దేవుడొకేఒక్కడు. ఇట్టి భిన్నస్థితిలో "హిందువుల దేవతలవలె తన దేవుడు కూడా మాంస ప్రియుడే యని ఇబ్రాహిం ఎట్లు విశ్వసింపగల్గెను ?" కొంచెం శాంత ముగా ఆలోచించిన భారతదేశములోని కొన్ని సంఘటనలు తత్సం బంధములైన కధలు అచటికి చేరియుండు ననిపించును. అట్లే యజ్ఞ సంబంధమైన విశేషభాగము కూడా యూదులు ధార్మిక గ్రంథము లందు చేరిపోయినట్లు బోధపడును.

హజరత్ ఆదంకు హాబీల్, కాబీల్ అను యిరువురు కుమారు లుండెడివారని చెప్పబడుచున్నది. వారిలో హాబీల్ అనువాడు వన స్పతులను, కాబీల్ అనువాడు పశువులను తమతమ ఉపహారములుగా తెచ్చి ఈశ్వరుని ముందుంచిరట. సామాన్యముగా ఆటవికులలో మాంసమునకు గల విలువ వనస్పతులకు లేదు. ప్రస్తుతము పశ్చిమ దేశముల సభ్య జనులలో కూడా మాంసము తినకపోవుట మూర్ఖతగానే భావించబడుచున్నది. యూదుల ఈశ్వరునకు కాబీల్ సమర్పించిన

మాంసోపహారము నచ్చినది. కాని హాబీల్ తెచ్చిన వనస్పతి (ఉపహారం) నచ్చలేదు. పిదప కాబీల్ హాబీల్‌ను చంపివేసెను. ఇది ఒక కథ.

యూదుల సాహిత్యమందు హజరత్ ఆదం యొక్క కాలము నుండే యజ్ఞమునందు పశుబలి నిడుట ఆచారముగా వచ్చుచున్నట్లు కన్పడుతున్నది. నేను (గ్రంధకర్త) ఎందరో మహమ్మదీయులను "మీకు దేవీ దేవతలపై విశ్వాసము లేదుకదా! గోవుల నేల బలిచేసెద"రని ప్రశ్నించియుంటిని, కాని వారు ఏల చేయవద్దు అని అడుగుటకూడా పాపమని తలతురు. అట్టిస్థితి నుండువారిలో సంస్కరణ కలుగునని ఆశించుట దుస్సాహసమే. దృఢ విశ్వాసియైన ప్రతి ముహమ్మదీయుడు నేడుకూడా పదునాల్గు వందలేండ్లనాటి విషయమే భావించును. ప్రత్యుత్తరమిడుట తప్పనిసరియైనప్పుడు "హ-ఇబ్రాహీం కల్పించిన ప్రథలో మా బుద్ధిని దూర్చి దానిని మార్చుటకు మేమెంతటివారము" అని అందురు. హ-ఇబ్రాహీం సంస్కరించెను కాని ఆ పనిని చక్కగా విమర్శించి చేయలేదు. అతని ఉద్దేశము మంచిదే కాని ఆ వ్యాధి యొక్క మూలమును గుర్తించలేదు. ముందు రోగ నిదానము చేయుట బుద్ధిశాలియైన వైద్యుని పని. రోగ నివారణ కావలెనని ప్రతిరోగికీ తత్పరిచారకులకు కూడా ఉండుట సహజము. కాని ఆ కోరిక మాత్రమే రోగ నివారణకు చాలదు. రోగ నిదానాదులత్యావశ్యకములు.

మహాభారత యుద్ధానంతరము ధర్మ సంస్కర్తలుగా నెందరో కృషి చేసిరి. వారు రోగముల వలన ఏర్పడిన బాహ్య వికారములనే సంస్కరించిరేకాని వానికి మూలములైన లోపలి చెడుగులను సంస్కరింపలేకపోయిరి. అందువలన ఒక రోగము పోయి దానికన్న పెద్దదైన మరొక రోగము బయల్పడ జొచ్చినది. బుద్ధుడు అహింసా ప్రచారము చేసెను. కాని నాస్తికత్వమను భయంకర రోగము సంఘము నలముకొన్నది. పరిణామమేమో ? యజ్ఞములు సంస్కరింపబడలేదు కాని యజ్ఞములు వానితోబాటు అహింస కూడ సమాప్తమైపోయినది. ఉన్నదనుకొనుచున్న అహింస నామమాత్రావశిష్టమే. ఉదాహరణకు

బౌద్ధ దేశములందే మాంసభక్షణ ప్రథ - "హారామ్" "హలాల్" అను వివేచన కూడా అక్కరలేనంత పెరగి పోయినది. హ-ఇబ్రాహిం నిర్వహించిన బలిప్రథ ప్రస్తుతము గోబలిగామారి మత కలహములకు కారణమైనది. పోనీ, ఒక్క ముస్లిం ఐనా హ-ఇబ్రాహిం తన ప్రియవస్తువు (కుమారు) నిడుటకై సిద్ధపడిన యీ బలికి ప్రతిగా "మనకు ప్రియము గాని (హిందువులకు ప్రియమైన) గోవు నేల గురిచేయవలెనని" తోటి ముస్లింలతో ననునా? అనడు. కారణము? ప్రథలు ప్రథలే. జరుగవలసినవే. "లకీర్ కా ఫకీర్" అనేదిదే. ఇబ్రాహింకు ఆనాడు తగిన సాధనములు లభించనందున బలినిగూర్చి విమర్శింపజాలక పోవచ్చును. కాని ప్రస్తుతకాలపు ముసల్మానులకు వైదిక విమర్శనా సాధనములు, మార్గములెన్నియో ఉన్నవి కదా! ఐన నేమి? వారి బుద్ధి ధార్మిక కురీతుల మూలకారణ మన్వేషించుటలో ఎపుడును కుంఠితమైయున్నది.

ధార్మిక సంస్కరణ దృష్ట్యా భారత దేశమున బుద్ధుని పిదప రెండవ స్థానము గొన్నవారు కుమారిలభట్టు మరియు శంకరాచార్యుల వారు. ఇక భారతదేశము వెలుపలనో! ఇబ్రాహిం పిదప హ-ఈసా, హ-మూసా మున్నగువారు. ఆ మధ్య కాలమందు మరి కొందరు సంస్కర్తలుగా పనిచేసియుండిరేమో కాని చరిత్రాత్మకములుగా వారి పేర్లు సాహిత్యమున నిలచిలేవు. ప్రకృతి యెవరి పేరు శాశ్వితముగా నుంచునో, ఎవరి పేరు త్వరగా నశింపజేయునో నిర్ణయించుట కఠిన విషయము.

హ-ఇబ్రాహిం పిదప పైగంబరుగా పేర్కొనబడు హ-మూసా ఒక సంఘ సంస్కర్త. ఇతని కాలమందు "ఫిరోన్" అను పేరుగల రాజుండెను. అతడు తానే ఈశ్వరుడనని చెప్పుకొనుచుండెడివాడు. ఇట్టి శాసకుని ప్రజలు కూడా తమశాసకుని సిద్ధాంతములనే అనుసరించి జీవించుచుండిరి. భారత దేశమున కూడా యిదే విధముగా హిరణ్యాకశ్యపుని గాథ (పురాణములందు) ప్రసిద్ధమైయున్నది.

ఈ హిరణ్యాకశ్యపుడు ఈశ్వరుడుకాడు కాని ఈశ్వరుడు (విష్ణు)ని ఏవగించువాడు. తన కుమారుడగు ప్రహ్లాదుడు ఈశ్వర భక్తి

నిమగ్నుడై యుంట అతనికేమాత్రము నచ్చకుండెను. ఈతండ్రీకొడుకుల వివాదములో హిరణ్యకశ్యపు నెదుర్కొంచు(ప్రహ్లాదునకు తోడ్పడు)టకై ఈశ్వరుడు నరసింహావతారము ధరించెను. అట్లే ఫిరోన్ రాజు నెదిరించి నాస్తికతను దూరమొనర్చుటకై ఈశ్వరుడు మూసాను పంపినాడు. ఇట్లీ యిరువురిలో ఒకరు దేవదూత ఐతే రెండవవారు స్వయముగా దేవుడే. ఆలోచించిన ఒక సంఘసంస్కర్త తన విధిని నిర్వహించినపుడు ఆ కార్యములోని గొప్పతనమును చూచి అత డీశ్వరుడనియో లేక ఈశ్వర ప్రతినిధియనియో జనులు భావించుట పరిపాటియని తెలియు చున్నది. అంతే కాని యదార్థముగా అతడీశ్వరుడు గాడు, ఇతడీశ్వర ప్రతినిధికాడు. చదువరులుకాని సామాన్య జనులలో విశ్వాసమును కలిగించుటకై లోకోత్తర శక్తులవసరములని తలంపబడును. బుద్ధుని ప్రబోధములందు, ఏసుక్రీస్తు ప్రబోధములందు చాలావరకు సమానత గోచరించును. ఇది ఆకస్మికమో! సమకాలీన పరిభావమో! బౌద్ధ భిక్షువులొక కాలమున ప్రపంచమంతట విస్తరించి ప్రచారము చేసిరనుటలో సందేహములేదు. ప్రస్తుతము నదులను, పర్వతములను, అడవులను దాటుటకై మనము ఆవిరియంత్రముల, విద్యుత్ యంత్రముల యొక్క సహాయము పొందగల్గుచున్నాము. కాని ఆనాడివేవిలేవు. ఐనను బౌద్ధభిక్షువులు కాషాయ వస్త్రములను, దండములను ధరించి ప్రపంచమంతటను విహరించిరి.

ఈరాన్ దేశస్థులు విగ్రహమును "బుత్" అని పేర్కొందురు. ఈ బుత్ అనునది బుద్ధ శబ్దమున కపభ్రంశరూపము. ఈ దృష్ట్యా ఆ దేశములలో బౌద్ధభిక్షువుల విస్తృత ప్రచార ప్రభావముచే వ్యాపకమై పెరగిన బుద్ధమూర్తుల పూజ ఈశ్వరుని మరపించినది. నాస్తికత్వ మావరించినది. అందుచే అచటి ప్రజలలో అనేక మూర్తుల నర్చించుటకు బదులు ఏకేశ్వరపూజ నెలకొల్పవలెనను అవసరానుభూతి కలిగినది. భారతదేశమున కూడా బౌద్ధ, జైన విగ్రహములపూజ వైదిక బ్రహ్మోపాసనమును విస్మరింపచేయునంతగా విస్తరించినది.

టాల్‌స్టాయ్ అను మహాపురుషుడు ఒకచోట "ప్రజలు ఒకే ఒక డైన గొప్పదేవుని పూజించుట మానినపుడు, వందలకొలది చిన్న చిన్న దేవుండ్లను పూజించ నారంభింతురు" అని వ్రాసెను. అనగా వదలిపోవు నది "ఈశ్వర విశ్వాసము కాని పూజకాదు" అన్నమాట. ఇదే భారతీయులపట్ల చరితార్థమైనది. వారు ఈశ్వరుని విస్మరించి బౌద్ధ, జైన మతములకు చెందిన మహాత్ముల, సంతులనే ఈశ్వరులని భావించి వారి విగ్రహముల పూజచేయ మొదలిడిరి. అట్లే మరికొందరు తమకు నచ్చిన గుణములతో మూర్తులను కల్పించి, దైవతృప్తి పేర బలుల నిడసాగిరేమో! సంఘవ్యాప్తమైన యీ దోషమును సంస్కరించినవారు కుమారిలభట్టు మరియు శంకరాచార్యులవారు. ఐతే వారి సంస్కరణ విధానములు వేరువేరు త్రోవలు దొక్కినవి. అనగా కుమారిలభట్ బౌద్ధ, జైనధర్మములచే సమాప్తము చేయించబడిన యజ్ఞములను తిరిగి ఉద్ధరించుటే గాక వేదములపట్ల వైదిక ధర్మములపట్ల ప్రజల కభిరుచి గలిగించెను. ఇక స్వామి శంకరాచార్యులో ఒక నవీనమార్గమవలంబించిరి. వారు "బ్రహ్మ సత్యం జగత్ మిథ్య" అనునొక దార్శనికపద్ధతికి పునాది వేసిరి. శంకరాచార్యులు కర్మకాండకు విరోధియైనను వారి గీతా భాష్యమును చూచినప్పుడు ఆయన బౌద్ధ జైన మతముల, విరోధించినంతగా వైదిక యజ్ఞకాండను విరోధించలేదని బోధపడుచున్నది. ఐనను వారు కర్మకాండను అవిద్యలో నొక భాగముగా అంగీకరించిరి.

హ. మూసా తననొక దేవదూతగా చెప్పుకొనెను. ప్రజల కా విశ్వాసము కలిగించుటకై కొన్ని చమత్కారములను చూపించెను. ఈ మాంత్రికుల చమత్కారములు ఆ దేశములందు ప్రసిద్ధములే. మూసా ఫిరోనుకు మంత్ర ప్రయోగము చేసెను. ఫిరోన్ తన మాంత్రికులను పిలిపించెను. ఇరుపక్షముల నుండియు ప్రయోగోప సంహారములు జరిగినవి. చివరకు మూసా జయించెను. ఇట్లే గారడీలనుపేర ఐంద్రజాలికులు భారతదేశమున కూడా ఉండిరి. ఐతే శంకరాచార్యులు తన జగన్మిథ్యా సిద్ధాంతమును నిరూపించుటకై ఐంద్రజాలికుల దృష్టాంతము నిడిరి. కాని వారు ఐంద్రజాలికులను (మూసావలె) సవాల్ చేయలేదు.

దార్శనిక వివేచనమును దర్శన శాస్త్రములతోనే చేయవలెను. ఆ సమయమందు బౌద్ధధర్మములో నొక శాఖ యుండెను. అది కూడా శంకరునివలె ప్రపంచమును ఇంద్రజాలమువలె మిథ్యా కల్పితమని నమ్ముచుండెను.

మూసా దీనికి (ఇంద్రజాల మబద్ధము కల్పితమనుటకు) విరుద్ధము. అనగా ఇంద్రజాలమును కల్పితమని యంగీకరించడు. కురాన్ షరీఫ్ మొదలగు గ్రంథములలో ఇంద్రజాల సంబంధమైన వర్ణనకలదు. కాని ఐంద్రజాలికు లీ ఇంద్రజాలము నెట్లుచేతురో వానిలో వ్రాయబడలేదు. శంకరాచార్యు లీ ఇంద్రజాలమును హస్తలాఘవమని, యదార్థము కాదని అంగీకరించిరి. అది నిజమే.

హ. మూసా తాను ఈశ్వర ప్రతినిధినని చెప్పుకొనుటేగాక ఈశ్వర వాణికూడా తన నుండియే వెలువడునని చెప్పుకొనెడివాడు. ఈ వాణి సాంకేతికముగా, లేక శాసన రూపముగా వెల్వడును. దీని ద్వారా అతడు ఇస్రాయిల్ యొక్క వివిధ శాఖలలోని దోషములను సంస్కరించు చుండెడివాడు. ఈ విషయము బైబిల్ యొక్క మొదటి పుస్తకమున వ్రాయబడినట్లుగా నున్నది. ఇక కుమారిలభట్టు, మరియు శంకరాచార్యులవారు భారతదేశపు ప్రాచీన గ్రంథములైన వేదములను ఉపనిషత్తులను ఉదహరించెదరు. హ. మూసా యొక్క "తౌరాత్" (అనుపుస్తకము) ఒక క్రొత్తమార్గమును చూపించును. హ. మూసాకు పూర్వమేదైన పవిత్ర పుస్తకముండెనా, లేదా? అను విషయము చక్కగా బోధపడుటలేదు. క్రొత్త శాసకుడు క్రొత్త నియమముల నేర్పరచునట్లు ప్రతి నబీ (పైగంబర్) "క్రొత్తప్రబోధములను తెచ్చుచు లోగా, ఉన్న ఉపదేశములను రద్దుపరచుదురు" అని పాశ్చాత్యుల ధార్మిక విశ్వాసము. భారతదేశీయులు గౌణ విషయములనే మార్చెదరు. కాని మౌలిక విషయములను కాదు. ఇదే కారణమున శంకరాచార్యులచే గాని కుమారిలభట్ చే గాని వేదములు నిషేధించబడలేదు. కాని దురదృష్టవశాత్తు జ్ఞానకాండ కర్మకాండల మధ్య నొక అఘాత మేర్పడినది. శంకరాచార్యులవారు వేదాంతదర్శన భాష్యమునకు

మొదట "చతుస్సూత్రి" అను పేర ఒక విస్తృతభూమికను వ్రాసిరి. అందు కర్మకాండను విపరీతముగా ఖండించిరి. అంతకుపూర్వము పూర్వ మీమాంస, ఉత్తరమీమాంస అను రెండుశాస్త్రములు పరస్పరపూరకము లని భావించబడుచుండెను. పూర్వమీమాంస యనునది మొదటి భాగము. అందు పండ్రెండధ్యాయములు, అరువది పాదములు కలవు. రెండవది ఉత్తరమీమాంసయను వేదాంత శాస్త్రము. అందు నాలుగు అధ్యాయములు, పదునాఱు పాదములు కలవు. తొలిభాగమైన పూర్వ మీమాంస (కర్మకాండ)ను శంకరాచార్యులు ఘోరముగా ఖండించి నారు. మొత్తముమీద కుమారిలభట్టు, శంకరుడు యిరువురును సంస్కర్తలే. అప్పటి సంఘదోషములను పోగొట్ట దృఢసంకల్పముతో యత్నించిరి. కాని భారతదేశపు ప్రాచీన ధర్మము నుద్ధరింపజాలక పోయిరి. ఒక వ్యాధి పోగా దానికన్న భయంకరవ్యాధి మరొకటి సంప్రాప్తమైనది. అది - జగత్తు మిథ్య, స్వప్నము, కల్పన అను భావములు దేశమంతట వెల్లువికి మొత్తము జాతి తమను స్వప్నస్థులవలె భావించుకొనుట.

# జ్ఞాన కర్మ భక్తి మార్గములు

కుమారిలభట్టు మరియు శంకరాచార్యులు తమ అమాన్య పాండిత్య బలమున బౌద్ధ జైనమతములవలన కలిగిన నాస్తికతను దూర మొనర్చుటలో సఫలులైరి. భారత దేశములో బౌద్ధ ధర్మముయొక్క పునాదులు కదలిపోయినవి. కుమారిలభట్టు శంకరాచార్యులవారికి కల్గిన సాఫల్యత దార్శనిక పరిధులవరకే ఆగిపోయినది. ఇటు బౌద్ధజైనులలో కూడా కొన్నిదార్శనిక సమస్యలుత్పన్నములైనవి. వానికి విరుద్ధముగా మరి కొన్ని దార్శనిక యత్నములారంభమైనవి. మొత్తము మీద ఇవన్నియు కొందరు పండితులకు మనోరంజన కారణములేయైనవి కాని సామాన్య ప్రజల సాంఘికార్థిక రాజకీయాది దైనిక జీవన వ్యవ హారములం దేమాత్రము సంస్కరణ జరుగలేదు. ఇంతేగాక దార్శనిక మైన ఐక్యతకూడా ఉన్నట్లు కన్పడదు. భారత దేశమున ప్రసిద్ధములైన

వైదిక దర్శన (షట్) శాస్త్రములు కూడా పరస్పరవిరుద్ధములుగా నుండెను. వేదాంతులు "మీమాంసకులను మూర్ఖులని, న్యాయ వైశేషికుల నర్ధనాస్తికుల"ని పల్కుచుండిరి. ఇక యోగ సాంఖ్యములను శంకరు డమాన్యములనియే తలంచెను. ఆ కాలమున వేదవిషయమున కొంత శ్రద్ధ కల్గినను దానివలన సామాన్యజను లేమాత్రము ప్రభావితులు కాలేదు. వారు మూర్తిపూజలనే చేయుచుండిరి. ఆ మూర్తులు-బౌద్ధ జైన హిందువులలో నెవరివైనాసరె. తోడ్తో మాయావాద స్వప్నవాదములు పెరుగుటచే జనులలో కర్మశీలత కుంటువడినది. ఋగ్వేదములో 8-2-18 న—

"ఇచ్ఛంతి దేవాః సున్వంతం న స్వప్నాయ స్పృహంతి"
అనగా దేవతలు కర్మశీలులైనవారినే మెచ్చెదరు కాని "నిద్దుర బోతులను కాదు" అనియున్నది.

మాయావాద స్వప్నవాద ప్రచారములవలన, వానిచే కల్గిన విషమ పరిణామములవలన సంక్షుభితులైన భారతీయ దార్శనిక పండితులు కొందరు భక్తిమార్గమును నెలకొల్పిరి. శంకరాచార్యుని మతము నెదురించిరి. ఆ దార్శనికుల నుండి ఉత్పన్నములైనవే విశిష్టాద్వైత, శుద్ధాద్వైత, ద్వైతాద్వైతాదులు. ఆ సమయమునగల జ్ఞానకర్మ మార్గములలోని పరస్పర వివాదము భక్తి మార్గమునకు దోహదకారియైనది. అహం బ్రహ్మ జగన్మిథ్యలలో ఉపాస్య, ఉపాసక, ఉపాసనలకు స్థానముండదు. దీనికి తోడు కుమారిలభట్టాది మహానుభావులు నిరూపించిన కర్మకాండముకూడా అనిరుక్తము (అర్థము కానిది) గా నుండెను. అనగా యజ్ఞములు మాత్రమే కర్మయనుట. దేశోన్నతికై కృషి, పరిశ్రమ, రాజనీతి, వర్ణాశ్రమధర్మ మొదలగు మంచి కర్మలెన్నియో అవసరము. కాని వారి దృష్టిలో నివియన్నియు కర్మలలో చేర్చబడలేదు. ఆ కాలమున "యజ్ఞమొనర్చుము స్వర్గములభించును" అనుట ప్రసిద్ధమైపోయినది. అంతేకాని, యజ్ఞమన నేమి? స్వర్గమన నేమి? ఇత్యాది రహస్యవిషయములు మననీయములు గాకుండెను. ఇటువంటి రోగములకు భక్తిమార్గావలంబులు కొంత చికిత్సచేసిరి. కాని దాని

పాదుకూడా ప్రాకృతిక సిద్ధాంతములపై నెలకొల్పబడలేదు. అంధ విశ్వాసముపేరే భక్తి యనబడినది. అందుచే అంతవరకు జ్ఞాన, కర్మ కాండలు ప్రతిద్వంద్వములుగా (పరస్పర విరుద్ధములుగా) నుండెను. కాని దీనితో మరొక ప్రక్కనై జ్ఞానమార్గ, కర్మమార్గ, భక్తి మార్గ ములుగా ప్రతి ద్వంద్విత్రియమైనది. ఇక ఈ మూడింటిలో పెరిగిన పరస్పర వైరుధ్య ప్రభావము ఆ కాలమందుద్భవించిన మహాత్ములలో మోక్షప్రాప్తికి వేదాధ్యయనాదు లావశ్యకము లను దృష్టి ఎవరికిని కలుగనీయలేదు. నామ జప ప్రథయే, ఆ కాలపు విశేషత. ఆనాటి ప్రబోధములు:—"రామనామము స్మరించుము. చదువుకొని చేయున దేమి? ఈ వ్యాకరణము ధర్మశాస్త్రములు ఎందుకు? శాస్త్రాధ్యయన ములలోనే మొత్తము జీవితమును నాశనము చేసికొనుట మూర్ఖతగాక ఏమిటి?" ఇవి. వీనితో విజ్ఞానప్రదములైన వేదాధ్యయనములు విడువ బడినవి. ఒకడో అరో వేదము చదువుకున్నవాడెట్లనైననున్నచో వాడు అకించనుడై ఏమూలనో జీవితము గడుపుచుండెడివాడు. ఐన ఇక అట్టివారు వేదమును నిర్మూలము గాకుండ రక్షించగల్గిరే కాని దానికి కల్గుచున్న అప్రసిద్ధినుండి మాత్రము రక్షించలేకపోయిరి. నానకపంథీ, దాదూపంథీ, నారాయణపంథీ మొదలుగా నెన్నియో స్థాపితములైనవి. ఈ పంథలవారందరు వేదములను వదలి తమ తమ గురువుల వాణినే ఈశ్వరవాణి యనుకొన జొచ్చిరి. అందుచే అప్పుడేదైనా జాతి సంస్క రణ జరిగియుండినను అది క్వాచిత్కము, కించిన్మాత్రమే. ఆ గురువులు చేసిన సంస్కరణ కూడ నిరర్థకమైనదే. ఉదాహరణకు "తిరువాన్ కూరులో పుట్టిన ఒక ధార్మికుడు ఏకేశ్వరోపాసనమును ప్రబోధించుచు మూర్తిపూజను ఖండించెను. కాని ఆయన మరణానంతరము వారి శిష్యులు వారి మూర్తినైతే పూజించలేదు కాని వారి బట్టలు మొద లగు వస్తువులను పూజింపజొచ్చిరి. ఇట్లే బాబా నానక్ మూర్తి పూజకుడు కాడు. కాని వారి శిష్యులు గ్రంథమును పూజింపజొచ్చిరి. విషయ మెక్కడిదక్కడనే యున్నది. రోగమదే. కొంచెము రూపము మారినది."

ఇచట జ్ఞాన, కర్మ, భక్తి మార్గములను కొంచెము విమర్శించి అందు పొరపాటెటనున్నదో తెలిసికొందము. జ్ఞానకాండము, కర్మ కాండము, భక్తికాండము లేక ఉపాసనాకాండమని మూడు కాండ ములు ప్రసిద్ధములు. అట్లే జ్ఞాన మార్గ, కర్మ మార్గ, భక్తి మార్గము లను నీ మూడు మార్గములు గూడ ప్రసిద్ధములే. మార్గమనగానేమి? కాండమనగానేమి ? వీని శాబ్దికార్థమును కొంచెము విచారింతము. మార్గమున కర్థము-బాట. ఇది అరబ్బీ భాషకు చెందిన "మజహాబ్" అను పదమునకు పర్యాయపద మనుకొనవచ్చును. దాని కర్థము త్రోవ. ఈ మార్గము, లేక మజహాబ్, లేక త్రోవ యన నేమి? మీరున్న చోటునుండి పోదలచుకున్న చోటునకు చేరుటకై అవలంబించు దారి. అదే మార్గము. ఉదాహరణకు:— మీరు కాన్పూరు నుండి లఖ్నో వెళ్లుటకు ఒక త్రోవ సూటిగా నున్నది. ఆ చక్కటి త్రోవయేగాక ఇంకను ఎన్నియో మార్గములున్నవి. అవి కూడ మిమ్ము (లఖ్నో) గమ్యము చేర్చగల్గినవే. ఐనను వానిలో ప్రతిదాని కేవో సహజ విశేషతలు - గుణములో, దోషములో ఉండును. ఆ మార్గములందున్న చిత్రమేమన — మీ రొకే సమయమం దనేక మార్గములలో నడువ జాలరు. ఒక దారి నవలంబించినపుడు రెండవదానిని తప్పనిసరిగా విడువ వలసి వచ్చును. అయితే కాన్పూరునుండి లఖ్నో చేర్చుటకు మరొక మార్గము కూడా ఉన్నది. అది తిన్నగా నున్న దారికి భిన్నమైనది. అనగా వంకర త్రోవ అన్నమాట. ఇక కాండ శబ్దార్థము వేరు. కాండ యనగా స్థంభము. ఇంటిని నిల్పుట కాధారమైనది స్థంభము. ఏయింటిని నిలబెట్టుటకై నాల్గు స్థంభము లవసరములో ఆ యిల్లు మూడు స్థంభ ములపై నిలువజాలదు. ఆ నాల్గు స్థంభములలోకూడ పరస్పరసహయోగ ముండవలయును. ఈ విధముగా కాండ, మార్గము లను నీ రెండు శబ్దములు భిన్నార్థ బోధకములు. ఇవి భిన్నదశలను కల్గించునవి. వైదిక దర్శనమందు మూడు కాండముల వర్ణనము కలదు. ముక్తి ప్రాప్తికీ మూడు కాండము లావశ్యకములే, జ్ఞానకాండమన జ్ఞాన స్థంభము. కర్మకాండమన కర్మ స్థంభము. ఉపాసనాకాండమన

ఈశ్వరునిగూర్చిన ప్రేమ. ఈ స్తంభములం దేది బలహీన మైనదైనను ముక్తి లభింపజాలదు. అయిన కాండ శబ్దమును వదలి మార్గ శబ్దమును ప్రయోగింపజొచ్చిన మహానుభావులు "మే మొకేమార్గమున నడచియే ముక్తినందగలమని చెప్పజొచ్చిరి. మూడు మార్గములలో నడచుట కఠినము, అనవసరము. అనితి. దీని స్పష్ట పరిణామము జ్ఞానకర్మోపాసనలు వేర్వేరై పోయినవి. సంప్రదాయముల విభజనము కూడా జరిగినది. ఆ మీదట పరస్పర ఈర్ష్యా ద్వేషములుకూడా ప్రబలినవి. పండితులు సంతులను నిర్లక్ష్యము చేసినారు. సంతులు గృహస్థుల (దేశ వ్యవహార నిర్వాహకుల) నిందించినారు. వారు కేవల నామజపమే చేసెడివారు. వేదాధ్యయనము లవసర మనుకొనినారు. అజ్ఞానులైన సాధువుల సంఖ్య పెరిగినది. దేశోన్నతి నిలిచిపోయినది. అది యాగిపోవుటచే ధర్మము కూడా చేయిజారిపోయినది. "నీం హకీం ఖత్రే జాన్, నీం ముల్లా ఖత్రే ఇమాన్." మన జ్ఞానకాండ మెంతవరకు పటిష్ఠము కాదో మనమంతవర కజ్ఞానులముగానే యుందుము, దేశమునుగూర్చి నిర్వహించవలసిన లౌకిక కర్తవ్యములను పూర్తిగా నిర్వహించజాలము. మరియు ధార్మికబాధ్యత(ఉత్తరదాయిత్వము)లను కూడా పూరింపజాలము. కర్మ నిమిత్తమే జ్ఞానమున్నది గావున కర్మకాండ మెంతవరకు ధృఢముగాదో అంతవరకు జ్ఞానమునకు విలువయే లేదు. ఉదాహరణకు భూగోళశాస్త్రము చదివి, యాత్రలు చేయకున్నను యాత్రికుడు కానేరడు. అటులే విద్య నార్జించి, కర్మ మొనర్చుచుగూడ ఈశ్వరునిపట్ల భక్తి కలిగియుండనిచో, జ్ఞాన కర్మములు రెండును వ్యర్థములే. రెంటి లక్ష్య మొక్కటియే గదా !

## దేశ విదేశములలో సంస్కరణ కృషి

మన దేశములో పుట్టిన కొందరు సంస్కర్తలను, వారి సంస్కరణలను గూర్చి పైన తెలుపబడినది. ఇట్లే బయటి దేశములలోకూడా సంస్కరణలు జరుగుచుండెడివి. పరిస్థితులు భిన్నము లైనవగుటవలన సంస్కరణలందు కొంత భేదముండవచ్చును. ఎట్లు సాధారణ హిందు

వులలో మౌలిక ధర్మమును వీడి ప్రథల ననుకరించుటకే యావశ్యక మనుపించినదో, అట్లే హజరత్ మూసాతర్వాత యూదులలో కూడా ప్రథలనే ధర్మమనుకొను స్థితి యేర్పడినది. ఎక్కువ తక్కువవారను భావము హిందువులలో వలెనే యూదులలో కూడా ఉండెను. ఈ పరిస్థితిని బాగుపరచుటకై సంస్కర్తలెందరో బయలుదేరిరి. యూదులు వారిని "నబీ"లని, పైగంబరులని భావించెడివారు. బుద్ధుడు భారతదేశములో సంస్కరణ జరిపినట్లే యూదులలో మూసాకూడా సంస్కరణ చేసెను. తమ సంఘసంస్కర్తలను భారతీయు లెట్లు విరోధించిరో అట్లే యూదులుకూడా విరోధించిరి. బుద్ధునకు యెవరిపైనను ద్వేషము లేదు. ఐనను అతనిని ద్వేషించువారు కొందరుండిరి. వారిలో అతని సోదరుడగు దేవదత్తుడే అతనికి శత్రువు. ఇట్లే ఏసుక్రీస్తును ద్వేషించిన వారుకూడ యూదులే. అతనిని శిలువ నెక్కించినవారుకూడా వారే. సంస్కర్తలపని చాల కష్టతరమైనది. డాక్టర్లను రోగులు ఆహ్వానించెదరు. గౌరవించెదరు. ఫీజు నిచ్చెదరు. కాని సంస్కర్తలకా యదృష్టము లేదు. ఎవరు మత మౌఢ్య (సాంప్రదాయికత) దురాచారాది రోగగ్రస్తులై యున్నారో వారు కూడా సంస్కర్త యను డాక్టర్‌కు కృతజ్ఞులు కారైరి. పైగా వారే అతనికి ప్రాణశత్రువులైరి. ఏసు క్రీస్తుపట్ల ఇట్లే జరిగినది. బుద్ధుని పిదప, బుద్ధధర్మము స్వయముగ పరిపాటి (ప్రథలకు) కి గురియైనది. ఒక్కొక్కసారి పరస్పర అవిశ్వాసముల వలన, మరొకసారి దార్శనిక లోపములవలన, ఇంకొకసారి కేవల ఈర్ష్యా క్రోధ స్వార్థాదులవలన కలిగిన పరిణామ మెట్లు బౌద్ధులలో వికారము కలిగించినదో, అట్లే క్రైస్తవులలోగూడా వికారము కలిగి వేరువేరు వర్గములుగా విడివడిరి. క్రీస్తు జీవనములో సంబంధించిన కొన్ని చమత్కారములను, కొన్ని ప్రథలను విస్తరింపజేయుటకు తగిన కొన్ని కథ లల్లబడినవి.

ఏసు క్రీస్తు ఒక పవిత్ర పురుషుడు. ఆయనను ఈశ్వరుని ఏకైక కుమారునిగా వారి అనుచరులు ప్రసిద్ధపరచిరి. పిదప యూదులకు క్రైస్తవులకు పరస్పర వివాదములు బయలుదేరినవి. ఆ వివాదములు

కుట్రలుగా పరిణమించినవి. సంఘసంస్కరణ శాంతి స్థాపనలందు క్రీస్తు రాజకుమారుడని వర్ణించిన ఆ క్రైస్తవులే ఆయన పేరుమీద ప్రపంచములోని తమ రాజ్యములలో మరియు ముస్లిం రాజ్యములలో కూడ యూదులకు ఎక్కడ నిలువనీడ నైనను దొరకనీయలేదు. సరికదా ఎంతోకాలమువరకు వారి అత్యాచారములకు యూదులు గురియగుచు వచ్చిరి. ఐనను యూదులుకూడ తమపై నన్యాయ మొనర్చువారి నెదిరించుచు తమ రక్షణ కెన్నియో యుపాయముల బన్నిరి. ఇదేవిధముగా క్రైస్తవుల - యూదుల మధ్య ఎంతోకాలము వరకు వివాదములు జరుగుచునే యుండినవి.

భారతదేశ సంస్కర్తలకును ఇతరదేశముల సంస్కర్తలకును గల ముఖ్యభేదమును తెలిసికొనుట పాఠకులకు చాలా అవసరము, లాభదాయకమును.

అవతారపురుషులుగా, సంతులుగా, మహంతులుగా భారత దేశమున వ్యవహరించినవారిలో కొందరు వేదములను వదలివేసినను, వైదిక సంస్కృతియొక్క సాధారణ నియమములను పోనీయలేదు. బౌద్ధ జైనులలో, వారి సంస్కృతులలో ఎక్కువ భేదము లేదు. భాష, సభ్యతకు సంబంధించిన అహింసాది నియమములు అవే. ఇంతే కాక సంస్కృతికి మౌలిక సిద్ధాంతము లనుకొనబడు వానియందు కూడా బౌద్ధ జైనులకు పెద్ద భేదము లేదు. ఇక రామకృష్ణాద్యవతారముల యొక్క ఉపదేశములలో భిన్నతయే లేదు. కాని భారతదేశమునకు వెలుపలి దేశములలో ప్రారంభమైన పైగంబరుల, దూతల పరంపరలో నెంతయో భిన్నత కల్గియుండెను. వారి ప్రభావము కూడా ఆ దేశీయుల సంస్కృతీ సభ్యతలపై బాగుగా పడినది. రాముడెన్నడును "నే నీశ్వరుడ" ననలేదు. అట్లే వైదిక ఋషులలోని యే ఋషికూడా తా నీశ్వరునిచే పంపబడిన వాడనని యనలేదు. కాని పైగంబరులలో ప్రతివాడును తాను పైగంబరునని, దేవవాక్యము తెచ్చితినని చెప్పని వాడు లేడు. రూహుల్ ఖుద్దూస్ కాని, హ-జిబ్రాయిల్ కాని ఇంక యే దూతయైనను సరే తా నేదో ఒక ఆకాశశక్తినుండి ఇలహాం

(ఈశ్వరవాణిని) తెచ్చినట్లు మరియు పాతదానిని (మన్‌సూక్) నిర్మూలించినట్లు ప్రకటించుకొని క్రొత్త నియమమును ఆచరణలోనికి తెచ్చుటకై ప్రజలను ప్రోత్సహించుచుండెడివారే. ఉదాహరణ:—హజ్రత్ "మహమ్మద్" తన నియమములను ప్రబోధించుచు అంతకుముందున్న హ. ఈసా, హ. మూసాలు నెలకొల్పిన నియమముల రద్దుపరచెను. అందుచే మహమ్మద్ మరియు వారి అనుయాయుల దృష్టిలో హ. ఈసా మూసాలు పైబంగరులే యైనను (మన్‌సూక్‌షుదా) త్రొలగించబడినన పైగంబరులు. ఈ విషయమును కొంచె మాలోచించినచో వెనుకటి సంస్కృతిని నామరూపములు లేకుండ చేయుటకు తోడ్తో క్రొత్త శాసకుని యాజ్ఞయే నిల్చుటకు కల్పించిన మార్గము కావచ్చునని బోధపడుచున్నది. పైగంబరులు చేయు అజ్ఞలకు, వారు ప్రకటించు శాసనములకు, "దేవదూత వచ్చి నా చెవిలో చెప్పి వెళ్లినాడ"ను వారి మాటలే తప్ప భావ్యా భావ్యము లాలోచించు ప్రమాణ మేదియును లేదు. అప్పుడా పైగంబరు లిడు అజ్ఞలు ఈశ్వరవాక్కులే కాని వారి యాలోచనాజన్యములు కావనుటకు పరంపర యడ్డువచ్చినది. భారత దేశమందు శంకర రామానుజాది మత ప్రవక్త(సంస్కర్త)ల కాలములో దర్శనశాస్త్ర ప్రాబల్యముండెను. దర్శనములు, ఆఖ్యానములు విమర్శనములు భారతదేశమందెపుడును అవరోధించబడలేదు. విమర్శనాత్మక స్వాతంత్ర్య మందరకు ఉండెను. వేర్వేరు సాంప్రదాయములందు శత్రుత్వమున్నను అది బాహ్యారూపముగానే యుండెను. ఈ విషయమున దిగువనిడు హిందూ పండితుని వాక్యము గమనార్హము. "హస్తినాతాడ్య మానోపి న గచ్ఛేజ్జైన మందిరం" "ఏనుగుచే చచ్చినను సరియే కాని బ్రతుకుట కటనున్న జైనమందిరములో నడుగిడకుము." అని తన యనుయాయులకు బోధించినాడు. హేయ ద్వేషములు ఇంతటి పరాకాష్ఠ నందియున్న నా కాలమున జైన మందిరములు, పూజలు, పురస్కారములు వారి యధీనముననే యుండెను. ఈ స్థితి పాశ్చాత్యదేశపు పైగంబరులలో ఉన్నట్లు గోచరించదు. యూదులు భారతదేశమున నివసించగలుదురు. మందిరములు

నిర్మించుకోగలుదురు మక్కాలో కానీ మదీనాలో కానీ, రోములో కానీ వీరి కా యవకాశము దొరుకదయ్యె. వందలకొలది యేండ్లుగా వారు స్థానహీనులై నెన్నియో అత్యాచారములకు గురియగుచు తిరుగుచు నేటికి ఇరువదవ శతాబ్దములో తమకు "ఇజ్రాయిల్" అను దేశమును నెలకొల్పుకో గలిగినారు. ఇంతకాలమున కీపాటి మార్పు పాశ్చాత్యుల రాజనీతిలో కల్గుట యూదులకు గల వైజ్ఞానిక ప్రతిభను దృష్టి నిడుకొనియే కాని, వారికి ధార్మిక విచార స్వాతంత్ర్య ముంచ వలెనని మాత్రముకాదు.

హజ్రత్ ముహమ్మద్ సంఘసంస్కరణ మొనర్చెను. కాని దాని కాధారము - అంతరికముగా రాజనీతి, బాహ్యరూపముగా మతము. ఆయన "అఫరపుల్ నబియా" నబీలందరలో శ్రేష్ఠుడు. మరియు "ఖా తి ము ల్ న బి యా" చివరి పైగంబరుకూడా అని ముసల్మాను లందురు. ఇంతియేకాక మతము (ధర్మము)నకు ఇతరు లెవరును కల్గించజాలని పూర్ణోన్నతిని ఆయనయే కల్గించెననియు ఆయన తర్వాత నెవరును రారనియు చెప్పనలవిగానంత గొప్పతన మాయన కున్నట్లు ముసల్మానులు దృఢముగా ప్రకటింతురు. అయినను నిది ప్రతిజ్ఞా మాత్రమే. దీని కాధారము (ప్రమాణము) లేదు. కొంచె మాలోచించిన ఆయన తన ప్రతిజ్ఞలలో దేనిని పూర్తి చేయలేదని తెలియు చున్నది. ఉదాహరణకు:—వారి ప్రతిజ్ఞలలో మొదటిది గొప్పది, మూర్తిపూజా నిరోధము. అది సాధించుటకు వారు, వారి యనుయాయులు మూర్తులకు విరోధులైనారే కాని మూర్తిపూజకు కాలేదు. దేవళములలోని మూర్తులను పగులగొట్టిరి. కాని హృదయ ములలో గల మూర్తి పూజను తొలగించ లేకపోయిరి. దీనికి కారణము అరబ్‌స్తాన్‌లో ఆయన కాలమందు యోగదర్శనములో చూపించిన ఈశ్వర ధ్యాన పద్ధతి లేకుంటయే. అందుచే ఎదుటనున్న మూర్తి తొలగించబడినను సిజ్దా చేయు పద్ధతి పూర్తిగా మందిరాంతర మూర్తుల యెదుట చేయు విధానమువంటిదే. పూర్వ మొక కవి

"షేఖ్ నే మస్జిద్ బనాయా మిస్‌మార్ బుత్‌ఖానా కియా" అను మొదటి పఙ్క్తిని వ్రాసి, రెండవ పాదము తోచక ఆలోచించుచుండగా అతని శిష్యుడొక హిందువు దాని నందుకొని "పహిలే తో సూరత్ ఖీ ఖీ। అబ్ సాఫ్ వీరానా కియా" అని పూరించినాడట.

మూర్తుల పగులగొట్టిన మాత్రమున మూర్తి పూజ అంతరించ జాలదు. సోమనాథ మందిరమును, దానిలో గల మూర్తులను తుత్తునకలు చేసి యటగల వజ్ర వైఢూర్యాది సంపద దోచుకొని పోయి నారు. దానితో మూర్తి పూజ సమాప్తమైనదా ? ఆ స్థానమున మరొక శిలా విగ్రహము చేరినది. ఇది ఎటుగాని అసంపూర్ణ సంస్కారము. దాని వెనుకగల (సంస్కరించవలెనను) కోరిక గట్టిదే. కాని దానిని సాధించ వలసిన విధాన జ్ఞానము శూన్యము.

అజ్ఞానులు మూర్తి పూజ నెందుకు చేయుదురు ? అని యెప్పుడైన ఆలోచించిన గదా యట్టి జ్ఞానము కల్గునది ? ఇట్లే కొందరు హజ్ (యాత్ర)కు పోవుదురు. అచట నల్లరాయి ఎదుట తలవంచుదురు దానిని ముద్దిడుకుందురు. వారిట్లేల చేయుచున్నారో ఆలోచింతురా ? భారతదేశములో మరియు ఇతర దేశములలో సంస్కరణలగూర్చిన సంక్షిప్త పరిచయము దాని విస్తృత వ్యాఖ్య ఆ యా దేశముల ధార్మిక సామాజిక ఇతిహాసములవలననే తెలియనగును. సంస్కరణలు నిరంతరము జరుగుచునే యుండును. ఏలనన ? మొత్తముమీద రోగాని కౌషధ మనివార్యమే కదా ! అట్లే సంస్కర్తలుకూడా ఎప్పుడూ ఉంటూనే ఉండిరి. అయితే పైన పేర్కొనబడినవి. ఆంశికములు, పైపైన జరుపబడిన సంస్కరణములు. అంతేకాని సంస్కరణల యొక్క మూలము లేక వాని ధ్యేయము సమగ్రముగా ఆలోచించి చేయబడినవి కావు.

——: ※ :——

# ఆ శా కి ర ణ ము

పందొమ్మిదవ శతాబ్దిలో విజ్ఞాన ప్రాధాన్యత పెరుగజొచ్చినది. దానిననుసరించి జీవనముతో సంబంధము గల వేర్వేరు అంశములనేగాక ధార్మిక మూలతత్త్వములనుగూర్చి కూడా అన్వేషణ, ప రి శీ ల న లారంభమైనవి. ఇంకను సాంస్కృతిక నియమముల మానవీయ ప్రవృత్తుల వర్గీకరణ వ్యక్తీకరణలగూర్చిన వివేచనకూడా మొదలైనది. అపుడున్న పాత పరిభాష లా వివేచనకు తట్టుకోజాల నందున ధర్మము యొక్క పునాదులు కదలజొచ్చినవి. పీర్, పైగంబల్, సంత్ అవతార, ఈశ్వరవాణి, ధ ర్మ శా స్త్ర ము లు అను వానినిగూర్చి విమర్శనలు మొదలైనవి. అంతటితో నాగక ఈ శ్వ రు డు కల్పితసత్తాయని యొకడు, ధ్యానమను పేరుతో సమయమును వ్యర్థపరచుటే తప్ప ఆత్మలేదు పరమాత్మయులేదని మరొకడు, ధర్మము మతము అనబడు నవి మానవునికి పిచ్చినెక్కించు నల్లమందని వేరొకడు, మానవ మస్తిష్కమునుండి ఈశ్వరభావన తొలగిననే చాలు ప్రపంచములోని గడబిడలు పోయి లోకము నిష్కంటకమగునని యింకొకడు ఇట్లెవరికి తోచినట్లు వారనజొచ్చిరి. అయితే ఈ యాలోచనాశైలి మొదట మనోరంజకముగానే కన్పించినది. కాని ఆ కడపటి నూరు సంవత్సర ములలో యా యాలోచనా పరిణామము మానవజాతికి పూర్తిగా యనుభవమునకు వచ్చినది. కార్లమార్క్సు కన్న కల లెంతో క్రిందు మీదులైనవి. అచ్చము కమ్యూనిస్టు దేశముల వారికి కూడా "లోక ములో మానవజాతికి సంపూర్ణ సుఖము గల కాలమని" నిరూపించు నంతటి ప రి వ ర్త న యెప్పటికైనా తేగలమా ? అని సందేహము పట్టుకున్నది.

విజ్ఞానాన్వేషణకూడా చాలా జరిగినది. ఇంకను జరుగుచున్నది. భూమ్యంతర్భాగము, భూతలము, ఆకసము విజ్ఞానాన్వేషణకై విశాల క్షేత్రములైనవి. పూర్వతరముల వారెవు డూహించియైనా ఉండని చోట్లకు మనము వెళ్లవలెనను ప్రయత్నములో నున్నాము. సైన్సు

వలన ప్రస్తుతము భూమిపైగల సకలదేశములు సన్నిహితము (చాల దగ్గర) లైనవి. అట్లే సూర్య చంద్ర లోక లోకాంతరములు కూడా సంబద్ధములు కావచ్చును. కాని అది మానవజాతికి శాంతిని ప్రసాదించ గలదా? అను సందేహము వెంటనే కల్గుచున్నది. "ఖలేహీమాహాసే మిరీఖ్ తక్ బనాలో సడక్, జమీం పే రాస్తా రహానేదో ఆనే జానే కా" చంద్రలోకమునుండి అంగారక లోకమువరకు రోడ్డు వేసుకొనుము. కాని వచ్చిపోవుటకు భూమిపై మార్గము మాత్రము ఉండనిమ్ము" అన్నాడొక కవి.

క్రీ.శ. 1824 లో గుజరాత్ (కాఠియావాడ్)లో నొక పిల్లవాడు జన్మించెను. ఆయన ప్రపంచమందుగల ధార్మికములలోని, వ్యావహారికములలోని మంచిచెడుగుల మొత్తమును శోధించియుండెను. మహాభారత యుద్ధమై అయిదువేల యేండ్లు దాటినవి. అర్జునుడు శ్రీకృష్ణునితో (గీతలో) నెన్ని సందేహముల వెల్లడించెనో యవి యన్నియు సాంఘికరోగములై నొక్కొక్కటిగా భారతదేశమందేగాక సమస్త ప్రపంచమందలి మానవజాతికి కష్టములను కల్గించుచున్నవి. ఈ రోగములకొరకు వైద్యులుకూడా పుట్టినారు. వారు చికిత్సకూడా చేసినారు. కాని యిట్లొకవైపు ఔషధ మిడుచుండ నింకొకవైపు రోగము మరింత పెరిగిపోవుచుండె"నన్న సామెత యైనది.

మహాభారత యుద్ధ పరిణామ మేమికానున్నదో యానాడర్జును డూహించియే యిట్లనెను. "కృష్ణా! నాకీ గృహయుద్ధమున నాశమే నాశము కన్పడుచున్నది. ఈ కులఘాతక రోగమును తొలగించుట మన కర్తవ్యము కాదా? కులనాశనమువలన సనాతన ధర్మము లోపించును. పాపము పెరుగును. అధర్మాభ్యుత్థానమున కులస్త్రీలు తమ ధర్మమును విస్మరింతురు. వారి సతీత్వమున కాఘాతము కల్గును; సతీత్వము నష్టమగుటతో వర్ణసంకర సంతాన ముత్పన్నమగును. అట్టి అయోగ్య సంతానము కులమునకు నాశకరమై కులము వారందరకు నరకహేతువగును. వారి పూర్వజుల యాదర్శము లుప్తమగును. వాని యాశలన్నియు నిరాశలగును. కులఘాతుకమైన నిట్టి దుష్ట సంతతి

యొనర్చు పాపనులవలన వారి జాతి, దేశములలో ప్రాచీనకాలము నుండి యభిమానాస్పదములై యున్న ప్రత్యేకతలు, విశేషతలు నష్టమగును. కృష్ణ! కులధర్మము నష్టపరచువారి యదృష్టమున నరకమే యుండునని పూర్వులు చెప్ప వినియుందుము. ఆలోచించుము. మన మెంత గొప్ప పాపము చేయబోవుచున్నాము? దీనికన్న సశస్త్రులైన కౌరవులు నన్ను చంపినను మేలే యనుకొందును."

భగవద్గీతయొక్క ప్రథమాధ్యాయ మీ హెచ్చరికతోనే పూర్తి యగును. ఇది హెచ్చరికయే కానిండు, భవిష్యవాణియే కానిండు దీనిలో యెవరును తిరస్కరింపవీలులేని యొక సత్యము మాత్రమున్నది.

అర్జునుని యీ యాంతరిక ధ్వనిని కృష్ణుడు వినిపించుకొనలేదు. అర్జునునకు కలిగిన సంశయములను సమాధాన పరచలేదు. ఏదో విధమైన వత్తిడివేసి యర్జునుని మాటాడకుండ చేసినాడు. కాని యా భవిష్యవాణి మాత్రము ముమ్మాటికి నిశ్చయమని మనకిపుడు స్పష్టమగుచున్నది. కులము నష్టమైనది. కులధర్మము కూడ నష్టమైనది. అయిదువేల యేండ్లనుండి దహించుచున్న యా కారుచిచ్చు యేదో రూపమున ప్రజ్వరిల్లుచునే యున్నది. ధర్మము పోయినది; ధర్మశాస్త్రము పోయినది. మ ం చి న డ వ డు లు (ప్రథలు) పోయినవి. ఉత్కృష్టాదర్శముకూడా పోయినది. సదాచారము, సద్విచారము కానరాదు. ఇది (ప్రపంచం) వింతరోగులచే క్రిక్కిరిసిన విచిత్రమైన ఆసుపత్రియైనది. ఇందు వైద్యులు లేరు, వైద్యపరికరములు లేవు.

మూ ల శ ం క రు డ ను పేరుగల కుఱ్ఱవాడు పెరిగి స్వామి దయానందు డగుసరికి ఆయనముందీ శోచనీయ పరిస్థితులు నిజరూపములతో ప్రత్యక్షమైనవి. స్వామి దయానందుని యాంతరిక ప్రేరణకు కారణమనబడు ఎలుక కథ దేశప్రసిద్ధమైనదగుటవలన పునరావర్తన మనవసరము. బుద్ధిశాలియగు మూలశంకరున కదొక చిన్న సంకేతము. ఆ చిన్న విషయమును బురస్కరించుకొని సంస్కరణాత్మకమైన యొక విశాల భవనము నెలకొల్పబడినది. అదే ఆర్యసమాజము.

"తద్విష్ణోః పరమంపదగ్ం సదా పశ్యంతి సూరయః"
(ఋగ్వేదము.)

"విద్వాంసుల దృష్టి నిరంతర మీశ్వరుని పరమపదముపైన నిల్చి యుండును." ఈ నియమానుసారము నీకీరోజు శివదర్శనము కాగలదని మూలశంకరునకు పెద్దలు బోధించుచే తడవుగ నాయసలోని భక్తిభావ ముత్థానమైనది. ఎంతయో నుత్సాహముతో ఆ శుభావసరమున కెదురు చూచుచుండెను. కాని ఎపుడా శివాలయములోని లింగముపై నొక తుచ్ఛప్రాణి చేయు నుద్దండ తాండవ దృశ్యము గోచరమయ్యెనో నా బాలకుని యంతర్నేత్రము వెంటనే ఉన్మీలితమయ్యెను. అఁ! ఇదేనా విష్ణుని పరమ పదము? విద్వద్వర్గ ముత్కంఠితమగుట దీనికొరకేనా? ఇది కాదు కాజాలదు. ఇది భ్రమ. సర్వజ్ఞుడగు నీశ్వరుని స్థానాపన్న మెన్నటికిని నొక ఊయి కాజాలదు.

ఆనాడర్జునుడు వక్కాణించినట్లు కులధర్మ మెట్లైనను నశించినది. ఇక యధర్మము ధర్మమును కృంగదీసి మ్రింగివేసినది. ఇంకేమి? "జిత్ నే కంకర్ ఉత్ నే శంకర్"—రాళ్లన్నియు దేవుళ్లే.

దయానందుని హృదయములో నుద్వేగ ముత్పన్నమైనది. ఈ రోగమునకు మూలకారణ మేమి? యని యతడాలోచింపదొడగెను. మిడి మిడి జ్ఞానముగల వైద్యునివలె త్వరపడి చికిత్సచేయ నారంభించ లేదు. సరిగదా దాని కారణముల నన్వేషించుటలో నాలస్యముకూడ చేయలేదు. లింగముపైగల యెలుక తాదుల నెలుక తినుట జూచిన మరు క్షణమందే యాయన ప్రయత్న మారంభమయ్యెను. తండ్రిని మేల్కొల్పుట, యెలుక దుష్కృత్యములను దెల్పుట, యాయన ప్రథమ ప్రయత్నము. ఆలోచన కీవిషయ మొక చిల్లరరాయివంటిదే. కాని యది మూలశంకరుని హృదయతటాకమున విసరివేయబడినది. దానితో నా తటాకమంతట నొక విశిష్టమైన కదలిక పుట్టినది.

స్వామి దయానందుడు (బాల్యమున మూలశంకరుడు) ఒక విషయమందు ఆలస్యము చేయలేదు. వేరొకవిషయమున త్వరపడ లేదు.

అనగా తగు నౌషధమును వెదకుటలో నొక క్షణకాలమైనను వ్యర్థపుచ్చ లేదు. మరియు రోగకారణముల గ్రహించుటకై జీవనకాలమునంతయు విని యోగించెను.

గొప్ప కార్యమును సాధించవలెననిన, ప్రయత్నముకూడా గొప్ప గానే చేయవలసియుండునుగదా! పదునాలుగేండ్ల వయస్సునుండి యేబదియొక్క సంవత్సరమువరకు అనగా ముప్పదియేడు [37] సంవత్స రముల కాల మాయన నిరంతర ప్రయత్న శీలుడై యుండెను. ఇతరుల ద్వారా పెక్కువిషయములు వినుట, స్వయముగ సత్యాసక్తితో నాలో చించుట, యిట్లెంతోకాలము గడపినపిదప మానవజాతికి సంస్కరణ మవసరమే యగునేని యాకార్య మార్యసమాజమే పూరించగలదను నిశ్చయమునకు వచ్చెను. వెంటనే క్రీ. శ. 1875 అనగా తన యేబది యొకటవయేట బొంబాయిలో నార్యసమాజమును స్థాపించెను.

స్వామి దయానందుడు తనను యీశ్వరావతారముగ ప్రకటించు కొనలేదు. వారొకవేళ యాపని చేసియుందురేని భారతదేశము వారికి గొప్ప స్వాగతము పల్కియుండెడిది. ఏలయన, అజ్ఞానము పెరిగి పోయినపు డిట్టి చమత్కారములే ప్రజలకు నాకర్షకములగును. కాని స్వామి దయానందుడు ఈశ్వరు డవతరించడని స్వయముగ నెరిగినవా డగుటవలన నట్లు చేయడయ్యె. కొందఱు తా నవతార పురుషుడ ననియో, లేక ఫలానా వారు అవతార పురుషులనియో నొక ప్రసిద్ధిని సంపాదించుటకై ప్రజలను మోసగింతురు. దీనివలన ప్రజలలో యజ్ఞా నము పోదు, సరికదా యది పెరిగిపోవును. ఇట్లే యాయన పైగంబరు ననికూడా ప్రకటించుకోలేదు. (ఆపని చేసియున్నను సఫలుడై యుండెడి వాడే.) ఏలయన చమత్కారములు జూపి ప్రజలను తనవైపాకర్షించు కొనుట లౌకిక చాకచక్యము గలవారికి సాధారణ కార్యమే కావచ్చు కాని, స్వామి దయానందున కీ చమత్కారాదులను చూపి చేయు తాత్కాలిక చికిత్సతో, నేమాత్రము లాభము కన్పించలేదు. చికిత్స నిలకడ గలది, రోగమును హరించగలిగినది ముఖ్యముగా రోగిని సంహ రించకుండునది కావలయును. స్వామి దయానందు డీ యత్నముననే

యుండెను. వారు గత అయిదువేలేండ్లలో పూర్వ సంస్కర్తలు చేసిన సంస్కరణలను గూర్చి బాగుగ నధ్యయనముచేసిరి. వారికి గల్గిన సఫలత అసఫలతలను బాగుగా గుర్తించి, వారి బుద్ధి సూక్ష్మతపై యాలోచించుటే కాదు, వారి బలహీనతలగూడ నిర్లక్ష్యదృష్టితో చూడలేదు. దయానందులు "మార్గము దీర్ఘమైనను మంచిది కావలె" నను సిద్ధాంతము ననుసరించువారు. త్వరపడి వారేదో యడ్డదారి త్రొక్కలేదు. తనకెవరైన మంచి సలహా నిచ్చినపుడు ధన్యవాదపూర్వకముగ స్వీకరించువాడు. అందేదైన దోష మగుపడినచో విషముకలిసిన యన్నము వలె వెంటనే విడిచివేసెడివారు. వదలుటేకాదు ఆ తప్పుచేసినవారిని హెచ్చరించుచుండెడివారు. ఆ కారణమున వారిపట్ల ఆదరాభిమానములు. భక్తిభావములు గలవారి సంఖ్య పెరిగినట్లే, శత్రుభావముగలవారి సంఖ్య గూడా పెరుగజొచ్చినది. కాని వారు దానిని లెక్కించరైరి.

స్వామి దయానందుని సంస్కరణ వెనుక అయిదు వేలేండ్ల కాలముయొక్క అనుభవము నిలచియున్నది. వారి నిట్టూర్పులో భారతమాత అయిదు వేలేండ్లనుభవించిన దుర్భర బాధ, మూర్తీభవించి యున్నది.

## రోగనిదానము

స్వామి దయానందుని యన్వేషణమం దన్నిటికన్న గొప్పది "వేద మీశ్వరవాణి" యనునది. ఆ కాలమున పవిత్ర పుస్తకము లనేకములు. ఉదా:— ముసల్మానులు కురానును, క్రైస్తవులు బైబిలును, యూదులు వెనుకటి "అహద్‌నామ"ను ఈశ్వరీయ గ్రంథమనువారు ఇట్లే పారసీయులకు వేరే పుస్తకము. ప్రతి మతమునకు, మతశాఖలకు వేర్వేరు శాస్త్రములుండినవి. కొందరు మా శాస్త్ర మన్నిటి కన్న కొత్తదనిన, మా శాస్త్రములో ముక్తి ప్రాప్తికై నెంతయో తపస్సు, ఎంతయో పరిశ్రమ బోధించి యున్నదని కొందరు. మరియు ప్రతి మనిషి లాభ (ఉద్ధరింప) పడుటకై ఈశ్వరుడు మాధర్మమును సరళముగా

నెలకొల్పినాడని మరి కొందరు. ఇట్లు ప్రతివాదును తమ మత గ్రంథ మీశ్వరీయమని ప్రతిజ్ఞ చేయువారు. ప్రాచీన గ్రంథములలోని యధిక భాగము వేదములనుండి సంగ్రహించినదే. యని ప్రకటించినవారు దయానందులు. వృక్షమునకుగల శాఖలు, ఆకులు, పుష్పములు, ఫలములు వేర్వేరు వస్తువులేయైనను వాని కన్నిటికిని జీవన రస మందించు వేరే వస్తువొకటియున్నది, అదియావృక్షము యొక్క వేరు. అదే వేదము. దానిని గ్రహించవలెనని స్వామీజీ సెలవిచ్చిరి.

వేదమహత్త్వము భారతదేశ వాతావరణమునందు గోచరించు చున్నది. వేదస్వాధ్యాయ మాగిపోయినది కాని దాని ప్రభావమున్నది. క్రొత్త క్రొత్త శాస్త్రముల సృజించి తమ తమ శాఖల నెలకొల్పుకొనిన వారంగరు వేదముల పేర్లు వినుటతో తలలువంచుచుండెడివారు. మరియు వేదాంతము ఉత్కృష్ట గ్రంథమని దానిని పఠించు యోగ్యత తమవంటి సాధారణులకు లేదుకదాయని వారు భావించుచుండెడివారు. బౌద్ధ ధర్మము వేదములను తిరస్కరించినను బౌద్ధుల శిక్షాప్రచారపద్ధతిపై మాత్రము వేదములప్రభావముండియేయున్నది. బౌద్ధ ధర్మము యొక్క శాస్త్రములను చక్కగా అర్థముచేసికొనవలెనన్న "వేదమును సంస్కృత మును బాగుగా చదువవలె"నని విద్వాంసులలో యధికసంఖ్యాకుల యభి ప్రాయము. పారసీకుల ధర్మ గ్రంథములకును, వేదములకును చాలా వరకు సన్నిహితమున్నది. రానురాను పరివర్తనలలో వేదముల ప్రాచీన ప్రభావపు ముద్రయున్నట్లే తెలియుచున్నది. దాదాపు ప్రపంచములోని విద్వాంసులందరును వేదముల ప్రాచీనత నంగీకరించియున్నారు. కాని కొందరు మాత్రము తమ పుస్తకముల గొప్పతనమును నిల్పుకొనుటకై వేదముల నంగీకరించరు. ఐతే వారుకూడా తత్ప్రాచీనత నొకప్రక్క నంగీకరించుచునే వేదము పురాతనమైనదనుట వర్తమాన కాలమునకు లాభదాయకము కాదని తమ వాదమును ప్రవేశ పెట్టెదరు. మరియు సృష్టి జరిగిన తొలిరోజులలో నీ ప్రపంచము బాల్యావస్థయందుండెను, అపుడు మానవీయావసరములు కూడ సామాన్యములుగానేయుండెను. అందుచే ఆ వేద శిక్షణలనే సంపూర్ణము లనుకొనెడివారు. కాని వృద్ధు

రాలైన నాయనమ్మ మన నవ్యజీవనములో నెదురగు క్రొత్త క్రొత్త సంఘటనలకు తోడ్పడ జాలనట్లు ఆపాత వేద మీనూతన కాలజీవనమునకు పథప్రదర్శనము చేయలేదు." అని తమ ప్రతిజ్ఞావివేచనముచేయుచుండిరి. పిరియుక్తిలోని గంభీరత మరియు విశాలతనుగూర్చి స్వామి దయానందులు బాగుగనాలోచించి, ప్రాచీన శిశులను. నవీన శిశులను తులనాత్మకదృష్టితో బరిశీలించి వస్తువుయొక్క ప్రాచీనతయే దాని నిరుపయోగమునకు, కారణముకాజాలదనియు పైగా ప్రకృతిలోని యాకర్షణ (कारश्मे) పై విషయమునకు పూర్తిగా విరుద్ధము నుద్బోధించుచున్నదనియు గుర్తించిరి.

ఈశ్వర విరచితమైన సూర్య గోళమెంతో ప్రాచీనమైన దీపము. అది ప్రాచీన తమమయ్యును ఉత్తమము. ఇప్పటి వరకు పలువిధముల దీపములు తయారై యుండవచ్చును. కాని యవి సూర్య జ్యోతిలోనొక యంశమునకుగూడా సరితూగ జాలవుగదా! నేటి విజ్ఞానము కూడా మనకవసరయోగ్యమగు దీపమును మనమే తయారుచేసికొనవలయును. కాని సూర్యునిపై యాధారపడదగదని యథాశక్తి యత్నించుచున్నది. పరిశీలించినచో నేటివరకు తయారయిన దీపములలో వేడియున్న ప్రకాశముండదు. వేరొక దీపమందు ప్రకాశమున్న వేడియుండదు. మరొక దీపమున వేడి ప్రకాశములు రెండు నుండవచ్చును. కాని స్వశక్తిచే నితర వస్తువులను వికాసమొనర్చు శక్తిలేదు. సూర్యుడను దీపమునందన్ని శక్తులు నున్నవి. ఇంకను, నదియన్నిటికన్న ప్రాచీనమయ్యును నిత్యనూతనము అట్లే వేదవిషయమునని యెంచవలయును. నేటివరకే మత గ్రంథమైనను వేదములో లేని క్రొత్త విషయమును ప్రతిపాదింపలేదు. దానిలో నేదైన క్రొత్తదనమున్నదనిన ఆ గ్రంథ భావము నిలబెట్టుకొనుటకై సంకుచిత భావకారణమున నందు సమ్మిళిత పరచుకొన్నవే. ఉదాహరణకు:— కురాన్‌లోనున్న ధార్మిక సిద్ధాంతము దాదాపుగా ఇంజీలులోనున్నదే. అదే బాబాఆదం, అదే జిబ్రాయిల్, అవేస్వర్గనరకములు. ఇక కురాన్‌లోని నూతన విషయమేమన:— క్రీస్తుకు మారుగా రసూలు—ముహమ్మద్ సాహెబ్. ఇక భిన్నతరసూల్ వ్యక్తిత్వ

మందే కాని ధార్మికసిద్ధాంతమందు లేదు. రసూల్ (పైగంబర్) హజరత్ ముహమ్మద్‌కానీ, ఏసుక్రీస్తుకానీ, లేక ఇద్దరైనను కానిండు వారి గ్రంథములందెంతవరకు ఈశ్వరునకు మానవునకుగల సంబంధమునుగూర్చి ఏదైనా నొక విశేష విషయము ప్రదర్శింపబడదో అంతవరకు వానిని ప్రాచీనము నవీనము అనుటవలన భేద మేమియు కలుగజాలదు. అట్లగుచో ప్రాచీనవస్తువు నేల విడువవలె ? అను ప్రశ్న ముదయించును. దానిలో వికార ముత్పన్నము కానంతవరకు వీడ నక్కరలేదని ఉత్తరము.

స్వామి దయానందులు బాల్యమందే యజుర్వేదమును కంఠస్థము చేసిరి. ఇట్లు చేయుట వారి వంశములో పరంపరాగతమైన మర్యాద. వేదార్థ మెరుగుట ఇతరుల కెరిగించుట యను పరిపాటి లేదు. ఐనను నదియొక పవిత్రగ్రంథము. భారతదేశమున పవిత్రములని భావింపబడు గీతా భారత రామాయణ పురాణాది గ్రంథము లన్నిటిలో వేద మెంతో గౌరవముగా పేర్కొనబడుచున్నది. ఉపనిషత్తులలో, దర్శన శాస్త్రములలో వేదవర్ణన విశేషముగా చేయబడినది. ఈ గ్రంథము లన్నింటియొక్క ప్రభావము దయానందునిపై బాగుగా పడినది కాబోలు ! వారి పేరుకు నీరందిచ్చిరియే ఈ (సంస్కృతి) వృక్షమును వికసింప జేయవలె నను నిశ్చయమునకు వచ్చినారు. అదేపనికి దొరకొని నారు. మనుస్మృతిలో "యోఽనధీత్య ద్విజా వేదాన్ అన్యత్ర కురుతే శ్రమం సశూద్రవత్ బహిష్కార్యో" "ఏ బ్రాహ్మణుడు తన జీవనశక్తిని పూర్తిగా వేదమునుగూర్చి వ్యయించడో అతడు తన జీవనమును వ్యర్థ మొనర్చుకొనిన వాడగును" అని చెప్పబడియున్నది. అందుచే దయానందుడు తన పూర్ణ జీవనమును వేదాధ్యయనాదులందే వినియోగ పరచెను.

దయానంద సరస్వతీగారి పరిశ్రమ వృథాకాలేదు. వారొక చోట "వేదములలో పరిశ్రమ చేయుటయన, గంభీరాంబుధిలో మునిగి బహుమూల్యములైన రత్నములను సంపాదించుకొనుట. వేదములను వదలి ఇతర గ్రంథాధ్యయనమున దగుల్కొనుట సముద్రతీరమున తిరిగి

జీవనమును వ్యర్థపరచుకొను మూర్ఖత గాక వేరేమిగాదు" అనివ్రాసిరి.

స్వామి దయానందులు మహాభారత యుద్ధానంతరము జాతిని సంస్కరించిన సంస్కర్తలు చేసిన పరిశ్రమను తెలిసికొనినారు. వారికి ఆంశికములుగా కల్గిన సఫలతలకు కారణములెవ్వియో బాగుగా పరీక్షించి పరిశీలించినారు.

బుద్ధుని సామాజికశిక్షణ అద్వితీయము. అది నేడుకూడా ప్రపంచమునకు మార్గమును చూపగలదు. "దమ్మపధ" మనుగ్రంథమున నిజమైన బ్రాహ్మణుడెవడు? అను ప్రశ్నకివ్వబడిన యుత్తరము. వేదభావములతో పూర్తిగా సమానమైయున్నది. బుద్ధుడీ ఉత్తరమును వేదమంత్రముల ద్వారానే ప్రజలకు బోధించియుండినచో దాని "మేమంగీకరించము" అను అవకాశము ఆనాటి పండితుల కేమాత్రము కల్గకుండెడిది. మరియు బుద్ధుని, వారు "నాస్తికు" డని యనజాలకుందురు. కాని ఆయన ఒక క్రొత్త మతము (ధర్మము) ను స్థాపింపనెంచెను. ధర్మమునకుగల ప్రాచీనాధారములను తలక్రిందుల జేయ యత్నించెను. అయినను ఆనాటి ప్రజలు ఈశ్వరునకు మారుగా బుద్ధుని పూజించుటకు సిద్ధముగా లేకుండిరి.

సంస్కరణ కార్యవిధానములలో స్వామి దయానందునకు, రాజా రామమోహన్‌రాయలకు మధ్య చాలా భేదమున్నది. రామమోహన రాయలు కొన్ని ఉపనిషత్తులవరకే తనను పరిమిత పరచుకొనెను. మరియు బౌద్ధిక సంస్కరణ కాధారము వేదమని యంగీకరింపజాలడు. ఇక స్వామి దయానందుడు వేదమే విశిష్టవస్తువనియు, మరియు మూర్తి పూజ వేదవిరుద్ధమగుట త్యాజ్యమనియు "సతీ" ప్రథ వేదాజ్ఞకు విరుద్ధమగుట నిందనీయమని నుడివెను. ఇంతియేగాక సామాజిక నైతిక, ధార్మికాది సంస్కరణలకు ఆధారము వేదమందేకాని, ఇతర మతములను గానీ, వారి గ్రంథములనుగానీ శరణు జొరడు. రాజారామమోహన రాయకు "సతీసహాగమన" ప్రథ తొలగించుటలో పాదరీ (క్రైస్తవు)ల సహాయ మబ్బకున్నచో, మనోవాంఛ పూర్తికాక యుండెడిది. దాని పరిణామము ? బ్రహ్మసమాజము క్రైస్తవ రాగరంజిత మైనదని

భావింపబడినది. కలకత్తాలో క్రీస్తు విషయమున బాబూ కేశవచంద్రసేన్ చేసిన ఉపన్యాసములు బ్రహ్మసమాజముపై క్రైస్తవ మత ప్రభావము ప్రబలముగా నున్నదని రుజువుచేసినవి. కాని స్వామి దయానందుని విషయమున ఆయన ఇస్లాం, క్రైస్తవ మత భావములతో ప్రభావితుడయ్యెనని పలుకు సాహస మేరికిగలదు? మొట్టమొదటి రోజులలో స్వామీజీ గుప్తరూప క్రైస్తవుడని కొందరు ప్రచారముచేసిరి. కాని సనాతన పండితులతో జరిగిన శాస్త్రార్థములలో కేవలము వేదమునే ఆయన ప్రమాణముగ నంగీకరించుటవలన ప్రజల కాభ్రమ వదలిపోయినది. సహిస్తతము ఆర్యసమాజముతో ఎంత ఘోర శత్రుత్వము గలవారైనను "ఆర్యసమాజముపై ముస్లిముల, క్రైస్తవుల ప్రభావము కలదని" అనజాలరు. పైగా దానికి విరుద్ధముగా "స్వామి దయానందుడెవరైనను గానిమ్ము ఆర్యసమాజ శిక్షాప్రచారము ఏదైనా కానిమ్ము, క్రైస్తవ మహమ్మదీయ మతముల బారినుండి వైదిక సభ్యతను, హిందూ ధర్మమును సురక్షితముగా నుంచుటకు ఆర్యసమాజము అమృతమువలె పనిచేయుచున్నదని మొత్తము హిందూ జాతియొక్క దృఢవిశ్వాసము.

## మౌ లి క త

వైదిక ధర్మము యొక్క పూర్వరూప మెంతో పరివర్తితమైనదని స్వామి దయానందుడు లేక ఆర్యసమాజము భావించును కదా! మరల ఈ జర్జరిత పుస్తక (వేద)ము నేల అనుసరించెదరు? ఇస్లాంవంటి నవీన ధర్మము నెందులకు స్వీకరించరు? అని ఒక ముస్లిం మిత్రుడు ప్రశ్నించవచ్చును. ఔను! వందల శతాబ్దములకు పూర్వ మీ వైదిక ధర్మము చాలా రమణీయముగానే యుండవచ్చును. కాని ఈ సుదీర్ఘ కాలగతిలో అందెన్నియో వికారము లుత్పన్నము లగుటచే పాసిపోయిన అన్నమువలె అది ప్రజల విశ్వాస యోగ్యతను గోల్పోయి యుండవచ్చును. ఇదే విషయమును కొందరు వేరొకతీరున:— మనము భూత కాలాభి ముఖులము కావలదు. గడచినది గడచినదే. మనదృష్టి భవిష్యత్తుపైననే ఉంచవలె. ఉన్నతియను గడియారపు ముల్లును వెను

కకు జరుపుట దోసమగును అందురు. ఐన నీమాటలు పైకెంత విలువ గలవిగా కనుపించినను వాస్తవికతాధారితములు కావు. వారు క్రొత్త దని చెప్పు (కురాన్) ఆ పేరు క్రొత్తదిగాదు. సరిగదా ! చాలా పాతది. ఆలోచించండి. మహమ్మదీయులు "వేదము ఆదికాలం నాటిదౌట చాలా పరివర్తితమైనది. కురాన్ షరీఫ్ పుట్టినది పుట్టినట్లుగా నున్న దందురు." దీనినిబట్టి యూహించినచో కురాన్ కొద్దికాలము క్రిందిదే గాన కొద్ది పరివర్తనమైనా అందుండవచ్చు ననిపించునుగదా ! లక్ష లేండ్లతో పదునాల్గువందలేండ్లకు సమానమెట్లుపొసగును ? మరొకమాట వైదిక ధర్మమందు వేర్వేరు కాలములలో వేర్వేరు దేశములలో నేయే బలహీనత లుత్పన్నములైనవో వాని యంతిమ స్వరూపము కురాన్ షరీఫ్ లేక ఇస్లామ్ సిద్ధాంతమనేది సత్యము. ఇచట ఇదెట్లు ? అను సందేహము కల్గవచ్చును. కురాన్ మరియు ఇస్లాం-ఇంజీలు యొక్క కించిత్పరివర్తిత రూపము. ఇట్లే ఇంజీల్ జబూర్ యొక్క, జబూర్ తౌరేతు యొక్క, తౌరేత్ జిందావస్థ యొక్క జిందావస్థ వైదికధర్మ యొక్క పరివర్తితాకారములు. ఈతీరుగా దృష్టిని సారించిన, పోను పోను కురాన్ యొక్క ప్రాచీనత పెరుగునేకాని తరుగదు. రొట్టె పాతదే. ఐనను రోజొక క్రొత్త పేరుతో ప్రసిద్ధిచేయబడుచున్నది. పేరు మార్చినంతనే వస్తుదశలో సౌందర్య మేమాత్ర ముత్పన్నము కానేరదు.

సంస్కృత సాహిత్యము ఈరాన్, యూనాన్, లాటిన్ భాషలను ఆదేశములను ప్రభావితపరచినట్లు అరేబియాదేశమును అరబ్బీభాషను ప్రభావిత మొనర్చలేదు. ఆకారణమున ఈరాన్ యూనాన్ లాటిన్ దేశీయులవలె భారతదేశమునకు అరబ్బు లెట్లు కృతజ్ఞులు కాగలుగు దురు ? అని కొందరు ప్రశ్నింతురు. అది అసత్యము. సంస్కృతభాషా దృష్ట్యానేగాక వైదికధర్మ సిద్ధాంత దృష్ట్యాగూడా అసంగతమే. ఎట్లన? మతభేదము లేకుండా మొత్తము ప్రపంచములోని మానవులందరు హజరత్ ఆదం హవ్వాల సంతానమేయని ముహమ్మదీయు లంగీక రించుట సత్యమేయగుచో ఒక కాలమున హిందుస్థానీయులు అరబ్ స్థానీయులు ఒకటిగానే యుండియుందురు. మరియు జీవనము గడుపు

కొనుటలో వారి పాతవిధానముల ప్రభావము రాబోవు పద్ధతులపై వికారము (ప్రస్తుత రూపమందున్నట్లు)గా పడియుండవచ్చు. అయితే ఆ చిహ్నములు పైకి గాన్పించకపోవచ్చును. ప్రపంచములోని ధర్మములు భాషలు మొత్తము వేదమునుండి, వైదికభాషనుండి పరివర్తితములైనవే యని ఆర్యసమాజ పండితులు నొక్కి వక్కాణించుచున్నారు.

ధర్మము, భాషలు యేసిద్ధాంతము ననుసరించి పరివర్తనములగుచుండునో వాని నన్వేషించినచో మనకీవిషయము తేటతెల్లమగును.

మన మొకదేశమునుండి వేరొకదేశమున కేగుదుమేని మన ప్రాచీన శబ్దావళిని కూడా వెంటగొనిపోవుదుము. శబ్దము—అర్థమని, శబ్దమని రెండుభాగములు. ఇట్లే భాషకూడా రెండుభాగములు. శబ్దరూపమందపుడపుడు పరివర్తనమగును. కాని అర్థము మాత్ర మదేయుండును. ఉదాహరణకు:—"మాతా" అను నీ సంస్కృత శబ్దము ఈరానీలో "మాదర్"గాను, ఆంగ్లమున "మదర్"గాను పరివర్తనమైనను అర్థము మాత్ర మదే. (తల్లియనియే) యున్నది. ఈ విషయమున మాదర్ శబ్దమే "మాతా"గా మారినదను వాదముకూడా తలెత్తవచ్చును. అపుడు ఈరానీభాష ముఖ్యమై, సంస్కృతభాష గౌణమగును. భారతీయులే ఈరానీయులకు కృతజ్ఞులు కావలసివచ్చును. కాని దీనిని యే శబ్దమునుండి యేశబ్ద ముత్పత్తియైనదని నించుక పరిశీలించిన చాలు, అది కాదని తేలిపోవును. "మాతా" యను శబ్దము తనరూపమునుండి మారిపోతూ, మారిపోతూ "మాదర్"గా రూపొందినది. కాని ఆ మాతృ శబ్దమునకు గల ధాత్వర్థ మిచటనేయున్నది. ఇతరభాషలవరకు పోలేదు. సంస్కృతభాషకుచెందిన మాతృశబ్దమునకు మూలము "మా" ధాతువు. దాని అర్థము జన్మ. ఈతీరుగా ఫారసీభాషలో "మాదర్" శబ్దమును సిద్ధపరచగల ధాతు వేదియునులేదు. ఆ కారణమున ఈ మాదర్ శబ్దము ఈరాన్ భాషలోనికి పోవక మునుపు సంస్కృతభాషలోని మాతా శబ్దమే యని గ్రహించబడును.

ఇట్లే మరియొక శబ్దము:—అరబ్బీ చికిత్సకులు, డాక్టర్లు "ఇతరీ ఫల్" అను శబ్దమును వాడుదురు. ఇదొక ఓషధికే పేరు. ఇది సంస్కృతము లోని "త్రిఫలా" శబ్దమునుండి మార్పుజెందిన రూపము. దానిని అరబ్బులు అరబ్బీ శబ్దముగా చేసికొనినారు. ఇందు త్రిఫలా-ఇతరీ-శబ్దాలలో ఉచ్చారణరీత్యా సమత్వ మున్నది. కాని అర్థదృష్ట్యా లేదు. త్రిఫలములన సంస్కృత భాషలో కరక, తాణి, ఉశిరి యను మూడు ఫలములు గలది, యని యర్థము.

"త్రిఫలా" యను నీశబ్దము తన అర్థము నుండి, ధాతువు నుండి వేరుకాలేదు. "ఇతరీఫల్" శబ్దమును సిద్ధపరచు ధాతువేదియును అరబ్బీ భాషలో గానరాదు. గాన ఇ త రీ ఫ ల్ అను అరబ్బీ శబ్దమునుండియే త్రిఫలాయను సంస్కృత శబ్ద మేర్పడినదని ఎవరు ననజాలరు.

ధాతురూపమునుగూడా పోల్చుకొన వీలులేనంత మార్పుచెందిన మరొక అరబ్బీ శబ్దము నిట ఉదహరింతును. అది "జమల్" అర్థము ఒంటె. ఈ జమల్ శబ్దము అరబ్బులో పుట్టినదేనా ? అరబ్బులోనే అది పుట్టినదై యున్నచో దానికి కొన్ని గుర్తులుండును. ఆ శబ్దమునకేదో యొక ధాతువుతో సంబంధముండును. దానికి సంబంధించిన చారిత్రిక సంఘటనలుకూడా ఉండును. బాగుగ నాలోచించినచో నీ "జమల్" శబ్దమునకు భాషాసంబంధములుగా అవేమిలేవు. అయితే మనమిట సంస్కృతభాషా సహాయముగొందుమేని వాస్తవికత స్పష్టముకాగలదు. సంస్కృతమున ఒంటె "క్రమేల్" అనబడును. క్రమేల్ శబ్దము "క్రమ్" ధాతువునుండి వెలువడినది. ఈ "క్రిమ్" ధాతువునకర్థము కొలచి, తూచి అడుగుముందుంచుట, ఒంటె నడకలోగల ఈ విశిష్టత మనము నిత్యముచూచుచున్నదే. ఆ నడక క్రమానుసారముగ జరుగుటనుబట్టి ఒంటె క్రిమేల్ అనబడినది. అది ఉచితమే. ఈ క్రిమేల్ శబ్దము భారత దేశము నుండి పయనించి ఇంగ్లాండుచేరి "కామెల్" గను, పశ్చిమ ఆసియాలో "గమేల్" లేక "గమల్" అయినది. అరబ్బులకు "గాఫ్" అను అక్షరోచ్చారణకష్టము. నేటికిని వారు "గ"ను "జ"గా వాడుదురు. ఈ కారణమున "గమల్" "జమల్" అయినది. అరబ్బీ భాషను వాడు

ఇతర దేశములందుకూడా ఒంటె "జమల్" అనబడును. దీనికి సంబంధించిన దొక హాస్య కథ:— క్రీ. శ. 1833 లో మిశ్రిదేశమువారు టర్కీవారి నుండి శ్యామ్ దేశములోని కొంత భాగమును జయించుకొనిరి. అప్పుడు మిశ్ర దేశీయులు కొందరచటనే యుండిపోయిరి. కొంత కాలము పిదప 1840 లో ఆ భాగమును టర్కీవారు తిరిగి స్వాధీన పరచుకొనినారు. అప్పుడు అరబ్బీ మరియు మిశ్రదేశీయులమధ్య తగాదా సంభవించినది. ఈ పోట్లాడువారిలో ఎవరరబ్బులో ఎవరు మిశ్రదేశీయులో గుర్తించుట ప్రభుత్వమువారికి చాలాకష్టమైపోయినది. అపుడు "గమల్"ను వాడు వారు మిశ్రదేశీయులని "జమల్"ను వాడువారరబ్బులని ప్రభుత్వముచే ఒక నియమమేర్పరుపబడినది. ఇపుడు అరబ్బు దేశీయుని మిశ్రదేశస్థుని మీ జమల్—గమల్ శబ్దములు ఎచటనుండి ఆరంభమైనవని ప్రశ్నించిన ప్రత్యుత్తరమిడజాలరు. ఏలనన ? ఈ శబ్దముయొక్క బాహ్యరూపము బయటి దేశములకు వెళ్లినది. కాని దాని మూలము (ధాతువు) భారత వర్షమందే నిలచి పోయినది. అదే క్రిమ్-పాదవిక్షేపణే, ధాతువు ఇదే ప్రకారము ఇతర దేశములందు ఇతర ధర్మములందు ఈ పరివర్తనలు జరిగినవి. ఉదాహరణకు:— వైదిక పండితులచే ధర్మమనబడు వస్తువు బౌద్ధపండితులచే "ధమ్మ" మనబడినది. సంస్కృత భాషవారు "కర్మ" అంటె బౌద్ధులు "కమ్మ" యందురు కాని ధర్మ, కర్మయను సంస్కృత శబ్దములందుగల ధృ, కృ, ధాతువుల ప్రభావమైతె అంతరించలేదు. అది బుద్ధధర్మములోనికేగి నశించినది. అచట బాహ్యార్థమే మిగిలినది.

ఇదే విధముగా సూక్ష్మదృష్టితో గంభీరముగా విమర్శింతుమేని సంస్కృత శబ్దములు ఇతర దేశములలో, ఇతర ధర్మములలో, ఇతర జాతులలోచేరి పరివర్తితమయ్యెను. వాని మూలధాతువును భారత దేశమందే విడచివెళ్లినట్లు బోధపడును. సంస్కృత భాషాసాహిత్యము యొక్క సహాయమును తీసికొనినచో ఆధునికుల కెరుగరాని గుప్త విషయము లెన్నియో బయల్పడును.

అందుచేతనే కాబోలు దయానందస్వామి "ధార్మిక గ్రంథము లన్నిటికిని వేదములే మూలములై ధర్మములన్నిటికి యవి ఉపకారము

చేసినవి. అనగా ఆయా ధర్మములకు మౌలికములైన వికాసమార్గము లను చూపినవి. ఇక ఆ మతములు కూడా వేదములనుండియే జీవనము పొందినవి. పొందుచున్నవి." అను రహస్యమును భేదించినారు. ఒక ధనికుని బల్లపై నొక గులాబీ పుష్పమున్నది. తత్ సౌందర్యముగ్ధుడైన యా ధనికుడా పుష్ప సంబంధము గులాబీ చెట్టు యొక్క నల్లని వ్రేళ్లతో కలిగి యున్నట్లంగీకరింపక పోవచ్చును. కాని ఈ పుష్పము తన జీవనరస మావేరునుండియే పొందిన దనుమాట ముమ్మాటికి సత్యము. ఆ మూల సంబంధమును పూర్తిగా త్రెంచివేసినచో నా పుష్పము ఎండి నశించును. ఆ స్థితి మూలమునకు కలుగదు. మూలము మూలమే యగుటవలన దాని ద్వారమున నెన్నియో క్రొత్త పుష్ప ములు కలుగును. అందుచేతనే దయానందులు ధర్మవృక్షము ఫలపుష్ప శోభితమై స్థిరముగా నుండవలెనను ఉద్దేశముతో ఆ వేదమను వేరుకు నీరుపోసిరి. మహాభారత యుద్ధానంతరము తొలుదొల్తగా వేదముల పవిత్రతను పునరుజ్జీవింపజేసిన ప్రతిభయే దయానందునిలో గల విశేషత యని చెప్ప నొప్పును.

## అద్భుత చికిత్స

మహాభారత యుద్ధానంతరము లోకమున ధార్మిక సంస్కరణ మొనర్చిన వారిలో స్వామి దయానందుని దొక విశిష్ట స్థానము. ఈ ధార్మిక సంస్కరణ మెన్నియో శ్రేణులుగా నుండినది. ఆ సంస్కరణ లకు కల్గు ప్రతిష్ఠా గౌరవములు కూడా వాని స్వరూపము (విజ్ఞానము) కార్యక్రమ విధానముల ననుసరించి యుండును. ఈ ధార్మిక సంస్కర్తలను, విభిన్న విధానము లవలంభించు వైద్యులతో పోల్చ వచ్చును. పథ్యము లేకుండ, ఖర్చు జరుగకుండా, తియ్యని మందిచ్చు వైద్యుడు మంచివాడని జనుల యభిప్రాయము. తన కిష్టమైన ఆహార విహారముల కడ్డురాక చికిత్స జరుపు వైద్యునిపట్ల రోగికిగూడా ప్రేమ కల్గుట సహజమే. అట్లుగాక తిక్త కషాయముల నిచ్చుచు, పథ్యపాన ములను శాసించు వైద్యుని వైద్యము నంగీకరించు రోగులు చాల తక్కువగా నుందురు.

ధార్మిక సంస్కర్తలపట్ల కూడా ఇదే వైఖరి ప్రత్యక్ష మైనది. వ్యక్తిగతములైన దురలవాట్లకు, ఇలవరసలకు, కులాచారములకు ఎట్టి విఘాతము కల్గనీయకుండ ఉపదేశించువారు ధార్మిక సంస్కర్తలలో మంచివారు. తిండ్లను పెండ్లిండ్లనుగూర్చి తమకు గల పూర్వపద్ధతులలో మార్పు రానీకున్నచాలు నూతన సంస్కారములపట్ల వారి విశ్వాసము లెట్లున్నను వారిని విరోధించువా రుండరు. మహమ్మదీయుల కాలమున హిందువులు చాలామంది మహమ్మదీయ మతపద్ధతులనే యవలంభించిరి. కొందరు పండితులు ముస్లింలతో నమాజ్ చేయుటలోకూడ కలిసి యుండెడివారు. కాని వివాహసంబంధముల (పిల్లనిచ్చిపుచ్చుకొనుట)లో దూరముగా నుండువారు. గృహ ప్రథలను చెక్కు చెదరనీకుండా నుంచిననే చాలు, వా డన్యమతావలంబి యైనను వాని నెవరును విరోధించకుండెడివారు. హిందువులలో నేటికిని ఒక ఉన్నతశ్రేణికి చెందిన విద్వత్సముదాయ మున్నది. వారి సంబంధ బాంధవ్యములు ఆ ఉన్నతశ్రేణిలోనే. తమ పూర్వపు రీతి, రివాజుల కేమాత్రము అడ్డంకు రానీయరు. విగ్రహారాధనమందు వి శ్వా స ము లేకున్నను "దేవాలయమునకు వెళ్లనక్కరలేదు" అను పథ్యము లేదు. ఆ సంప్రదాయమునకు చెందిన పురోహితుల జీవనోపాధికి కూడా విఘ్నము కల్గించరు. వారిండ్లలో దేవీ దేవతల పూజతోపాటు "తాజ్"ల పూజ కూడా జరుగును. తక్కిన విషయము లెట్లు మారినను ఇల వరుసలో, కుల మర్యాదలో పూ ర్వ రీ తి లో మార్పులేనందున వారి నెవ్వరు ద్వేషించరు.

దయానందులు "పూర్వపద్ధతు లెట్లున్న నట్లుండనిండు" అను వైద్యశ్రేణికి చెందినవారు కారు. వారు సంస్కరణాభిలాషులు. వారు వ్యక్తులనుండి ప్రేమ నాకాంక్షించలేదు; సరికదా ఆ ప్రేమ జాతి చికిత్సకు శత్రువనుకొనువారు. తమదృష్టిని రోగిని సంతోషపెట్టుటకు గాక వానిని బాధించు రోగమును పోగొట్టుటలోనే కేంద్రీకరించువారు. అందుచే వారి సంస్కరణయుగము, లోకుల విరోధముతో మొదలైనది.

వ్యక్తిగతములయిన చెడుగు (రోగా)లకు కారణములు సామా

న్యములైనవియే యైయుండుట వలన వాని నివారణకూడా త్వరగానే జరిగెడిది. ధార్మిక దోషా (రోగా) లకు కారణము లసాధారణము లౌట దాని చికిత్సకూడా కష్టభరితమైనదే. ఐన వైద్యులు సామాన్యముగా పైకి కన్పడు రోగ చిన్నెలకే చికిత్స చేతురు. కాని ఆరోగము లకు మూలకారణము లేమున్నవో తెలిసికొన ప్రయాసపడరు. ఈ కారణముననే స్వామి దయానందునకన్న పూర్వపు ధార్మిక సంస్కర్తల ప్రయత్నములన్నియు బాహ్య పరిణామములవరకే నిలచిపోయినవి. లోకుల ఆచార వ్యవహార పద్ధతులందేమంత విశేష సంస్కరణ జరుగ లేదు.

ఇందుకీ దిగువ ఉదాహరణము చూడుడు:—

హిందువులలో శైవ వైష్ణవ మత కలహములు చాలాకాలను నుండి జరుగుచున్నవి. శివోపాసకులు విష్ణువునకును, తద్భక్తులగు వైష్ణవులకు శత్రువులుగను, విష్ణు భక్తులు శివునకు, తద్భక్తులగు శైవులకు శత్రువులుగను యుండెడివారు. వారి వారి దేవాలయములు మాత్రమే వేర్వేరుకావు. వారి అనుష్ఠాన పద్ధతులనుండి వారు ధరించు తిలకముల వరకు అన్నియు భిన్నములే. ఈ విభిన్నతలు, వాని వలన కలిగిన వైమనస్యతలు, వివాదములు చూచిన హిందూజాతి శుభ చింతకులు "ఇదెట్లు తగ్గునా!" యని ఆలోచించిరి. ఈ విభిన్నతలెట్లున్నను పరస్పర వివాదములు, యుద్ధములు తగ్గినను బాగుండునే" అనుకొనువారు. అట్టివారిలో ఒకమహానుభావుడు తులసీదాసుగారు. వారు ఉన్నతశ్రేణికి చెందిన కవి. అంతేకాదు. గొప్ప ధార్మిక సంస్కర్త. ఆ మహాకవి రచన లందు సంఘ సంస్కార, ధార్మిక సంస్కారభావములు నిహితములై యుండెడివి. ఆ మహానుభావుడు "శివోపాసకుడు" విష్ణుద్రోహియైనచో వాడు నిజమైన శివోపాసకుడు కాడనియు, విష్ణూపాసకుడు శివద్రోహి యైనచో నిజమైన విష్ణుభక్తుడు కాడనియు, తన రచనలందడుగడుగున నుపదేశించెను. శివకేశవుల భక్తులు కలసిమెలసి జీవింపుడని ఆదేశించెను. కాని ఇది శివమూర్తి, ఇది విష్ణుమూర్తి అను భేదభావమును ప్రజలనుండి దూరముచేయ యత్నించరైరి. ఈ భేదములను సృష్టించు ఆయా

పురాణములలోని అనేకానేక కథలను విమర్శించలేదు. చివరకు సంప్రదాయ యుద్ధములకు కారణములైన శివ విష్ణు పురాణములనుగూర్చి ఇది మంచిది, ఇది చెడుదని ఏమియును ప్రకటించలేదు. ఫలితముగా పూర్వమునలె మత విరోధములు, అందులకై యనుసరించు అపార్థ, అవహేళనా పద్ధతులు కొంత తగ్గినను మూలములైన మతములు, మత భేదములు అట్లే యుండిపోయినవి.

దయానంద సరస్వతి ఈ విరోధమునకుమూలము పురాణములని, ఎంతవరకీ పురాణములలోని కల్పితగాథలే ధర్మమున కాధారములని తలంపబడుచుండునో అంతవరకు సంస్కరణ కాజాలదని, అథవా జరిగినను అది పైపైదిగా తాత్కాలికమైనదిగా మాత్రమే యగును అని గుర్తించిరి. అందుచే వారు పురాణములను కఠోరముగా ఖండించుచు, ఈ పురాణములు ధర్మశాస్త్రములు కావని, వేదశిక్షల కివి విరుద్ధములని వక్కాణించెను.

వేదములందీ శివ, విష్ణు శబ్దములు వేర్వేరు వ్యక్తుల నామ వాచకములు కావు; సరికదా ఒకే ఒక పరమాత్మకు చెందిన రెండు పేర్లు. అనగా ఒకే వస్తువునకుగల రెండు విశేషతలను ప్రకటించునవి. అప్పుడు ఉపాస్య వస్తువొకటే. దాని కాకార భేదము లేదు. కేవల మీ నామభిన్నతల మూలగా గొని యుద్ధములకు దిగుట యెవరికిని తగదు." అనెనేకాని మరెవరో అన్నట్టు శివద్రోహి విష్ణుభక్తుడు. విష్ణుద్రోహి శివభక్తుడెట్లుకాగల్గునని, దేవుండ్లిద్దరున్నట్లు చెప్పలేదు దయానందుడు. పైగా శివుడే విష్ణువు, విష్ణువే శివుడు, పరమాత్ముడొకడే ఇరువురు కారు. ఒకనికి రెండుతీర్ల మూర్తులు కల్పించుట అవిద్యా పరిచయము. శివ విష్ణు పురాణములందీరెండుపేర్లను వేర్వేరు దేవతలవిగా భావించి కల్పించిన కథలు అసత్యములు. అవి సామాన్యులకు కేవల భ్రమను కల్గించి ఒకరిపై మరొకరి నుసికొల్పునవియే." యని నిర్మొగమాటముగా చెప్పిరి. దయానందస్వామి.

దయానందుని యీ వైద్యము తీయని హోమియోగోలీ లిచ్చునట్టిది కాదు. తీవ్రమైన శస్త్రచికిత్స. ఈ చికిత్సకు భయపడినవా

రందరు దానిని విరోధించుట స్వాభావికమే కదా ! ఈ మూర్తి పూజా ఖండన భారతదేశములోని వేలాది ఆలయములకును, అచటికి దర్శనార్థులై వచ్చు కోట్లకొలది యాత్రికులకును మాత్రమే సంబంధించిన సమస్యకాదు. తదాశ్రయమున సుఖముగా జీవించు వేలకొలది పండాలు, పూజారులు ఆకటి కలమటించవలసివచ్చు భయంకర సమస్య కూడ. అందుచే విరోధ మెక్కువైనది.

ఇదేవిధముగ మానవ జీవనమునకు సంబంధించిన ప్రతి యంశమును స్వామీజీ పరిశీలించిరి. శైవులు వైష్ణవులు హోరాహోరిగా పోట్లాడుచుండిరే కాని, భారతదేశమున హిందూ సమాజము చిన్న చిన్న ముక్క (జాతు) లుగా చీలిపోవుచున్నదేయని ఒకసారియైనా ఆలోచించరైరి. ఒక్క బ్రాహ్మణజాతి వందలజాతులుగా విభక్తమైనది. క్షత్రియజాతి వందల సంఖ్యలలోను, అట్లే వైశ్య శూద్రజాతులు వేల సంఖ్యలలోను విభక్తమైనది. దేనికదే. అనగా వీనిలో తిండ్ల సంబంధం, పెండ్లిండ్ల సంబంధముండదు. ఈదుస్థితిని శైవులుకాని, వైష్ణవులుకాని మరే మతస్థులు కాని ఎదిరించలేదు. వారు:- కేవలము ఆలయములకు రండి, దర్శనము చేసికొనండి, కానుక లర్పించండి, ఆపైన మీరేమైన కాండి అనువారే. దయానందుడటుల కాదు. హిందూజాతిలోని భిన్నతలకు, పరస్పర వైరుధ్యములకు మూల మన్వేషించినారు. మరియు సకలమానవులు జన్మతః సములేనని, వారిలోని భిన్నతలు కేవల గుణ కర్మ స్వభావముల మూలమున కల్గినవేయని, ప్రతివాడు బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు కాగల్గుననియు వేదములద్వారా నిరూపించినారు. నీచకుటుంబమున జన్మించిన బాలకుడైనను సత్యధర్మానుష్ఠానములతో ఉన్నతుడు కావచ్చుననెను. ఈ మాటను ఎట్టి విశిష్ట గుణ కర్మలు లేక, కేవల జన్మాధారమున సమాజ గౌరవము ననుభవించుచున్నవారు ద్వేషించ మొదలుపెట్టిరి. విచిత్రమేమనగా:- జన్మతో బ్రాహ్మణుల మనుకొనువారు తమతో వంట, పరిచర్య మున్నగు నీచ కార్యములను చేయించుకొనువారి నేమనజాలరైరి. కాని దయానందుడు:— వీరొనర్చు కార్యములు (వంటకాదులు) శూద్రకార్యము

తోట, వీరు బ్రాహ్మణులుకారని యనుటతో వారు గుంపులుగుంపులుగా, జట్లుజట్లుగా తయారై స్వామీజీని విరోధించ మొదలిడిరి. ఇదే నిజమైన వైద్యము. నిజమైన ఆపరేషన్. ఇతరుల సంస్కరణలకును, దయానందుని సంస్కరణలకునుగల భేదమిద్దియే.

## ఇ హ ము—ప ర ము

భూమి, ఆకాశము, కలిసియే యున్నట్లు కన్పడుచున్నది. ఇప్పుడే కాదు. ఎప్పుడు నిట్లే కన్పడును. ఐన పూర్ణవ్యత్యాసములుగానుండు రెండు వస్తువుల ఉనికి చెప్పదలచుకొన్నవారు ఏమి కారణమో తెలియదు కాని "భూమ్యాకాశములవలె అవి చాలాదూరములులే" అని పోల్తురు. వాస్తవముగా ఎచట భూమియున్నదో, అచటనే ఆకాశము, ఆకాశమెటనున్నదో అచటనే భూమి ఉన్నది. ఇదే విధముగా ఏది లోకమో అదే పరలోకము, ఏది పరలోకమో అదే లోకము. ఇట దృష్టికోణమే భేదము సూక్ష్మబుద్ధితో పరిశీలింతుమేని ఈ ప్రవాహ మనంతము. దీనికి సమాప్తి లేదు. మన మెచ్చట నిలచియున్నామో ఆచోటు ఆది; మరియు అంతముకూడా. మనము "మొదలు" అనునది మధ్యనుండియే. ఏలనన? అంతకు ముందేదోయున్నది. కాని ఏదీలేకుండలేదు ఇట్లే "అంత" మనుటకూడా మధ్యనుండియే అందుము. ఏలనన, దాని తర్వాతకూడా ఏదియో ఉండియేయుండును. అనగా ఏదిలేకుండా అత్యంతాభావ ముండదు.

"అజలో అవధ్ సిరహై బశర్ కే ఖ్యాల్ కే,
హక్ తో యేహైకి హక్ థా కోఈ భీ సిరానహీ"

అనగా ఆదిఅంతములనునవి మానవుని భావనయొక్క అంచులు. సత్యమైతే ఇదియే. సత్యమునకు ఆదీలేదు అంతమూలేదు.

ప్రస్తుతము మనకాలోచనీయ విషయము ? లోకోన్నతి. మనము చేయగోరిన యాత్రయొక్క రెండు భాగములు యెట్లొకదానిపై మరొకటి ఆధారపడియుండునో అట్లే పరలోకప్రాప్తి ఇహలోకప్రాప్తి పైనాధారపడియుండును. ఉదాహరణకు:—నేను ప్రయాగ

నుండి కలకత్తాకు పోవలసియున్నదనుకొనుడు. నాయాత్రకు ప్రయాగ ఆరంభము. కలకత్తా గమ్యము (అంతము) ప్రయాగనుండి బయలుదేరి కలకత్తా చేరుటలో ఎంత సమయము గడచునో దానిని "యాత్ర" అందుము. స్పష్టీకరణకై ఈ విషయమును దిగువరీతి పోల్చవచ్చును. కలకత్తా పరలోకము. ప్రయాగనుండి బయలుదేరి కలకత్తా వరకు చేరుటలో నడకద్వారా యెంత దూరము వ్యతీత మొనరింపబడునో అది "ఇహలోకము." ఇహలోక విశిష్టత స్పష్టపడుటకై మరియొక్క ఉపమానము:—ప్రయాగనుండి కలకత్తాకు మంచి మార్గములేకున్నను (కఠిన మార్గమైనా) నేనిటనుండి బయలుదేరుటయు, నచటకు చేరుటయును కష్టమే. అందుచే యాత్ర సులభతరమగుటకే నమ్మకమైన రైలు మార్గము నిర్మింపబడియున్నది; కలకత్తా యెంతో దూరము. కొన్ని క్షణములలో పోవునది కాదు. అందుచే విసుగు కలుగకుండా యాత్ర సుఖముగా సాగవలెనని రైలులో మంచి మంచి సీట్లు, పరుండుటకై మెత్తని పరుపులు, చలి, వేడి బాధించకుండ నుండెడి వైజ్ఞానిక సాధనములు. ఆకలికింత భోజనము, దప్పియగుచో నీరు మున్నగు సౌకర్యములన్నియు సమకూర్చబడినవి. ఇక నీవు ధనశాలివేయైన, కూర్చున్న చోటనే (రేడియో ద్వారా) ప్రపంచ విషయములు తెలిసికొనగలవు. ఎంతైనను ఇది యాత్రయే. కాని గమ్యముకాదు. ఏలనన ఇన్ని సౌకర్యములున్నను యాత్రికుని దృష్టి కలకత్తా (గమ్యము) పైననేయుండును. కలకత్తా వచ్చుటతోనే నీవు దిగవలె. లేకున్న రైల్వే ఉద్యోగులు బలవంతముగా దింపుదురు. ఇదే యాత్ర, గమ్యములలోనున్న భేదము. అట్టి భేదమే ఇహపరలోకములందుండవలె.

మత మతాంతరములవారు ఇహలోకమును అధమము, త్యాజ్యమని భావించిరి. దీనిచే మానవజాతి రెండు భాగములుగా విభక్తమైనది. ఒకటి:— ఇహలోకమునే గోరువారు పరలోకమును విస్మరించినారు. వారు "అబ్ తో ఆరాంసే గుజర్ తీ హై ఆకబత్ కీ ఖబర్ ఖుదాజానే" అనుకొనువారు. కాని పాపము! యిట్టివారు ఇహలోక సుఖముల పొందజాలరైరి. ఏలనన:— ఇట్టి ఐహికా కాంక్షులను, వారి వాసనామయ

జీవనములను, శాస్త్రకారులు బొమికలను నములు కుక్కలతో పోల్చినారు. ఒక కుక్క శుష్క (ఏ మాత్రము మాంసములేని) శల్యమును పట్టుకొని కొరుక మొదలిడినది. అందీ శునక మపేక్షించిన రక్తమాంసములు లేవు. కాని ఆ కొరుకుడులో బొమికె రాపిడికి గాయమై తన చిగుళ్లనుండే రక్తమా యెముకవెంట జార మొదలయ్యెను. అప్పుడా రక్తమును అది బొమికెలోనిదేయను భ్రమతో నాకజొచ్చెను. వాస్తవమున ఆరక్త మా కుక్కదే కాని యెముకదికాదు అనగా దాని నెత్తురదే నాకుచున్నది. ఇదే విధముగా ఇహలోక మందేది సుఖదమని భావించబడునో అందలి పరలోక భావములేకున్నచో ఆ సుఖము కొద్ది కాలముననే దుఃఖముగా పరిణమించును.

ప్రశ్న:— పరలోక ప్రాప్తికి ఏ నియమము లావశ్యకములు?

ఉత్తరము:— అహింసా, సత్య, అస్తేయ, బ్రహ్మచర్య, అపరిగ్రహములు ఈ యైదు ధర్మము యొక్క విశేష లక్షణములని యోగ దర్శనము పేర్కొనినది.

అయితే ఈ నియమములు ఇహలోకమునకే హితకరములై పరలోకమునకు హానికరములా? లేక పరలోకమునకే హితకరములై ఇహమునకు హానికరములా? లేకున్న రెంటికీ హితకరములేనా? రెంటికీ హానికరములా? అనునది ఆలోచనీయము.

అహింసా, హింస ఈ రెండును విరోధ వృత్తులు. అహింసా గుణ సంపన్నుడైనవాడు ఎవరికిని చెరుపుదలపెట్టడు. ఆ అహింసావృత్తిని పాలింపనివాడు ఏ ప్రాణిపైనైనను అత్యాచారము చేయక ఆగలేడు. ఒకవేళ ఈ ప్రపంచమానవులందరు ఈ అహింసను వదలివేసిరేని ఏకార్యముకూడా నడువదు.

సభ్యతగల లౌకిక జీవనమందును, సభ్యతలేని లౌకిక జీవనమందునుగల భేద మిదియే. అసభ్యజాతులు యెట్టి లౌకికోన్నతిని చేయజాలవు. వారికి మంచి మంచి భోజనములు, వస్త్రములు, గృహములు ఉండవు. అయిన, వారు పరలోకమున కతిసన్నిహితులా? మేకములు, పులులు, సింహములు, అహింసానియమము ననుసరించవు. అవి ఇహలోక

జీవనమందు సఫలత నందినవేసా ? అహింసాపాలనము ఇహలోకోన్నతి కెంతో యవసరము, "జీవించుము, జీవించనిమ్ము"ను ఆదర్శవంతమైనది మానవ జీవనము. దానికై వలసినకృషి కళా కౌశల్యాదులేగాక, ఆర్థిక, నైతికాదులన్నియు ఈ అహింసాధారితములై నిలచినవి. వైజ్ఞానికు లొనర్చు అన్వేషణ ఆవిష్కారములందు కవులొనర్చు రచనలందు, అన్నవస్త్ర భవనాది వస్తునిర్మాణములందు సాఫల్యత కల్గుటకై ఈ అహింస చాలా అవసరము. అది లోపించుటతో సామాజికన్యాయము కొరవడి, అత్యాచారములు పెరిగి గృహయుద్ధము లారంభమగును. వానివలన ఇహలోక జీవనోన్నతికి సంబంధించిన కార్యక్రమములన్నియు వికృతములైపోవును.

ఉబహు సత్యభాషణ విషయమందుకూడా ఇదేతీరు. "సత్యమును పల్కుట పరలోక విషయమున మంచిదే కావచ్చును కాని లౌకిక విషయమందు మాత్రము అబద్ధమాడక గడుపదని" చాలామంది అభి ప్రాయపడుదురు. కాని ఇది అసత్యము, అనుభవ విరుద్ధము. సాధార ణముగా మన ప్రయాణములలో బండ్లను, గుఱ్ఱపు బండ్లను, రిక్షాలను కిరాయిపై నిర్ణయించుకొందుము. అది కాగితముపై వ్రాసికొన లేరు కదా! యనియే బండివాడును ఎక్కువ కిరాయ నడుగడు. అనగా సత్యపు విలువను సాధారణ మానవుడు కూడా గుర్తించుచున్నమాట. ఇహలోక జీవనము కష్టముగా గడుచుటవలన వానికి పరలోక దృష్టి లేక పోవచ్చును. అది వేరేవిషయము. ఒకవేళ సామాన్యమానవులీ సత్యపు విలువను నిర్లక్ష్యపరపజొచ్చిరేని లౌకిక కార్యములు నడువవు. అందుచే మనమా అహింసా సత్యాదులను, లౌకిక జీవనమందే నిత్యాభ్యాసమం దుంతుమేని ఆ గుణములు మనలో పరిపక్వతచెందును.

బాల్యమునుండియే "అబద్ధమాడకుము, అక్కచెల్లెండ్రను అన్న దమ్ములను ప్రేమించుము; అట్లు చేయకున్న కుటుంబము అస్తవ్యస్త మగునని" పెద్దలు మనకు నేర్పుదురు. అనగా మనలో నీగుణముల నెల కొల్పుటకు ఇల్లోక పాఠశాల. సత్యాచరణమందు ప్రేమ గల్గునేని

సత్యాన్వేషణకూడా జరుగును. దీనితో మానవుని దృష్టి ప్రాంతీయతను దాటి విశాలమగును, మరియు సత్యము యొక్క అనుభూతి మొదలగును.

బ్రహ్మచర్యము లౌకిక జీవనమునకు అనవసరమని లేక హాని కరమని కొందరు భావింతురు. కాని సామాజిక జీవనమునకు దృఢ మైన ఆధారము బ్రహ్మచర్యమే. ఇంద్రియములను తమ అధీనమం దుంచుకొనలేనివారు తమ కర్తవ్యములను పాలింపలేరు. అట్టివారికి ఇహము పరము రెండును చెడును. వారు స్వర్గార్హులు కాజాలరు. గాన మనోనిగ్రహము (బ్రహ్మచర్యము) చాలా అవసరము. ఇంతేగాక జీవనములోని అనాచారములను (పహ్యా కర్మలను) పూర్తిగా త్యజించ వలయును. అనాచారి, వ్యభిచారియైన మానవుడు ఆరోగ్యమును పూర్తిగా గోల్పోవును. వాడు రోగములకు కేంద్రమగును. భోజన స్వాదునుకూడా చక్కగా గ్రహింపలేడు. అట్టి జీవనము లౌకికదృష్ట్యా కూడా అసఫలమే. ఈ కారణములచే బ్రహ్మచర్యము మన ఐహిక జీవనోన్నతి కొరకే గాక ధార్మికోన్నతికొరకు గూడా అవసరమే.

ఇక అపరిగ్రహమునుగూర్చి ఆలోచింతము. పరి + గ్రహము— వస్తువును నలువైపులనుండి పట్టుకొనియుండు చిత్తవృత్తి. అటుల గానీ కుండునది అపరిగ్రహము—మనసొక వస్తువును చేరినపుడు అది అచటనే పడియుండకుండ యత్నించుట. సుఖమిడు వస్తువులు లోకమందెన్ని యో కలవు. వానితో మనకు కలుగు సంబంధము కొంతకాలమువరకే. ఈ విషయమును మరచి ఆ వస్తువు నట్లే అంటిపెట్టుకొనియుండ మొద లిడినవారికి ఎప్పుడైనను ఆవస్తువును విడువక తప్పని స్థితి వచ్చుటవలన వారికవి చాలా దుఃఖకారణమగును. ఉదా:— ఒక భోగ్యపదార్థ మును నోటి కందించుట కెంతో ప్రేమతో యత్నింతుము. అది నోట చేరి, కదలకుండ అటనే యుండజొచ్చెనేని దానిపైగల మక్కువ నశించి పహ్యా మేర్పడును. ఇట్లే తల్లి తన సంతానము నెంతో ప్రేమించును. ఎత్తుకొనును. ముద్దాడును. ఒకవేళ ఆ పిల్లవాడు తల్లి చంకనుండి క్షణ మైనను దిగనొల్లకున్నచో ఆ పిల్లవానిపై తల్లికి పవగింపు కలుగక మానదు.

ఇదే యాత్రయొక్క అంతరార్థము. యాత్రి యెట్టిదైనను యాత్రియే కాని అంతిమధ్యేయం - గమ్యముకాదు. దేనియందు అనుక్షణ మడుగులు ముందుకు సాగుచుండునో అదియే యాత్ర. అట్లుగాక అడుగుపెట్టినచోట నట్లే ఆగిపోవుచేయైన అది మంచి యాత్ర కాజాలదు.

అందుచే ఇహపరలోకముల మధ్య పెద్ద అగాధమేదియు లేదని స్వామి దయానందుని ఉపదేశము. పరలోకప్రాప్తికై సాధనమగునట్లు ఇహలోకోన్నతిని సాధింపజేసెడిదే ధర్మము. నీవెంత కాలము జీవించినను లోకమునకును, లోకులకును ఉన్నతిని సాధించుటకే జీవించుము తోడ్తో ఇది యాత్రయే కాని గమ్యము కాదని మాత్రము జ్ఞాపకముంచుకొనుము. ఈ యాత్ర ఎప్పుడో ఒకప్పుడు సమాప్తమయ్యెడిదే. కావున ఇందులోనే మున్గియుండుట, భవిష్యత్తును మరచుట పెద్ద పొరపాటగును.

స్వామి దయానందుడు ఇహపరలోకముల మధ్యగల అగాధమును పూడ్చివేసినాడు. పరస్పర విరుద్ధములైన రెండు వస్తువులకు - ఇహపరలోకాలకు - సంబంధము కల్పించినాడు. ఇదిచాలా గొప్ప విషయము. అందుచే మహాభారత కాలానంతర ముద్భవించిన ధర్మసంస్కర్తలలో స్వామి దయానందునిది విశిష్ట స్థానముగ పరిగణించబడుచున్నది.

## సంస్కరణ

మహాభారతానంతరము బుద్ధాదులు జరిపిన సంస్కరణలు సర్వాంగీణములు కావు. అందుచే వాని వలన కల్గిన సాఫల్యత తాత్కాలికమేయైనది. సమాజములోని చెడుగులను తొలగించి, దానిని ఉత్కృష్టముగా తీర్చిదిద్దుటకై ఆ మహానుభావుల యత్నములు కొంతవరకు సఫలములైనను ఆ సాఫల్యత చాల కాలము వరకు నిలువలేదు-స్వామి దయానందుడు సర్వాంగీణ సంస్కర్త. ఆయన ఏదో యొక యంశమును సంస్కరించి తృప్తిపడిన వాడుకాడు. మానవ జీవనములోని ప్రతి భాగమును పరికించినాడు; తోడ్తో దేని కెంత ప్రాధాన్యత

యివ్వవలెనో యటు లిచ్చుచు సంస్కరించినాడు ఆరోగ్య శరీరమున కుండవలసిన లక్షణములు:— ప్రతి అవయవము యథా పరిణామముగా ఎదుగుచు స్వరక్షణమందును, మరియు పూర్ణ శరీర రక్షణయందును ఉపయుక్త స్థితిలో నుండుట. అట్లు గాక శరీరములోని ఏదో యొక యవయవమే పెరిగినచో అది రోగ చిహ్నమగును. ఏలనన ఆ యవయవము తానుండవలసిన హద్దును దాటి పెరుగుటచే ఇతర అవయవములకు కష్టప్రదమగును. అందుచే ఒక సమగ్రవస్తువు ( అవయవి ) యొక్క విభిన్నావయవములయందు వృద్ధి కలుగవలసినదే; కాని అది వానివాని పరిమాణములకు ఎక్కువ తక్కువ కాకూడదు. కొందరు మహానుభావులు వైరాగ్యమును గూర్చియే విరివిరిగా ప్రబోధము చేసినారు. పరిణామముగా గృహస్థ ధర్మము కుంటువడినది. సాధువుల సంఖ్య ఎంతగనో పెరిగినది. ఇట్లే సాహిత్య సంబంధమైన ఏదో ఒక భాగమును (వ్యాకరణమును) కొందరు పండితులు బాగుగా వృద్ధిచేసినారు. తదన్య భాగములు పూర్వస్థితిలోనే యుండిపోయినవి. జగత్తు "నాశవాన్" అని కొందరు పెద్దయెత్తున చేసిన ప్రచార పరిణామముగా ప్రజలలో భౌతికోన్నతిపట్ల అశ్రద్ధ కల్గినది.

దీనికి విపరీతమైనది ద యా న ం దు ని మార్గము. వారు దేని సంస్కరణము నుద్దేశింతురో మున్ముందు దానికి గల సర్వాంశములను గంభీర దృష్టితో పరిశీలింతురు. అనగా "ఈ మిషన్‌లో ఏవస్తువుచెడినది? దేని లోపమువలన ఆ లోప ప్రభావము మొత్తము మిషనును ఏ స్థితికి తెచ్చినది?" అంతే కాని ఏదోఒక భాగమును బాగుపరచుట, పిదప వేరొక భాగము చెడిపోవుట; ఇట్టి అసంపూర్ణ సంస్కరణలను వారంగీకరించినవారు కారు.

స్వామి దయానందు డుద్దేశించిన సంస్కరణయొక్క సంపూర్ణ ప్రణాళికను పరికింపుడు. సంస్కరణమును అనుశాసించుటకై వారు వ్రాసిన ముఖ్య గ్రంథములు మూడు. (1) స త్యా ర్థ ప్ర కా శ ము, (2) సంస్కార విధి, (3) ఋగ్వేదాది భాష్య భూమిక. ఈ గ్రంథములు పరస్పర పూరకములు. ఇవిగాక ఇంకనెన్నియో గ్రంథములు వ్రాసిరి.

కాని వాని ప్రసక్తి ఇపుడనవసరము. సత్యార్థ ప్రకాశము, సంస్కార విధి సామాన్య ప్రజలకొరకు వ్రాయబడినది. ఋగ్వేదాది భాష్య భూమిక వేదాధ్యయన మొనర్చు వారికై మరియు వేదార్థ మెరుగ యత్నించు పండితుల కొరకై వ్రాయబడినది. అయినను ఆ గ్రంథ మందు సర్వసాధారణులకు అక్కరకు వచ్చు సామగ్రి యెంతయో గలదు. సత్యార్థ ప్రకాశమందు మానవ జీవనముతో సంబంధము గల అనేకాంశములలో ప్రతియంశమునకు సామూహిక జీవనమే లక్ష్యముగా నుండవలెనని బోధించు యత్న మొనర్చబడినది. దాని కనువగునట్లు జీవనాంశములలో ప్రతిదానికి నేదో యొక విధమైన సంస్కారణ అవసరమనికూడా విశదీకరించబడినది. అందుచేతనే స్వామీ జీ ఆ గ్రంథము యొక్క ద్వితీయ సముల్లాసమును మానవ జీవనారంభ (విషయ)ము నుండియే వ్రాయమొదలిడిరి. భారతదేశములోని బాల బాలికల శిక్షణయొక్క దుస్థితిని చక్కగా గుర్తించినవారౌట, స్వామీజీ సంతానోత్పత్తి ఎందుకు చేయవలె? ఎట్లు చేయవలె? అందేయే జాగ్రత్త అవసరము? అను విషయములను సత్యార్థ ప్రకాశములోని ద్వితీయ, తృతీయ సముల్లాసములందు వర్ణించిరి.

మానవ జీవనము బాల్యము మాత్రమే కాదుగదా! గార్హస్థ్యముకూడా దానికి సంబంధించినదే. దీనినిగూర్చిన నిర్దుష్ట పరిజ్ఞానమును గోరువారు సత్యార్థ ప్రకాశములోని ద్వితీయ తృతీయ సముల్లాసములతోపాటు "సంస్కారవిధి"లోని కొన్ని ప్రారంభిక (గర్భాధాన-జాతకర్మ) సంస్కారముల విధులను, ప్రథలను, వానిలోని మంతవ్యములను ఒకసారి పరిశీలించవలయును. ఏలనన సత్యార్థ ప్రకాశములో ఈ పను లెందుకుచేయవలె! వీని ముఖ్యాంశమేమి? అనువారికి వైజ్ఞానికముగా ప్రత్యుత్తర మీయబడినది. ఆ విషయములే సంస్కార విధిలో క్రియారూపము చేసి చూపించబడినవి. అయితే ఆ క్రియలు అర్థశూన్యములుకావు. అందు పఠింపబడు వేదమంత్రములను వాని నుపయోగించు పద్ధతులను సూక్ష్మబుద్ధితో పరిశీలించిన ఆ సంస్కర్త (దయానందుని) యొక్క సంపూర్ణ ప్రణాళిక మన కవగతమగును.

ప్రస్తుత మార్యసమాజకులు సత్యార్థప్రకాశమును చదువుటలో గనబరచు శ్రద్ధ సంస్కార విధిపట్ల ప్రదర్శించుటలేదు. అయినను సామాన్యముగా ప్రతిరోజు మన యిండ్లలో సంస్కారవిధితో పని కల్గుచునే యున్నది. అనగా జాతకర్మయో, నామకరణమో జరుగుచునే యున్నది. పురోహితుడు హవనము తక్కిన క్రియాకలాపము లన్నిటిని విధిపూర్వకముగా జరుపును. మనము మాత్రము ఆపని పురోహితునిదే మనది కాదనుకొందుము. వారిని ఆహ్వానించి గౌరవించి దక్షిణలిత్తుము; కాని వారు చేయించు సంస్కారములోని ఏభాగముతో మన జీవితపు ఏభాగానికి సంబంధముకలదో ఆలోచించము. జరుగనీలే, అనుకొందుము. అందుచే సంస్కార విధి పౌరోహిత్యమునకు పనికివచ్చు పుస్తకముగానే ఉండిపోయినది. దాదాపు ఉపదేశకులుకూడా దానిని తమ వ్యాఖ్యాన విషయముగా చేసికొనరు. కాని దయానందు డుద్దేశించిన సర్వాంగీణ సంస్కరణమందు మాత్రము అదియొక అంగమే.

నాల్గవ సముల్లాసమందు "సమాజ నిర్మాణమునకై ముందు కుటుంబ సంఘటన మెంతో యవసరము. అందుకై స్త్రీ పురుషులు వివాహ సంస్కారము చేసికొని ప్రజల దృష్టిలో వీరిరువురు (వేర్వేరు కాదు) "ఒక్కటే"యను భావ మేర్పడునట్లు కలసి జీవించవలయునను విషయమును దయానందుడు వ్రాసియుండిరి. ఈవిధముగా జరుగవలసిన కుటుంబ నిర్మాణమందు భారతయుద్ధానంతర మెట్టి బలహీనత లేర్పడినవి. అను విషయమై ఏ సంస్కర్తయు ఇంత శ్రద్ధను ప్రదర్శించలేదు. ఎందరెందరో ఆచార్యులు ఎన్నియో ఉద్గ్రంధములను వ్రాసిరి కాని, ఈ సంస్కరణ దృష్ట్యా స్త్రీ పురుషుల అధికారములను కర్తవ్యములను, వారి పరస్పర సంబంధములను గూర్చి స్వామీజీ గ్రంధములందున్నంత విపుల వర్ణనము యితరత్ర కన్పడదు. గృహ్యా సూత్రములవంటివి ప్రాచీన ఋషులు వ్రాసిన ప్రసిద్ధ గ్రంధములు కొన్నియున్నవి. కాని ఆ సూత్రములు ప్రధాత్మకములేకాని మీమాంసాత్మ (వివేచనాత్మ) కములుగా లేవు.

స్వామి దయానందునికన్న పూర్వము సాధారణముగా ప్రసిద్ధ

ములై యున్నవి రెండే సంస్కారములు. ౧ ఉపనయనము. ౨ వివాహము. ఉపనయన సంస్కారము బ్రాహ్మణులవరకే నిలచిపోయినది. ఇక వివాహము—ఇది సామాన్యు లనుకొనునట్లు కేవలము సంతానోత్పత్తికి సంబంధించినదేకాదు. ఆ సంతానముయొక్క ఉచితానుచితములకు, దాయభాగనుల (వారసత్వమున)కు సంబంధించిన విషయము. అందుచే వివాహము సార్వజనిక సంస్కారమైనది. అయిన నీ వివాహమొక విచిత్రవస్తువుగా తయారైనది. అనగా సంతానము కలుగుటే తడవు. ఆ కుర్రవాని తలిదండ్రులకు వాని వివాహ చింతయే మొదలగును. అంతేకాదు వాని వివాహము చేయుటే తమ ముఖ్య కర్తవ్యమని భావించుకొందురు. ఎట్లో ఆ కుర్రవానికి నాల్గేండ్లు వచ్చువరకు ఒక పిల్లను ముడిపెట్టి "అమ్మయ్య" ధన్యులము అనుకొనెడివారు ప్రతి తలిదండ్రులు

ఇట్లు జాతి దృష్టి పూర్తిగా వివాహములపైననే కేంద్రీకృతమగుటతో ఇతర కర్తవ్యములన్నియు ఉపేక్షితములై పోయినవి.

వివాహ విషయమున స్వామి దయానందు లొనర్చిన సంస్కరణ చాలా మహత్వము గలది. శంకరాచార్యులవారు తమ శిష్యురాండ్రైన రాకుమార్తెలకు "బాల్య వివాహము తగదు. పురుషులు ఎందరనో స్త్రీల వివాహ మాడెదరు; దాని నడ్డగించవలయును. దురదృష్టవశాత్తు విధవలైన స్త్రీలను గూర్చి విచారింపవలయు"నని ఉపదేశించినట్లు ఎచ్చటను కనపడదు. జాతిని గూర్చిన నిట్టి యాలోచన మా మహానుభావుల యాలోచనా క్షేత్రసీమల కావలి విషయమై యుండెనేమో తెలియదు.

స్వామి దయానందుని దృష్టిలో మానవ జీవనములోని ప్రతి చిన్న భాగముకూడా ఏమాత్ర ముపేక్షింప వీలులేని మహత్వవిషయమే. ఔను. సమర్థుడైన వైద్యుడు రోగియొక్క కండ్లు, రెప్పలు, గోళ్లు, నాలుక, నాడీ, ఎక్కిళ్ళు, దగ్గు, ఆవలింతలు మున్నగు సర్వవిషయమును పరీక్షించును. అటుల చేసినపుడే రోగమును పూర్తిగా గ్రహించి నివారించ గలుగును. ఇట్లే మంచి ఫ్యాక్టరీ అధికారి మిషన్‌లోని పెద్దవస్తువుల నెంత శ్రద్ధగా పరిశీంచునో చిన్నవస్తువులనుకూడా అట్లే పరిశీలిం

చును. ఒక్కొకసారి ఒక చిన్నవస్తువు మూలముగా మొత్తము మిషన్ ఆగిపోవును. కాలి గోరువలన కల్గిన బాధచే మొత్తము శరీరమే పని చేయలేని స్థితికి దిగజారుట, అపుడపుడు మన మనుభవించుచున్నాము కదా !

సమాజ సంస్కరణ స్థితి అక్షరాలా ఇదే. ఏ ఒక వ్యక్తియైన భ్రాంతి గ్రస్తుడై తన కర్తవ్య ముపేక్షించెనేని, ఆ పరిణామమునకు మొత్తము సమాజము గురియగును. ఉదాహరణకు:— ఒక జ్యోతిష్కుడు ఫలానా గ్రహములో కల్గిన వక్రగతి నీ కిపు డపాయమును సూచించుచున్నదని ఒక సేనానితో చెప్పగా అతడా పూట తన కర్తవ్యము నుండి తప్పుకొనెను. దాని పరిణామము శత్రువునకు జయము, మొత్తము జాతికి దాస్యము. గ్రహవిజ్ఞానము మంచిదే. కాని దానితోపాటు తానున్న భూమియొక్క జ్ఞానముంచుకొనక మరచుటే నేడు మన మొనర్చుచున్న పాతకము.

ఒక కవి:—

"నుజూం శనాశ్ కో భీ ఖలల్ హై దిమాగ్ కా,
పూఛే అగర్ జమీన్ కీ, కహే ఆస్మాన్ కీ బాత్"

అనగా జ్యోతిష్కుడు పిచ్చివాడైనాడు. భూలోక విషయ మడిగిన ద్యులోక విషయము చెప్పినాడు.

స్వామి దయానందునకు సత్యార్థ ప్రకాశములోని ద్వితీయ సముల్లాసమునందు ఫలిత జ్యోతిషమును ఖండించుట ఎంతో యవసరమైనది. ఏలనన హిందువులలో గ్రహపూజా మహత్వము అతిగా పెరిగినది. దానివలన మానవ జీవనములోని యితరభాగములు చాల దుర్బలపడిపోయినవి. మాట వరుసకు ఎవడైనా ఒక పురోహితుని వద్దకు వెళ్లి, అయ్యా ! నా కూతురునకు ఫలానా వరుడు విద్యా శారీరికాదుల వివాహ యోగ్యుడేనా ? అని ఆలోచించడు. ఆయా నక్షత్రాదుల దృష్ట్యా ఫలానా గ్రహము ఫలానా గ్రహానికెట్లా ఉంటుంది ? ఏమనుచున్నది ? ఏమి వినుచున్నది ? అని అడుగుతాడు.

యంత్రము యొక్క సక్రమ గమనమును నిరోధించు దానినే "చెడుగా" భావించవలెను. ఎంత విలువగలదియైనను, ఎంత పెద్దదైనను, ఎంత సుందరమైనదైనను సరే. దాని నవశ్యము సంస్కరించ వలసినదే. యంత్రము యొక్క సామూహిక స్థితి దృష్ట్యా దాని సర్వాంగీణ సంస్కరణ జరుపుటనివార్యము.

# సమన్వయము

స్వామి దయానందు డొనర్చిన సంస్కరణములందు అనన్య సామాన్యమైన సంస్కరణము దార్శనిక సమన్వయము. వైదిక సాహిత్యమందు షట్ శాస్త్రములను పేర "న్యాయ, వైశేషిక, సాంఖ్య, యోగ, పూర్వమీమాంస, వేదాంతము" లని ఆరు దర్శనములు ప్రసిద్ధములు. ఇంగ్లీషులో వీనిని (సిక్స్ స్కూల్స్ ఆఫ్ హిందూ ఫిలాసఫీ Six Schools of Hindu Philosophy) ఆరు స్కూళ్లందురు. "స్కూల్" ఇంగ్లీషు శబ్దము. దీని యర్థము—సాంప్రదాయము. హిందువులకు దార్శనిక సంప్రదాయములు ఆరుఅని, అవి పరస్పరభిన్నము (అనైక్యము)లు అని ప్రసిద్ధి. "సాంఖ్య దర్శన మనీశ్వర వాద గ్రంథ మని భావించబడుచుండెడిది. ఇక యోగ దర్శనమో! దాదాపు సాంఖ్యముతో సమానమైనదే యనబడెడిది. కాని ఇది ఈశ్వరాస్తిత్వము నంగీకరించును. న్యాయవైశేషికములను భౌతిక వాదములని, మీమాంసను వేదము నంగీకరించునే గాని ఈశ్వరాస్తికత నొప్పుకొనదని వాడుక. ఇక వేదాంతము—జగత్తు యొక్క అస్తిత్వమును అసత్య మనియో, మిథ్య యనియో చెప్పుచున్నదనియు, బ్రహ్మమున కతిరిక్తమైన నెట్టిపదార్థము నైనను నిత్యమని అంగీకరించదు." అని (వేదాంత దృష్టిలో బ్రహ్మమే అనాది, అనంతమైన నిత్య పదార్థము· ఆరంభము పిదప, అంతమునకు పూర్వము కన్పడునదంతయు వాస్తవికమైన అస్తిత్వము గలదికాదు. ఆ యస్తిత్వము కాల్పనికమైనది. అయ్యదియే మాయయనబడును) అని యందురు.

వైదిక ధర్మమును సంస్కరించిన వారిలో స్వామి శంకరాచార్యుడొక గొప్ప సంస్కర్త. కాని వారు తన వేదాంత దర్శన భాష్య

మందు తక్కిన అయిదు దర్శనములను చాల కటువుగా విమర్శించిరి. ఇంకను అచ్చటచ్చట న్యాయావర్శనాచార్యులను గూర్చి అపశబ్దములను కూడ వాడినారు. తత్ఫలితముగా శంకరాచార్యుని పిదప దర్శన శాస్త్రములందు పరస్పర వైరుధ్య మెంతగనో పెరుగ జొచ్చినది. ఆయా సంప్రదాయములవారు ఒకరికొకరు విరుద్ధముగా వ్రాసికొనిన సాహిత్యము కుప్పతిప్పలుగా పెరిగినది. "గురువు "గుడము" (బెల్లము) గానే యుండ శిష్యుడు శర్కరై పోయినాడ"ను సామెతను దీని కన్వయించుకొనవచ్చును.

"పీరా నమెపరంద్ మురీదామె పరానంద్"

అనగా "గురువుగారు స్వయముగాలేవరు. వారిని శిష్యులు లేపుదురు. గురువు చేరగోరని చోటుకు కూడా శిష్యులాయనను చేర్చి విడిచెదరు" అను సామెతవలె సంప్రదాయముల (వేర్వేరు భావముల) పునాదులు ఆచార్యుల ద్వారానే జరిగి యుండవచ్చును. కాని వానిని పెంచి పెద్ద చేయువారు శిష్యులే. ఈ విషయమున శంకరాచార్యుని శిష్యులు చేసినంత పనిని మరెవ్వరి శిష్యులును చేయలేదు.

స్వామి శంకరాచార్య ఉద్దండపండితులు. వారి శిష్యులు కూడా అట్టివారే. అయితే శబ్దములను మెలిపెట్టి అనుకొనిన అర్థములను తీయు పనిని గురువులను తోసి రాజని వీరే చేయసాగిరి. పర్యవసానముగా దర్శన క్షేత్రము ప్రభావవంతమే గాక అతి విస్తృతమై పోయినది. అందుచే దర్శనములను చదివి "దీని భావమిది" యని స్వయముగ నిర్ణయించుకొనగలుగుట సర్వసాధారణులకు కష్టముగా తయారైనది. ఇక విద్వాంసుల దృష్టిలో కూడా వైదిక ధర్మము నంగీకరించు దర్శన శాస్త్రవేత్తల భావములే పరస్పరము సమన్వయములు కాకపోయిన, నిక వీరితో నితర సాంప్రదాయపు (బౌద్ధ జైన) ఉన్నత వర్గీయుల భావము లెట్లు సమన్వయము కాగలవు ? అను సందేహము వ్యాపించిపోయినది. ఈ విషయమే హిందూ ధర్మమును ముక్కలు ముక్కలు చేసినది. న్యాయశాస్త్రము చదివినవారు చాల మంది నాస్తికులైరి. ఇక వేదాంత శాస్త్రముయొక్క యధ్యయన మననము

లొనర్చినవారు, ఆ వేదాంతశాస్త్రమునుకూడ "అవిద్యా లేక అవిద్యా మూలకమని భావింపజొచ్చిరి.

స్వామి దయానందులు ఈ ఆరు శాస్త్రములను అధ్యయనము చేసి ఒక క్రొత్త విషయమును వెలిబుచ్చిరి. అది ఇంతవర కెవ్వరును వినియుండనిదికాదు. ఏదేశీయ (భారతీయ) (విదేశీయ) విద్వాంసుల కును ఏ మాత్రము కూడ స్ఫురించని ఒక విశిష్ట విషయము.

ఆ విషయమందలి మొదటి ముక్కగా వారు (దయానందులు) వేదమును ఈశ్వరీయజ్ఞానమని, అది స్వతః ప్రమాణమని ఆరు శాస్త్ర ములు అంగీకరించుచున్నవనిరి. ఇది యన్నిటికన్న గొప్పది. సత్యమై నది. ఈ దర్శనములు వేదానుకూలములని ప్రకటించు సూత్రములు ఆ దర్శనములలోనే లభించును. ముందు మీమాంస" వేదోఽఖిలో ధర్మ మూలమ్" అనుచున్నది. అనగా వేదమునందేది యున్నదో అదియే ధర్మము. ఏవి ధర్మమో అదియే వైదికము. ఏది వేదానుకూలము కాదో అది ధర్మముకాదు. ధర్మమునకొకచే గీటురాయి-పరీక్షశిల. అది వేదమునకు అనుకూలముగా నుండవలయునునను. ఇక వేదాంత దర్శనమందు "శాస్త్రయోనిత్వాత్" బ్రహ్మమును శాస్త్రము (వేదము) నకు యోనిగా - కారణముగా అంగీకరించబడినది.

ఈ విషయము సత్యమే యైనచో ఆరుశాస్త్రములు పరస్పర సమన్వితములగును. ఒకవేళ వానిలో కొంత భిన్నతా దృష్టియున్నను అది గౌణము; లేక ప్రతీతి మాత్రమేయగును. ఉదాహరణకు :- ఒకే గులాబీ చెట్టుకు రెండు రకముల పూవులు పూయవచ్చును. అయినను ఆ రెండును గులాబీ పూవులే. వాని గుణములు కూడ సమానములే. వానిలో వైరుధ్య ముండదు. అయిన వాని భిన్నతకేదో విశేషార్థము- ప్రయోజనముండవచ్చును.

సత్యార్థ ప్రకాశమునందొకచోట స్వామీజీ, షడ్ దర్శనముల గూర్చిన మంతవ్యములందు వైరుధ్యములున్నవా ? యను ప్రశ్నమున కిట్లు సమాధానమిడిరి."సైద్ధాంతిక రూపముగా ఆరుశాస్త్రములొక్కచే, వానిలో నెట్టి భేదములేదు. ఏదేని భిన్నతయున్నను వర్ణనశైలియందో,

లేక దృష్టి కోణమునందో గలదు." ఉదాహరణకు:— ఒక వనస్పతీ శాస్త్రవేత్త రెండు పుస్తకములను వ్రాసెననుకొనుడు. అందు మొదటిది ఒక వృక్షము యొక్క పుష్పమును గురించి, రెండవది ఆ వృక్షము యొక్క ఫలమునుగురించి. ఇట్టి గ్రంథములలో రచయిత దృష్టి, శైలి, విభిన్నములుగా నుండును. అసంఖ్యాకములగు గ్రంథములయందనేక సందర్భములలో వర్ణించబడిన యీ పుష్పము, ఫలము, ఏ వృక్షరసముతో తమ జీవనమును, మరియు వికాసమును పొందినవో ఆ వృక్షరస మొక్కటే. అందుచే ఆ పుష్పము, ఫలము మూలతః—మౌలిక విషయములందు సమానతగలవియే యగును. ఇట్లే వేరొక విషయమును గూర్చి (రాయినిగూర్చి) వేరొక గ్రంథకర్త వ్రాసిన యీ పుస్తకము పైన పేర్కొనిన పుస్తకముల దృష్ట్యా అసమానత నెక్కువగా గలిగి యుండును.

ఈ విధముగా వైదిక సాహిత్యమందు ఆరు దర్శనములు గాక ఛందస్సు జ్యోతిష్యము మున్నగు గ్రంథము లనేకములున్నవి. ఇతరములైన ఛందస్సు మున్నగువానికన్న వేదాంత న్యాయములు, వేదాంత మీమాంసలు, చాల సమానతగలవిగా నుడువదగును.

స్వామీజీ వెలువరించిన రెండవ సంగతి:—"దర్శనములన్నియు వేదములు స్వతః ప్రమాణములని యంగీకరించుచుండగా, అవి ఈశ్వరాస్తిత్వమును యెట్లు నిషేధించగలవు?" అనునది. ఏలయన ! వేదాంగీకారమైనచో తత్కర్తయైన ఈశ్వరాంగీకారమైనట్లేగదా ! లోకములో కాళిదాసు, షేక్స్పియర్ ల గ్రంథముల నొప్పుకొనుచు, నాయా కవుల యస్తిత్వమును నిషేధించువారెవరైన నుందురా ?

సృష్టి రచన విషయము ఎన్నియో ప్రశ్నల కవకాశ మిచ్చుచున్నదందురు - దయానందులు. దీనిలో సత్యమును గ్రహించవలెనన్న తయారుచేయబడిన వస్తువు నొకదానిని తిలకించుడు. నేను కూర్చున్న యీ కుర్చీ తయారుచేయబడినదే. దీని విషయమున—దీని నెవరుచేసిరి ? ఎప్పుడు చేసిరి ? ఎంత కాలములో చేసిరి ? దేనిచే చేసిరి ? ఎవరికొరకు చేసిరి ? ఈ కుర్చీయందింకేమైన నితర పదార్థములున్నవా ? ఉన్నచో

వానితో దీనికేమి సంబంధము ? ఈ ప్రశ్నలన్నిటికి ఒకేయొక ప్రత్యుత్తరము పొసగదు. అనేకములు కావలయును. అయిన నవి పరస్పర విరోధములు కాకపోవచ్చును. ఇట్లే వేదాంత దర్శనములో విశేషముగా "బ్రహ్మమన నేమి ?" అను ప్రశ్న వేయబడినది. దానికి దేనిచే సృష్టి యొక్క రచన, పాలన, లయములు జరుగునో అది బ్రహ్మము. అని ప్రత్యుత్తర మీయబడినది. "జన్మాద్యస్యయతః" ఈసూత్రమును వ్రాసి దీని మీమాంస (వివేచన) చేయబడినది. ఊహాపోహల ననుసరించి తలెత్తిన విషయములుగూడా గౌణముగా కొంత యాలోచింపబడినవి.

ఎట్లనగా:— ఈశ్వరుడు ఉపాదాన కారణమా ? లేక నిమిత్త కారణమా ? "బ్రహ్మ జిజ్ఞాస" తమకు ఆవశ్యకమని భావింపబడుటకు కారణభూతములై అస్తిత్వముగల ఇతర పదార్థము లేమైనా ఇంక నున్నవా ? మున్నగునవి. ప్రకృతికిని జీవునకును వేరే అస్తిత్వమున్నట్లు వేదాంతదర్శనమునం దంగీకరింపబడలేదని లోకులు భావింతురు. ఈ భావన వట్టి భ్రమ. సూత్రకారుడగు వ్యాసఋషి తొలి సూత్రమందే "బ్రహ్మమును బాగుగా దెలియగోరుదము." అని వ్రాసిరి. బ్రహ్మ జ్ఞానేచ్ఛ బ్రహ్మకు భిన్నుడై బ్రహ్మముతో సంబంధముకలవానికే కల్గును. ఒకవేళ ఒకేయొక సత్తా బ్రహ్మపదార్థమేయుండి, తదితర పదార్థముల సత్తా అసలే లేకయుండినచో బ్రహ్మ జిజ్ఞాసయను విషయమే పొసగియుండెడిది కాదుగదా ! మొట్టమొదటి సూత్రమే "జగత్తులో కొన్ని అస్తిత్వము (సత్తా) గల పదార్థములున్నవి. అవి బ్రహ్మకాదు. కాని బ్రహ్మముతో సంబంధము గలవి. వాని విషయమందనేక మిథ్యావాదము లుత్పన్నములగును. కావున వానిని నీ బుద్ధియను వన్నెరాయి (ఒగిపిడి రాయి—పరీక్షాశిల) ద్వారా పరీక్షించుట యవసరము." అని వెల్లడించబడినది.

ఇవ్విధముననే వైశేషిక దర్శనమందు అగ్ని, వాయువు, ఆకాశ, పృథివీ, జలతత్వము లుల్లేఖింపబడినవి తద్గ్రంథకర్తయగు కణాద మహర్షికి జగత్తునకుగల యుపాదాన కారణముయొక్క మీమాంస (వివేచనము) చేయవలెనను నభిలాషయేగాని, బ్రహ్మమును, వేదమును

ఉపేక్షించుట గాదు. మనము వాడుకగా "ఈ కనులు, ముక్కు, చెవులు మున్నగునవి పార్థివములే; చచ్చిన పిదప మట్టిలోనే కలిసిపోవును." అని యనుచుందుము. అట్లనుటలో ఈ కనులు, ముక్కు, చెవులు, అను అవయవములకు నాజీవనముతో, నా జీవాత్మతో ఏమిసంబంధములేదు." అను అర్థము కాదుగదా! కన్నులు భౌతికములే; వాని ప్రయోగము భౌతికము కాదు. కంటితో నేను చూచెదను. చూచునది స్వయముగా కన్ను కాదు. ఇట్లే ప్రతి భౌతిక పదార్థము వెనుక అభౌతిక (ఆత్మ) సత్తా నిహితమైయున్నది. మనము దాని నుపేక్షింపజాలము, జీవన మనునదే—జీవునకు ప్రకృతికిగల యొక విశిష్ట సంయోగమునకు పేరు. ఇక ఈ (భౌతిక, ఆత్మిక) తత్త్వములకుగల యథార్థ సంబంధము యొక్క జిజ్ఞాసయే "దర్శనము" నబడును. ఏకాంగియైనదర్శనము అపూర్ణమగును.

సూత్రములలో నచ్చటచ్చట లభించు (కన్పడు) సంకేతముల ద్వారా దర్శనములందు పరస్పర విరోధములున్నట్లు తోచును. కాని వానిని కొంచెము శ్రద్ధతో పరిశీలించినచో నిది వర్ణన శైలిలోని భేదమే యనియు స్పష్టమగును. వస్తుతః ఈ రెండు (దర్శనములు)ను వేర్వేరు పద్ధతులలో చేసిన యొకే మంతవ్యము యొక్క వర్ణనములు. ఈ యుదాహరణము చూడుడు. సాంఖ్యము "నషట్ పదార్థ వాదినోవయం" "ఆరుపదార్థముల వాదము నంగీకరించువారము కాము" అని యనును. పాఠకులీ వాక్యమును చూచి కపిల, కణాదుల సిద్ధాంత మొకటి కాదని భావింపవచ్చును. కాని పై సూత్రమును పరిశీలించినచో మేము "ఆరు పదార్థముల యాధారమున జగద్వ్యాఖ్య చేయుట లేదు." అని తెల్పుటయే సాంఖ్యకారుని యభిప్రాయమని బోధపడును. అంతేకాని ఆరు పదార్థముల నంగీకరించుట అయథార్థమని కాదు. మాట వరుసకు:- ఎవరైన పోలీస్ అధికారి నిందితుని విషయమున మాకీ మనుష్యుని అపరాధముతోనే సంబంధము. వీని ఆరోగ్యమెట్లున్నది? అను దానితో కాదు. దాని నెరుగుట డాక్టర్ పని" అనునపుడు ఆ మాటవలన పోలీస్ శాఖకు వైద్యశాఖకు విరుద్ధమున్నది అను అర్థము కాదుకదా!

స్వామి దయానందులు తమ కాలమున నొక గొప్ప సంస్కర్త. వారు దర్శనకారుల సిద్ధాంతములలో, మతైక్యతను నిరూపించి స్పష్ట పరచిన మహానుభావులు. దర్శనకారులలోని యైకమత్యము ప్రకటిత మగునేని, సర్వసామాన్యులలోగల పరస్పర విరోధములు దూరమగును. అంతేగాక తమ భావమును విరోధిపక్షము వారికి నివేదించి వారిని మిత్రులనుగా చేసికొందురు. అన్నిటికన్న నిది చాలా గొప్ప సంస్కరణము. దీనిని సాధించి స్వామి దయానంద సరస్వతి అద్భుత సంస్కరణ ప్రవర్తకులైరి.

# ధర్మక్షేత్రము

భారత యుద్ధానంతర మీదేశములోని మానవ సమాజమందే గాక ఇతర దేశములలోని సమాజములందు కూడా అనేక విధములైన చెడుగులు ప్రవేశింపసాగినవి. వానిని సంస్కరించుట కెందరో మహానుభావులు ఎన్నియో విధముల శ్రమపడిరి. మహాభారత యుద్ధమున కన్న పూర్వము నెలకొనియున్న సమాజ సంఘటనమునకు "వర్ణవ్యవస్థ" యనిపేరు. ఈ శబ్దములలోని యర్థమును పరిశీలించినచో దాని కాధారమైన వస్తువుయొక్క సుస్వరూపము గోచరమగును. "వర్ణ" యనగా ఎన్నుకొనుట లేక నిచ్చయించుకొనుట. ఇక "వ్యవస్థ"-వి + అవ + స్థ - సంనియమనము, లేక సంఘటనము; అనగా సమాజము చక్కగా నడువగల్గునట్లు నియమ మేర్పరచుట. ఇందు ఎన్నిక (నిర్వాచనము) ఎన్నుకొనువారికి గల స్వతంత్రేచ్ఛను ప్రకటించును. ఆ కార్యమందేవిధమైన బయటి వత్తిడి ఉండకూడదు. అట్టి స్వాతంత్ర్యము ఉచ్ఛృంఖలము గాకుండ హద్దులేర్ప (సీమితప) రచునది. సంఘటనము లేక సంనియమనము.

మానవుడొక సమాజ ప్రాణి (Social Animal) అనబడును. అనగా మానవుని నిర్వాహము, వికాసము, సమాజముద్వారానే కల్గును. వీడెప్పుడైనను యొంటరిగా నుండగోరడు. అట్లుండుటలో నతనికి హితము లేదు. ఏలనన ! ఒంటరితనము మానవ స్వభావమునకు

విరుద్ధమేగాక వాని యావశ్యకతలకు గూడా విరుద్ధమే. విశాలదృష్టితో చూతుమేని ప్రపంచములో పశువులు, వృక్షములు పర్వతములు, నదులు కూడా సామాజికములే. ఏలనన ! వాని యుత్పత్తి, పాలనము ఇతర వస్తువుల ద్వారానే జరుగుచుండును. అయిన నిచట (మానవ సమాజ నిర్మాణమందు) అన్నిటికన్న విశిష్టమైనది - స్వయముగా మానవుని తోడ్పాటు. మానవుడా తోడ్పాటుయందేమాత్రం పొరపడినను సమాజ వ్యవస్థ అస్తవ్యస్తమైపోవును.

మనుష్యుల ప్రవృత్తులు భిన్నభిన్నములు. ఇట్టి భిన్నభిన్న ప్రవృత్తులుగల మానవులలో ప్రతివాని యాచరణము పెరవారియవసరముల పూరించునదిగను, మరియు పెరవారి యున్నతికి తోడ్పడునదిగను, స్థిరీకరించుచే వర్ణవ్యవస్థయనబడును. వర్ణమును బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రములని నాల్గుభాగములుగా వైదిక ఋషులు విభజించిరి. ఈ విభాజనము మానవీయావశ్యకతలపై మాత్రమే యాధారపడి జరిగినదికాదు. వారి వైయక్తిక విశేషతలు కూడా యందు కాధారములే. సమాజమునకు విద్య, వీరత, కళాకౌశలత, మరియు సేవ యవసరములు. ఈ యుద్దేశ్యములు ఒకే యొక వ్యక్తితోగాని, లేక ప్రతి యొకనితో గాని నెరవేరజాలవు. వీని ప్రవృత్తులు భిన్నములు. మానవుడు తన ప్రవృత్తి (స్వభావము) కనుకూలమైన పనినే చక్కగా చేయగలడు. అందుచే పైన పేర్కొనిన నాలుగు హితములలో నేదో యొక దానిని స్వయముగా నెంచుకొనుటకే మానవునకు స్వాతంత్ర్య మీయబడినది. మానవు డేదో యొకటి ఎంచుకొనవలెనను విషయమున బాధితుడే కాని, దేని నెన్నుకొనవలయును ? అను విషయమున స్వతంత్రుడే. అనగా సాంఘిక వ్యవస్థయందేమనుజుడును "నేను దేనిని ఎన్నుకొనను, నాకెందులకీ బాధ్యత ? స్వతంత్రుడుగనే యుండెదను" అని యనజాలడు. ఇట్లనుట సమాజమునకు బాధకమే కాదు ఘాతుకమను కూడా. అందు వలన ప్రతివాడు తానొనర్చుటకేదైన నొకపని నెన్నుకొనవలసినదే. అయితే యెన్నిక వాని ఇష్టానుసారమే యైనను, ఎన్నుకొనబడిన కార్యనిర్వహణము మాత్రమతని కవశ్యకర్తవ్యమైయుండును

ఆకర్తవ్యచ్యుతుడు శిక్షింపబడును. ఇదియే వర్ణవ్యవస్థ రూపము. ఈ విషయమున పుష్కల సాహిత్యమున్నను నిట విస్తృత వర్ణన మనవసరము.

మహాభారత కాలమందీ వర్ణవ్యవస్థ కొంత అస్పష్టముగా రూపొందినది. ద్రోణాచార్యుడు బ్రాహ్మణుడు, గురుడు. కాని ఆయన రాజువద్ద ఉద్యోగిగా నుండెను. ఆయనకుగల యాచార్య పదవి నామ మాత్రమైనదే. ఆ కారణమున నతడు రాజాభీష్టమునకు విరుద్ధముగ నేమియు చేయజాలకుండెను. శూద్ర కుమారుడను కారణమున ఏకలవ్యునకు విద్యనేర్పుట కంగీకరింపకుండెను. అనగా రాజవంశీయులైన రాకుమారులతో పాటు శూద్ర కుమారుని గూర్చుండబెట్టి చదువు చెప్పుట కధికారమతనికి లేకుండెను ఆ ఏకలవ్యుడెట్లో శస్త్ర విద్యాభ్యాస మొనర్చి వీరుడగుసరికి ఆ శూద్రుడు అర్జున దుర్యోధనులకన్న మిన్నకాగూడదను దృష్టిచే ద్రోణాచార్యుడు కపటోపాయమున వాని నయోగ్యునిగా చేసెను. ఇదే విధముగా సమాజమందింక నెన్నియో ఇతర బలహీనతలు ప్రవేశించినవి. రానురాను వైయక్తికాధికారమునకు చెందిన విషయము వంశగతా (కులగతా) ధికార విషయముగా మారునట్లు పరిస్థితి దిగజారినది. వర్ణములు జాతులనబడజొచ్చినవి. జ్ఞానము, ఆచరణము వర్ణమునకు గీటురాయికాగా, జాతికి జన్మమే గీటురాయి యైనది. అనగా నితడు బ్రాహ్మణుడు. ఎట్లు? బ్రాహ్మణ కులమున పుట్టుటచే. అట్లే కుమ్మర... తోడ్తో ఆ వ్యక్తికిష్టమున్నను లేకున్నను, యోగ్యతయున్నను, లేకున్నను ఆ కులములో పుట్టినవాడు గావున వాడాపనిని తప్పక చేయవలసినదే.

ఇది సమాజవ్యవస్థకు దాపురించిన దుష్పరిణామము. జాతులుండిపోయినవి; వాని పేర్లుండిపోయినవి. కాని వానిలో నుండవలసిన గుణములు, నైపుణ్యములనునవి నశించినవి. ఇంతేగాక జాతులు కూడా వందలకొలది ఏర్పడినవి. వానిలో భోజన భాజన సంబంధములు కూడ కలుపని పరిస్థితులేర్పడినవి. సమాజమునందామూలాగ్రము విషమత పెచ్చరిల్లినది.

బుద్ధ భగవానుడు సమాజమును సంస్కరించవలెనని యభిలషించిరి. అందులకాయన యొక యుపాయమునాలోచించెను. "అది భేదభావములు పారద్రోలండి అందర మొకే తీరుగనున్నాము. అందర మొకటే" అని. ఇది వర్ణనిర్వాచనము కాదు; నిర్వాచన నిరోధము (ఎన్నుకొనుట కాదు) ఎన్నిక లేకుండ చేయుట. ఇది సాంఘిక విచ్ఛిన్న మనదగునేకాని సంఘ సంస్కరణ మనజనదు. వారు ఛేదించిరేకాని సంధించలేదు. బౌద్ధ దేశములందిట్టి కులములు కులభేదములు లేకుండుట గొప్ప విషయమే. కాని అంతమాత్రమున నీ సంస్కరణము రచనాత్మక మన పిలులేదు. నిషేధాత్మకమే.

భారతవర్షమందు బుద్ధుని పిదప శ్రీ శంకరాచార్య, రామానుజాచార్యాది సంస్కర్తలుకూడా కృషిచేసిరి. వారు సమాజ సంస్కరణము (సమాజ వ్యవస్థను బాగుపరచుట) యను పనిని ముట్టనైనలేదు. కుల (జాతి) భేదములు పెరిగినవే కాని తరుగలేదు. అయినను కొందరు సాధూ సంతులు మాత్రి మీ భేదమును తొలగించిరి.

"జాత్ పాత్ పూఛే నహీ కోయ్
హరీ కో భజే సో హరీకా హోయ్."

అను నిట్టి ప్రబోధములవలన కులభేద దృష్టి కొంత తొలగినది. కాని ఆ తొలగింపు సాధు సంతులవరకే నిలచిపోయినది. గృహస్థులలో మునుపటివలెనే కులభేదము లుండిపోయినవి. బౌద్ధుల కాలమున కూడా ఇవి ఈ దేశమందున్నట్లే గోచరించును. బౌద్ధ భిక్షువు లీ భేదభావముల నొప్పుకొనకున్నను; సామాన్య మానవులలో అవి అట్లే వచ్చుచున్నవి. తీవ్రతరమౌచు వచ్చుచున్నవి. ఈ సంస్కరణ సాధువులలో జరిగినంత మాత్రమున జాతికి విశేష ప్రయోజనము కలిగించలేదు. పలయన, వివాహ, వృత్తి, వ్యాపారాది సమాజ సంబంధ బాంధవ్యములు గృహస్థుల పరముగా నుండును. కావున సామాజిక దోషములకు గృహస్థులే గురియైనారు.

స్వామి దయానందునికి పూర్వము ఇతర దేశస్థులుకూడా తమ తమ దేశములలో సంఘ సంస్కరణము చేయ నభిలషించిరి. కాని

వారి కచట నొక విషమ సమస్య యెదురైనది. అదేమన:—"ప్రతి వ్యక్తి ఒక చిన్న సమాజముతో ప్రత్యక్ష సంబంధము (Direct attachment) కలిగియుండుట. అనగా ఆ చిన్న సమాజమునకు అత డొక అవయవ మన్నమాట. ఇట్లు వ్యక్తికి-మానవ సమాజమునకు మధ్యగల ఆ చిన్న సమాజము కుటుంబను లేక కులము అని వ్యవహ రింపబడినది. దీనిఁ జూచియేకాబోలు ప్లేటో మహాశయుడు-"విద్వాం సుల (దర్శన శాస్త్రాభిజ్ఞుల)కు వివాహము, కుటుంబము, కులము అక్కరలేదు. ఉన్నతవర్గమునకు సమాజముతోనే ప్రత్యక్ష సంబంధము (Direct contact) ఉండవలెను." అని నుడివియుండెను. అనగా సమాజమున కున్నత యోగ్యతగల మానవు లవసరమైనచో వివాహ ప్రథను దూర మొనర్పవలసినదే. యని ప్లేటో మహాశయుని యభిప్రాయమై యుండనోపు. యోగ్యుడగు పురుషు డెవడైనను, యోగ్యురాలగు స్త్రీతో సంతానోత్పత్తి చేయవచ్చును. అది తలి దండ్రులదేగాక సమాజ సంతానమే యగును. దాని పాలనా వ్యవస్థ సమాజముద్వారా గాని, ప్రభుత్వముద్వారా గాని జరుగును. ఇదే ప్లేటోగారి భావము. దీనినే కొన్ని శతాబ్దములు గడిచినపిమ్మట కమ్యూనిస్టు నాయకులు కూడా వెలిబుచ్చిరి. ఐన ఈ సిద్ధాంత మెంతగనో పరీక్షింపబడినది కాని సఫలము కాలేదు.

స్వామీజీ సంస్కరణ విధానము దీనికి సర్వథా భిన్నము. వారేవిషయమును ఖండింప మొదలిడినను నిర్మాణదృష్టితోనే కాని వేరు కాదు. వైయక్తికోన్నతి (Individwal progress)కి గుణ, కర్మ, స్వభావ సమన్వయ మవసరము. వైయక్తికోన్నతి సమాజోన్నతికి రాచబాటవేయును. అనగా సమాజోన్నతిని సాధించుటకు ప్రధానమైన వర్గవ్యవస్థ సంస్కరణ మావశ్యకమని వారు గుర్తించిరి. కావుననే తొలుదొల్త భారతదేశములోని వర్ణ వ్యవస్థ గుణ, కర్మ, స్వభావ మూలకమేగాని జన్మమూలకము గాదను సిద్ధాంతమును బ్రాహ్మణులచే నంగీకరింపజేయవలెనని చాల ప్రయత్నించిరి.

స్వామీజీ ఉద్దేశ్యము వర్ణ వ్యవస్థను ఖిలమొనర్చునది కాదు. బలపరచునదే. కావున నా విధానము వర్ణ వ్యవస్థ శాశ్రియము కాగల వ్యక్తిలోని విశేషతలు స్వయం వికసితములు కాదగు మార్గము (గుణ కర్మ స్వభావ రీతి) అనియే గ్రహింపవలెను. ఇందుకై ప్రతి బాలకుడు అనివార్యముగ (తప్పని సరిగ) విద్యాభ్యాస మొనర్పవలయును. తలి దండ్రులు నీచులను నెపమున నే బాలకుడును విద్యావంచితుడు కా గూడదు. ఆర్యసమాజ పక్షమున నడుపబడు గురుకులముల యొక్క ప్రవేశపత్రములందు కులమును వ్రాయు కోష్ఠకము (Column) తీసి వేయబడినది. విద్యార్థి తన సంరక్షకుని పేరుమాత్రమే వ్రాయును.

కాశీ బ్రాహ్మణులు తమకు విద్యార్థి యొక్క కులము, వంశావళి తెలియనిచో వానికి చదువుచెప్పువారుగారు. ఆ కారణమున పాపము! బుద్ధిశాలి, పవిత్రుడైన కబీర్ కూడా విద్యా వంచితుడే యయ్యెను.

స్వామి దయానందు డారంభించిన సంస్కరణము క్రమ క్రమ ముగా భారత వర్షమున సర్వజన ప్రియము కాజొచ్చినది. [గాంధీ మహాత్ముడు ఢిల్లీ హరిజన కాలనీలోనే నివాస మేర్పరచుకొని అస్పృశ్య తను దూరమొనర్చెను.] "భారత శాసన విధానమందు అస్పృశ్యత ఒక అపరాధము. అన్ని వృత్తు లందరుచేసికొనవచ్చును. వివాహ ములలో కూడా కులబంధము నిర్బంధము కాకుండపోయినది." ఆర్య సమాజ సంవిధానమందీ కులభేదములు పాటింపబడవు. పాత సంస్కారం కొద్దిగనో, గొప్పగనో యెటనైన నున్నను అదికూడ క్రమముగ అంత రించ వలసినదే. దయానందుడీ బీజావాపన మొనర్పగా వారిభక్తు లీ క్షేత్రమును జక్కపరచుచు నీరుకట్టుచుండిరి. నేడా దయానందుని పంట పొలము గాలిలో తూగుచున్నది.

# పర్యాలోకనము

ప్రతి సంస్కరణమునకును ముఖ్య సాధనములు రెండు. ఒకటి బ్రహ్మశక్తి. రెండవది క్షాత్రశక్తి. అనగా బ్రాహ్మణుడు (విద్వాంసుడు) దురాచార దుర్వ్యవహారములను సుస్పష్టముగ ఖండించుట, ప్రజ లా

బ్రాహ్మణ ప్రబోధనములను వినుట, వానిద్వారా ప్రభావితులై తమ సామాజిక దురాచారములను విడుచుట కుద్యమించినపుడే యొక విశిష్ట సామాజిక వాతావరణ ముత్పన్నమగును. అట్టి వాతావరణమున సామాన్యముగా మానవులు దురాచారములకై సాహసించలేరు. అయినను సమాజాభిప్రాయమును లెక్కచేయనివారు, నియమోల్లంఘనాభిలాషులు ఉచ్ఛృంఖల మనస్కులు కొందరుందురు. వారి మనోదండమెవరి నెత్తిన గొట్టుటకైనను సిద్ధమే. పైగా వారు "మే మెవరికిని వెరువము. మమ్మెవరేమి చేయుదురు? అని యందురు. ఇట్టివారే దూషిత ప్రథలను సజీవముగా నుంచుటకై యత్నించుచున్నారు. వీరికొఱకు క్షాత్రశక్తి-సుదృఢ శాసకుని యవసర మెంతైనా గలదు. అతడే యిట్టి ఆతతాయులనుండి సామాన్య ప్రజలను రక్షింపగలవాడు. ఈవిధముగ బ్రాహ్మణుడు, రాజును కలసి సంఘ సంస్కరణమను మహాకార్యమును సాధించుచుందురు.

భారతయుద్ధానంతర మీ శక్తులు రెండును క్షీణించినవి. యుద్ధానంతరము నామమాత్రులై మిగిలిన బ్రాహ్మణులు రాజుల ముఖస్తుతి కర్తలైరి. ఇక "అన్నదాతా" యని పిలిపించుకొనవలసిన రాజులు:—"యథాన్నం తథామనః" అన్నట్లు బ్రాహ్మణులకు మనోదాతలు కూడ అయినారు. అన్నము ననుసరించి వారి మనసులు నిర్మించబడసాగినవి. దరిద్రుల యాలోచనములుకూడ దరిద్రములే. బ్రాహ్మణులు విద్వాంసులయ్యును, రాజులు సంతోషించునట్లుగా శాస్త్ర వ్యాఖ్యానములు చేయదొడగిరి. రాజు లింద్రియవశులై ఏక పత్నీవ్రత దూరులై బహు వివాహములు చేసికొనుట కుద్యుక్తులగుటతో బ్రాహ్మణులు వారి కోర్కెలు తీరుట కాధారములు లభించునట్లే శాస్త్రములను వ్యాఖ్యానింప మొదలిడిరి. ఉదాహరణకు:—ఒక త్రాగుబోతు రాజు ఏకాదశీ ఉపవాసము మొదలుపెట్టెను. రెండు జాముల పిదప త్రాగకున్న బ్రతుకలేని స్థితి యేర్పడినది. దానితోపాటు వ్రతమున్నచోట త్రాగుడూ, త్రాగుడున్నచోట వ్రతముండుటెట్లు? అను సంకటములో పడినాడు రాజు. అందులకై రాజు

పురోహితుని రావించి యడుగగా నా పురోహితుడు "మద్యమందు గంగాజలమును కలిపి త్రాగిన దోషముండదు" అని మహా జటిల సమస్యను పరిష్కరించెను.

ఇట్లే వొకరాజు ఒక సౌందర్యవతిని మోహించి ఎట్లు? అని పురోహితు నడుగగా ! ఆ మహానుభావుడు "యజ్ఞమం దొక యూప స్తంభమున కెన్నియో గోవులను కట్టవచ్చును.. కాని ఒక్క గోవును అనేక స్తంభములకు కట్టగూడదు; అట్లే ఒక పురుషు డెందర స్త్రీలనైనా వివాహ మాడవచ్చును. కాని ఒక స్త్రీ మాత్రము ఎక్కువమంది పురుషులను వివాహ మాడకూడద"ని బోధించెను.

ఇతర మతములలో, ఇతర దేశములలో కూడ నిట్టి యుదంత ములెన్నింటినో మనము చూడవచ్చును. "ఎనిమిదవ హెన్రీ" ఇంగ్లాండురాజు మృతుడైన తన అన్నయొక్క భార్య - హిస్పానియా దేశములోని ఆర్గన్ ప్రదేశపు రాచకన్య కెథరాయిన్ గొప్ప సౌందర్యవతి. ఆమెను మోహించినాడు రాజు. కాని క్రైస్తవధర్మ ప్రకారము వదినెను వివాహ మాడుట నిషేధము. ఐననేమి? బల వత్తరమైన రాజు కోర్కెను రోమ్ పోపు అంగీకరించినాడు. పోపుగారి యాజ్ఞతో వివాహము జరిగినది. ఆ రాజుకు కెథలాయిన్ ద్వారా "మెరీ" లేక "మెరిటూడర్" అను పుత్రిక కల్గినది. కాని చంచలమైన ఆ రాజు మనస్సు ఒక రోజు రాణీయొక్క దాసీపై హోత్తుకున్నది. అచ్చట నా కాలమున బహు వివాహములు శాసనవిరుద్ధము. ఇక యామెను పొందు టెట్లాయని యాలోచించి, ఆ రాజు పాదిరీల శరణుజొచ్చెను. (ఖుషామదీలైన పాదిరీలు, పండితులు, మౌల్వీలు, తక్కువలేరు) అపుడు పాదిరీ లాలోచించి రాజుగారి మొదటి వివాహము శాసన విరుద్ధముగా జరిగినదిగాన విడాకు లివ్వవలెనని నిర్ణయించి, కెథరాయిన్‌కు విడాకు లిప్పించి, ఆమె దాసితో వివాహము జరిపించిరి. అందుచే సంస్కరణకు సుదృఢాభిప్రాయముగల బ్రాహ్మణులు, సుదృఢాభిప్రాయముగల క్షత్రియులు కావలెను.

మహాభారత యుద్ధానంతరము బ్రాహ్మణ శక్తి, క్షత్రియశక్తి

దుర్బలములై దేశమందు బోధించువారు, దండించువారును లేని దుష్కాలము ప్రాప్తించినది. అయినను రాజుల, ప్రజల ధర్మము, మరియు శాస్త్ర మొకటేయైయుండెను. ఆ పిదప మునల్మానులు క్రైస్తవులు రంగ ప్రవేశ మొనర్చుటతో సంస్కరణ కార్యము కఠినమై పోయినది. శాసకులు హిందూ ధర్మమునందలి కుప్రథలను మత పరి వర్తనమునకై సాధనములుగా జేసికొనిరి. అనగా వారా కుప్రథలను తొలగించవలెనని ప్రచారము చేసెడివారు కారు. హిందువులు తమ కుప్రథలలోని దోషములెరిగి మత పరివర్తితులు కావలెనని (తురకలుగా క్రైస్తవులుగా మారవలెనని) యత్నించుచుండిరి. అయిన నప్పటి హిందువులు యే విధర్మ్మలకేనియు తమ ధర్మమును విమర్శించు అధికారము లేదని తఱచుగ విరోధించెడివారు.

శ్రీ రాజా రామమోహనరాయలు నిర్దయాపూరితమైన బలవత్ సహగమనమను కుప్రథను పాదిరీల తోడ్పాటుతో నాపివేయగలిగిరి. అందుచే బ్రాహ్మణులు హిందూ ధర్మములో కలుగజేసికొను నధికార మేమాత్రము క్రైస్తవ శాసకులకు లేదని విరోధించిరి. మొత్తముమీద పాలకుల, పాలితుల మతములు భిన్నములై, ఆ యా మతసంస్థలు సైతము వేర్వేరుగ స్థాపితములైయుండుటచే సంఘ సంస్కరణ కార్య మతి కఠినమైపోయినది.

స్వామి దయానందు డెదుర్కొనిన దీ కఠిన సమస్యనే. శాసకులు క్రైస్తవులు. ప్రజలు హిందువులు. బాల్య వివాహములకు విరుద్ధముగా వారి యభిప్రాయము వెల్వడుటతోనే పండితులు "మా ధార్మిక విషయ ములలో ప్రభుత్వము కలుగజేసికొనుటకును, హిందూ లా (Hindu-Law) మార్చుట కేమాత్ర మధికారి గాద"ని గోల పెట్టసాగిరి.

ముక్కుపచ్చలారని ఆడపిల్లలకు, వయోవృద్ధులతో జరుగుచున్న యసంబద్ధ వివాహములను నిరోధించుటకై యానాటి ప్రభుత్వము శాసించగా, తిలక్‌వంటి మహానుభావుడు కూడా దాని నెదిరించెను. అచట "క్రైస్తవ ప్రభుత్వమునకు మాధర్మమును మార్చు నధికారము లేదు." అనునదే యుక్తి. ఈ సమస్య నెదుర్కొనుటకై దయానందు

డొక క్రొత్త మార్గమును సూచించెను. అదేమన "మనలో నున్న ఏ ప్రథయైనను వైదిక శాస్త్రములకు విరుద్ధమైయున్నచో దానిని నివారించు పని పండితులైనను చేయబూనవలె. అటుల చేయజాలకున్నచో ఆ దుష్ట ప్రథను తొలగించుటకు ప్రభుత్వ సహాయమైనను తీసికొనుటకు సిద్ధపడవలె" అని యా సూచనయందు బేర్కొనబడెను.

1856 లో శ్రీ ఈశ్వరచంద్ర విద్యాసాగర్ యత్నించి క్రైస్తవ ప్రభుత్వ సహాయముతో విధవా పునర్వివాహ శాసన మేర్పాటు చేయించిరి. కాని అది బీరువాలలోనే మూల్గుచుండెను. ఆర్యసమాజ మీపనిని చేగొనుటతో దేశరూపమే మారిపోయినది.

సంస్కరణము ముఖ్యముగా బ్రాహ్మణ కర్తవ్యమేయని ఆర్య సమాజ మంగీకరించును. బ్రాహ్మణులు సామాన్య మానవుల మనస్సును మార్చగలరు. కాని బ్రాహ్మణుడు మందుడై కాని, బాబా వాక్యమే ప్రమాణమనువాడై కాని సంఘ సంస్కరణ భారమును స్వయముగ తలదాల్చలేనపుడు ఆర్యసమాజము ధర్మమార్గ భ్రష్టులై పోవు ప్రజలను "అది వారి కర్మ" యని వదలక ప్రభుత్వ సహాయముతో నైనను సంస్కరించవలయును. ముఖ్యోద్దేశము సంస్కరణము. అందుకై బ్రహ్మశక్తి, క్షాత్రశక్తి రెండు నావశ్యకములే. ఈ సంస్కరణ సందర్భమున ఆర్యసమాజ మెన్నియోమారులు ప్రభుత్వ సహకారమును గైకొనినది.

బాల్య వివాహ నిషేధ శాసనము చేయించినవారు శ్రీ హరవిలాస్ శారదాగారు. వా రార్యసమాజమందొక సుప్రతిష్ఠితులైన నాయకులు. ఆ చట్టము "శారదా యాక్ట్" (Sharada Act) అని వారి పేరనే వెల్వడినది.

జన్మ మూలకములైన కులబంధముల ద్రెంచి, వివాహము లొనర్చుట కనుకూలమైన శాసనము "ఆర్యసమాజ వివాహ యాక్ట్"ను పాసు చేయించినవారు శ్రీ ఘనశ్యామసింహ గుప్తగారు. వీరు దాదాపు ఏబదేండ్లనుండి ఆర్యసమాజ నేతృత్వమును వహించుచున్నారు. స్వామి దయానందుని సంస్కరణ కార్యము భారత వర్షము వరకే పరిమిత

మైనది కాదు. ఆర్య సమాజమొక సార్వభౌమిక సంస్థ. ప్రపంచమున కుపకారము చేయుట—శారీరిక, ఆధ్యాత్మిక, ఆచార, అర్థ సంబంధము లైన ఉన్నతస్థితులను లోకమునకు కలిగించుట ఆర్యసమాజ ధ్యేయము.

మహాభారత యుద్ధానంతర మీయైదువేలేండ్లలో భారత దేశ మందును, దానితోబాటు తదితర దేశములందును ఎట్టి చెడుగులు విస్తరించుటచే మానవజాతి సమస్తమసత్య మార్గమున బయనింపసాగినదో, ఆచెడుగులను దూరమొనర్చు కార్యక్రమమును స్వామి దయానందులు ప్రపంచమునకు ప్రతిపాదించిరి. దీనిని చేగొని ఆర్యసమాజికులమగు మనము శ్రద్ధాసుస్పృథగతి, ఋజుత, యీ గుణములతో ముందు కడుగిడ జాలుదుమేని మహాభారత కాలమునకన్న చాలాపూర్వమందున్న వైదిక ధర్మయుగమును పునః స్థాపిత మొనర్చగలమనుట నిర్వివాదము— నిస్సందేహము. దానికై నిర్విరామముగా కృషిచేయుట మానవుల మహత్కర్తవ్యము. అందుకే యీ చిన్నిపొత్తమంకితమైనచో నా కృషి ఫలించినట్లు.

శమిత్యోమ్

ACC.NO. 4225
294 UPA
-1-50

భారత్ ప్రింటింగ్ ప్రెస్, నాలాబజార్, సికింద్రాబాద్
ఫోన్ : 74204